
ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



ప్రఖర ప్రజ్ఞ

# యుగశక్తి  గాయత్రి



సజల శ్రద్ధ

ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహః


సంకల్పం
సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**
సంపాదకులు
**కందర్ప రామచంద్ర రావు**

**సంపుటి 6**
**సంచిక 4**
**జులై 2005**
పార్థివ జ్యేష్ఠం-ఆషాఢం
విడిప్రతి రూ॥ 8.00
సం॥ చందా రూ॥ 85
3సం॥ చందా రూ॥ 250
10 సం॥ చందా రూ॥ 750

కూర్పు
సుందర్ గ్రాఫిక్స్


## ఆధ్యాత్మికత ఆనందమయం

ఆత్మ స్వరూపం ఆనందమయం. ఆత్మజ్ఞానాన్ని పొందిన వ్యక్తి నిరంతరం ఆనందిస్తూ ఉంటాడు. ఆధ్యాత్మికతకు మరో పేరు ప్రసన్నత, ఆనందం. ఆనందంగా ఉండడం చేతకాని వ్యక్తి ఆత్మనూ తెలుసుకోలేదు, పరమాత్మనూ తెలుసుకోలేదు. దుఃఖంతో విలవిలలాడే వ్యక్తి, ఉద్విగ్నతలో మునిగే వ్యక్తి, మనక్షోభతో కుమిలిపోయే వ్యక్తి అనాత్మ తత్వాలకు వాహకుడు మాత్రమే. కోపంతే ఊగిపోయే వ్యక్తి, ఆవేశంలో చిందులు త్రొక్కే వ్యక్తి ఆస్తికతకు ఆమడ దూరంలో ఉంటాడు.

ఈ ప్రపంచంలో ఉన్నదంతా నవ్వడానికే సృష్టించబడింది. చెడ్డవీ, అశుభకరమైనవీ మన తీక్షణతకూ, మన కార్యశూరతకూ సవాళ్ళు. పరీక్షలో ప్రశ్న పత్రాలను చూచి ఏడ్చే విద్యార్థిని ఎవ్వరూ అధ్యయనశీలిగా పరిగణించరు. చిన్న చిన్న కష్టాలనూ, వైఫల్యాలనూ, ప్రతికూలతలనూ చూచి ఏడవడం మొదలుపెట్టిన వ్యక్తికి ఆధ్యాత్మికత ఉన్నదని ఎవరు నమ్ముతారు? మన శౌర్య సాహసాలను పెంచడానికీ, మన ధైర్య స్థైర్యాలను గట్టిపరచడానికీ, మన శక్తి సామర్థ్యాలను వికసింపచేయడానికీ వస్తాయి ప్రతికూల పరిస్థితులు. జీవితం సాఫీగా సాగిపోవడం సాధ్యమయితే - అది అందవిహీనంగా, వికారంగా, కళాకాంతులు లేనిదిగా తయారవుతుంది. ఎందుకంటే - సాఫీగా, సరళంగా రోజులు గడిపేవాడిలో ఎలాంటి విశిష్టతా మిగులదు, ఎలాంటి ప్రతిభా మిగులదు. అసలు - సంఘర్షణ లేకుండా ఈ ప్రపంచంలో ఎక్కడయినా ఎవడయినా ఎపుడయినా జీవించగలడా?

కొత్త కొత్త విజయాలకు మనం నవ్వుకోవాలి. ఇంతవరకు ఇన్ని అందినందుకు సంతోషాన్ని వ్యక్తపరచాలి. భవిష్యత్తులో శుభాలు కలుగుతాయని సంభావించి సదా హర్షోల్లాసాలతో జీవించాలి.

H H H

**నీ భోజనాన్ని పంచుకుని తిను. ప్రతిఫలంగా స్నేహ, సహకారాల సంపదను పొందు.**

# విషయ సూచిక

**ముఖ చిత్రం : పరమపూజ్య గురుదేవులు**

**పండిత శ్రీరామశర్మ ఆచార్య**


1. **సంపాదకీయం :**
   ఆధ్యాత్మికత ఆనందమయం 1
2. **విషయ సూచిక** 2
3. **వేద మంత్రం** 3
4. **ముఖచిత్ర కథనం - 1**
   తొమ్మిది అవతారాల సంగమం ప్రజ్ఞావతారం 4
5. **ముఖచిత్ర కథనం - 2**
   యుగద్రష్ట, యుగస్రష్ట - గురుదేవులు 11
6. **ముఖచిత్ర కథనం - 3**
   అంతరంగ అనుభూతులకు అక్షరరూపం 16
7. **ఉపాసన, సాధన, ఆరాధనల త్రివేణి - 1**
   ఉపాసన నా ఊపిరి 22
8. **గురుపూర్ణిమ వ్యాసం - 1**
   ఉపాధ్యాయుడు, ఆచార్యుడు, గురువు, సద్గురువు 25
9. **గురుపూర్ణిమ వ్యాసం - 2**
   శాశ్వత గురువును ఆరాధించే పర్వం 29
10. **ధారావాహిక : గాయత్రీ మహావిజ్ఞానం - 2**
    పంచముఖముల సంకేతం పంచ కోశములు 33
11. **ధారావాహిక : దివ్యజీవన దర్శనం - 19**
    సిద్ధిమార్గంలో పయనించే సంకల్పం - 2 36
12. **నావారితో నామాట: మహోద్యమం విరాట్ యాత్ర-6**
    విశ్వవ్యాప్తంగా యోగశిక్షణ శిబిరాలు 41
13. **విశ్వవిద్యాలయ విశేషాలు :**
    తపోమయ జీవనానికి ఆహ్వానం 43
14. **వార్తలు :**
    విశాఖలో కోటి గాయత్రి జపం,
    24 కుండముల యజ్ఞం 47


# రాష్ట్రంలో శిక్షణ శిబిరాలు

కార్యకర్తలకు ఒక శుభవార్త. హైదరాబాదులోని యుగశక్తి గాయత్రి కేంద్రం కార్యకర్తల కోసం రాష్ట్రంలోని వివిధ స్థలాలలో ఏడు రోజుల శిక్షణ శిబిరాలను నిర్వహించ దలచింది. శిబిరాలలో దేవసంస్కృతి విశ్వవిద్యాలయ విద్యార్థులు కార్యకర్తలకు యోగ, డప్లి, సంగీతం, కర్మ కాండలలో శిక్షణ ఇస్తారు.

తమ స్థలాలలో ఇలాంటి శిక్షణ శిబిరాలను నిర్వహించగోరేవారు ఆవిషయమై ఫోన్‌ద్వారాకాని, ఉత్తరంద్వారాకాని యుగశక్తి గాయత్రి కేంద్రాన్ని సంప్రదించగలరు.

**యుగశక్తి గాయత్రి కేంద్రం**
హైదరాబాదు

# చందాదారులకు విజ్ఞప్తి

యుగశక్తి గాయత్రి మాసపత్రికకు చందాను

ఐప్త్రు జూఈఙుఖఙుఊఽఙు స్త్రఙుఖఙుఊప్త్రు ఊప్త్రఏఐఊ - ఓఏఐ -ఈఃశ్రీ - ఽఖఈ పేరుమీద బ్యాంకు డ్రాఫ్టు ద్వారాకాని, చెక్కుద్వారాకాని పంపగోరుతాము.

# జూలై, ఆగస్టు నెలలలో పర్వదినాలు

**జూలై :**

9. జగన్నాథ రథయాత్ర
21. గురు పూర్ణిమ.
23. తిలక్ జయంతి.

**ఆగస్టు :**

12. తులసీదాసు జయంతి.
15. స్వాతంత్ర్య దినోత్సవం.
    అరవింద జయంతి.
19. రక్షాబంధన్, శ్రావణ పూర్ణిమ.
26. కృష్ణాష్టమి.

**గాయత్రీ మాతను శ్రద్ధతో ఆరాధించే వ్యక్తి ఎన్నడూ నిరాశ పొందడు.**

# వేద మంత్రం

*భద్రమిచ్ఛన్త ఋషయః స్వర్విదస్తపో దీక్షాముపనిషేదురగ్రే ।*
*తతో రాష్ట్రం బలమోజశ్చ జాతం తదస్మై దేవా ఉపసంనమన్తు ॥*

- అధర్వవేదం 19/41/1

**భావార్థం :** ఆత్మకల్యాణం కోరే పురుషునకు మొదట తపోదీక్ష ఇవ్వబడుతుంది. దానితో శరీర బలం, మనో బలం, పదవి, ప్రతిష్ఠ లభిస్తాయి. సుఖం ప్రాప్తిస్తుంది.

**సందేశం :** ప్రపంచంలోని మహాపురుషులందరూ తపస్సుకు చాలా ప్రాముఖ్యత నిచ్చారు. జీవితంలో అధికాధిక సుఖ ప్రాప్తికి, ఆనంద ప్రాప్తికి తపస్సు ఆవశ్యకం. అసలు తపస్సు అంటే ఏమిటి? నేడు తపస్సు పేరుతో మోసం చాలా జరుగుతున్నది. తమ శరీరాన్ని రకరకాలుగా కష్టపెట్టుట తపస్సు కాదు. తపస్సు యొక్క అర్థం ధర్మం, సత్యం, న్యాయముల మార్గంలో నడుస్తూ ఎన్ని బాధలు, ఆటంకములు వచ్చినా ముందుకు వెళ్తూ ఉండుట. తపస్సు యొక్క అర్థం - ఆకలి, దప్పిక, శీతోష్ణాలు, సుఖ దుఃఖాలు, శోకం - సంతోషం, మానావమానాలు అన్నింటినీ సమభావంతో సహించుట. శరీరం పూర్తి ఆరోగ్యంగా ఉండేటట్లు భోజనం, వస్త్రములు, వ్యాయామం, విశ్రాంతి, అధ్యయనం మున్నగు విషయాలలో ఆవశ్యకతానుసారం ఆచరణయే తపస్సు.

గీతానుసారం తపస్సు 3 ప్రకారములు - శారీరిక తపస్సు, వాచక తపస్సు, మానసిక తపస్సు. శరీరంతో మనం గురువు, బ్రాహ్మణులు, విద్వాంసులు మున్నగు వారిని పూజించాలి. నమ్రత, వినయం కలిగి ఉండాలి. పవిత్రులము, నిర్మలులమై ఉండాలి. కన్నులు, చెవులు, చేతులు, కాళ్ళు, నాలుక మున్నగు అన్ని ఇంద్రియములను వశంలో ఉంచుకోవాలి. ఏ ప్రాణికీ కష్టం కలిగించకూడదు. వాక్కుతో ఇతరులకు కష్టం కలిగించే, గుచ్చుకొనే మాటలు అనగూడదు. ఎల్లప్పుడూ సత్యం చెప్పాలి, కానీ కటువుగా చెప్పగూడదు. ప్రియంగా, మధురంగా చెప్పాలి. ఇది వాచక తపస్సు. ఉత్తమ గ్రంథముల అధ్యయనం, చింతన, మననం చేయాలి. మనస్సులో మనం ప్రసన్నంగా, శాంతంగా, మౌనంగా ఉండాలి. మనస్సును నిగ్రహించాలి. అంతకరణను పవిత్రంగా ఉంచుకోవాలి. ఇది మానసిక తపస్సు.

మనుష్యుల క్షుద్ర స్వార్థం ఈ ఉన్నత భావనలకు విరోధి. అందుకే ఋషులు చాలా కష్టాలు సహించాల్సి వచ్చింది, పెద్ద పెద్ద తపస్సులు చేయవలసి వచ్చింది. కానీ వారు ధృఢ సంకల్ప వ్రతం స్వీకరించారు, దీక్షితులైనారు, ఇందుకోసమే జన్మించా రనుకోవాలి. అందుకే తమ వ్రతాన్ని పూర్తి చేశారు. వారికి తమకంటూ స్వార్థం లేదు. కేవలం లోకకల్యాణం కోసమే తపస్సు అనుష్ఠించారు.

ఎక్కువ మంది ప్రజల భ్రమ తపస్సు ఘోరారణ్యాలలో జరుగుతుందని; దానిలో ఆకలి దప్పికలతో శరీరాన్ని శుష్కింపచేయాలని. ఈ అభిప్రాయం పూర్తిగా ఆధారరహితం. సత్యమేమిటంటే - ప్రపంచంలో ఉంటూ విపరీత పరిస్థితులను ఎదుర్కొనుటయే తపస్సు. దీనితో శరీరం, మనస్సు, ఆత్మల శక్తి పెరుగుతుంది.

తపస్సు యొక్క వాస్తవిక అర్థం తమ వ్యక్తిగత స్వార్థాన్ని త్యాగం చేయడం. అందరూ ఒకరికొకరి మేలు కోరుతూ, సాముహిక హితభావన ఉత్పన్నం చేయాలి. వ్యక్తులందరిలో ఉత్పన్నమైన ఈ భావన యొక్క మూర్తియే దేశం. అటువంటి తపస్వులైన నాగరికుల శక్తియే దేశాన్ని శక్తివంతం, తేజస్వంతం చేస్తుంది. భగీరథునివంటి ఋషుల తపో ప్రభావంతో ఈ భారతదేశం 'స్వర్గాదపి గరీయసి'గా పిలువబడింది, ప్రపంచంలో 'బంగారు చిలుక'గా కీర్తి పొందింది. సమాజహితంలో, దేశహితంలో తమ సర్వస్వం అర్పించుటయే తపస్సు.

తపస్సు యొక్క వాస్తవిక అర్థమును మన రోజువారీ జీవితంలో ఆచరించి మనం కూడా ఉన్నత శిఖరాలను అధిష్ఠించవచ్చు.

H H H

**సాధన అంటే - కష్టాలతో సంఘర్షిస్తూ సత్ కృషిని కొనసాగించడం.**

## ముఖచిత్ర కథనం-1

# తొమ్మిది అవతారాల సంగమం ప్రజ్ఞావతారం

*ఇంతవరకు దిగివచ్చిన అవతారాలు వేర్వేరు పరిస్థితులకు అనుగుణంగా యుగ పరివర్తనను, ధర్మ సంస్థాపనను సాధించాయి. ఈ యుగంలో ఆయా పరిస్థితులన్నీ ఏకమైనాయి. కనుక - ప్రజ్ఞావతారం అన్ని అవతారాల సంగమం ఎలా అయిందో తులనాత్మక అధ్యయనంద్వారా వివరిస్తోంది ఈ వ్యాసం.*

### యుగ ప్రవాహాన్ని మార్చిన మత్స్యావతారం

మను భగవానుడు ఒక రోజున ఉపాసన ముగించాడు. దోసిలిలో నీరు నింపి సూర్య భగవానునికి అర్ఘ్యం ఇస్తున్నాడు. అప్పుడు ఆయనకు ఒక క్షీణమైన స్వరం ఇలా వినిపించింది - 'మనువూ నావైపు చూడు. నాకు నీ సహాయం కావాలి.'

మనువు చూచాడు. తన దోసిలిలో ఒక చిన్న చేప తిరుగుతోంది. ఆ స్వరం దానినుండే వస్తోంది. ఆయన ఇలా అడిగాడు-

'మీరు దేవ పురుషునివలె కనబడుతున్నారు. నేను చేయవలసిన సహాయం ఏమిటో చెప్పండి.'

ఆ చేప ఇలా అన్నది -

'నేను ఒక పెద్ద పని చేయాలి. ఈ సరస్సు చిన్నదిగా ఉంది. నన్ను గంగవరకు చేర్చండి.'

ఆ అలౌకిక పురుషుని తీయని పలుకులు మను భగవానుని హృదయాన్ని కదిలించాయి. ఆయన ఆ మత్స్య పురుషుణ్ణి తన కమండలంలోనికి తీసుకున్నాడు. అతడిని పెద్ద సరస్సుకు చేర్చాడు.

ఒక పర్వదినాన మను భగవానుడు ఆ స్థలానికి వెళ్లాడు. ఆయనకు తిరిగి ఆ మత్స్య పురుషుని దర్శనం అయింది. ఆ దేవ పురుషుడు మనువును పిలిచి ఇలా అన్నాడు-

'నా ఆకారం పెరుగుతోంది. నన్ను సముద్రంలోనికి చేర్చండి.'

మను భగవానుడు ఆయనను సముద్రంలోనికి చేర్చాడు.

ఆ తర్వాత జల ప్రళయం వచ్చింది. సృష్టి అంతా మునిగిపోతోంది. అప్పుడు మత్స్య భగవానుడు సప్త ఋషులను తన వీపుమీద కూర్చోబెట్టుకున్నాడు. వారిని హిమాలయ శిఖరాగ్రానికి చేర్చాడు. వారు అక్కడనుండి వేదాన్ని (ఆధ్యాత్మిక జ్ఞానం), సంస్కృతిని తిరిగి విశ్వమంతటికీ వ్యాప్తిచేశారు.

ఇదీ పురాణాలలో ఉన్న మత్స్యావతార కథ.

చేప అవతారం కావడం విచిత్రం అనిపించవచ్చు. అది అతీంద్రియ శక్తి కలిగిన మనిషిలా ప్రవర్తించడం మరింత అసమంజసం అనిపించవచ్చు.

అయితే, ప్రాచీన కాలంలో పెద్దపెద్ద సిద్ధాంతాలను ఆలంకారిక భాషలో, సూత్రంగా వర్ణించే సంప్రదాయం ఉండేది. శాస్త్ర విజ్ఞానం అనుసరించే పద్ధతికూడ ఇదే. బైనామియల్ థీరమ్ ఒకే పంక్తిలో ఇచ్చిన సమీకరణం. కానీ, దాని విస్తరణ చాలా పెద్దది. ఐన్‌స్టీన్ ప్రతిపాదించిన శక్తి సిద్ధాంతం ఈ = ఎమ్.సి స్క్వేర్ మాత్రమే. కానీ, దాని పరిణతి చాలా విస్తృతమైనది.

భారతీయ దర్శనం ప్రతిపాదనలు కూడ ఇలాంటివే. మొదటి అయిదు అవతారాలలో ఈ సిద్ధాంతమే కానవస్తుంది. అందువల్ల మేధావులు దానిని అర్థం చేసుకుంటారు. అహంకారులూ, గొప్పతనాన్ని కోరుకునేవారూ అది తమదని గొప్పలు చెప్పుకునే అవకాశం ఉండదు. ఈనాడు జరుగుతున్నది ఇదే. జ్యోతిష శాస్త్రం ప్రకారం ఇది కల్కి అవతరణ సమయం. కనుకనే కొందరు తామే కల్కి (నిష్కళంక) అవతారమని చెప్పుకుంటున్నారు. కానీ, వారు ఆ అవతారం కాలిగోరుకు కూడా సరిపోరు. ఏదో ఒక రోజున నిజం బయటపడుతుంది.

**ఆత్మ సంస్కరణకు నిరంతర కృషియే జీవన సాధన.**

బహుశా ఈ కారణంవల్లనే ప్రాచీన కాలంలో ఈ వర్ణన ఆలంకారికంగా చేయబడి ఉండవచ్చు.

చేప ప్రవాహానికి ఎదురీదుతుంది. చాలా చిన్నదీ అవుతుంది. చాలా పెద్దదీ అవుతుంది. మనువు అంటే అర్థం - సృష్టిపట్ల ప్రేమ, మమత ఉన్న వ్యక్తి. సృష్టిని వినాశనంనుండి రక్షించాలనే కరుణ కలిగిన వ్యక్తి.

గాయత్రీ పరివార్‌యొక్క, దాని జన్మదాతయొక్క కార్యశూరత, కార్య సరళి ఈ తరహాలో ఉంది. ఆయన చాలా కాలంగా కొనసాగుతూవస్తున్న కట్టుబాట్లను కూలద్రోశారు. దేశానికీ, ప్రపంచానికీ వైదిక ధర్మంలోని, భారతీయ సంస్కృతిలోని తత్వజ్ఞానాన్ని అందించారు. ప్రతీపశక్తులు తమ శక్తులన్నీ ఒడ్డి ఆయనను ప్రతిఘటించాయి. 'గాయత్రి బ్రాహ్మణులది. ఆ మంత్రాన్ని చెవిలో చెప్పాలి. అది మహిళలకు నిషిద్ధం. బ్రాహ్మణులు మాత్రమే యజ్ఞం చేయాలి. జన్మవల్ల మనుషులు బ్రాహ్మణులు అవుతారు. అధ్యాత్మ అంటే బొట్టు, పువ్వులు, మాల త్రిప్పడం మాత్రమే' - అనే వాదాలను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. మరోప్రక్క - అధ్యాత్మకు పునర్జన్మ ఇచ్చారు.

ఆయన గాయత్రీ మహావిద్యపై మూడు ఖండాల మహా గ్రంథాన్ని రచించారు. నేడు చిన్నా పెద్దా, బాలురూ, వృద్ధులూ, స్త్రీలూ పురుషులూ - అంతా గాయత్రీ ఉపాసన జరుపుతున్నారు. ఆత్మబోధ దిశలో ముందుకుపోతున్నారు. అందరూ వారిని సమర్థిస్తున్నారు. భారతీయ సంస్కృతికి తల్లి దండ్రులు అయిన గాయత్రి, యజ్ఞములను, ఋషి పరంపరయొక్క అధ్యాత్మను ఆయన వినాశకర పరిస్థితులనుండి కాపాడారు. హిమాలయం (శాంతికుంజ్)లో వాటిని ప్రతిష్ఠించారు. పరమశివుని జటాజూటంనుండి ప్రవహించిన గంగవలె - అక్కడనుండి అవి ప్రవహిస్తున్నాయి. ఆ రాకకు ప్రజలు ఆనందిస్తున్నారు.

ఆయన మొదట భావనాశీలురను కమండలం (హృదయం)లోనికి తీసుకున్నారు. వారికి మొదట గాయత్రీ ఉపాసన నేర్పారు. ఆ తర్వాత ఉపాసన చేయించడం నేర్పారు. సమయదానం, అంశదానం, శాఖలు స్థాపించడం నేర్పారు. ప్రజా సమ్మేళనాలు నిర్వహించడం, శక్తిపీఠాలు స్థాపించడం నేర్పారు. ఉన్నత స్థాయి సాధనలవరకు వారిని తీసుకువెళ్లారు. వారిచేత ఋషి సంస్కృతిని బోధింపజేశారు. దానిని రక్షించారు. లేకపోతే - నేటి వృత్తిపరమైన ఆశ్రమాలతోపాటు, సంత్ మహంత్‌లతోపాటు ఈ జ్ఞానంకూడ మునిగిపోయేది. ఇవన్నీ ఆయన తొలిదశలో చేశారు. ఇప్పుడు ఆయన వీటికి విరాట్ రక్షకుడు అయినారు.

ఇలా మత్స్యావతారం ప్రజ్ఞావతారం యొక్క కణ కణంలో వ్యాప్తిచెందడాన్ని మనం చూడవచ్చు.

## భౌతికతకూ, ఆత్మికతకూ సమన్వయం కూర్మావతారం

సురులూ, అసురులూ బ్రహ్మకు పుత్రులు. వారిమధ్య నిరంతరం యుద్ధాలు జరిగేవి. ఇరు పక్షాలూ నష్టపోయేవి. కనుక, ఇరు పక్షాలవారూ బ్రహ్మవద్దకు వెళ్లారు. శాంతి స్థాపనకు మార్గం సూచించమని అడిగారు. సముద్రాన్ని మథించమని బ్రహ్మ వారికి సలహా ఇచ్చాడు. మందర పర్వతాన్ని కవ్వంగా, ఆదిశేషుణ్ణి కవ్వపుతాడుగా చేసుకోమని చెప్పాడు. చిలకడంకోసం ఒక ప్రక్కన దేవతలు, మరోప్రక్కన అసురులూ నిలిచారు. ఈ చిలకడంవల్ల భూమి బ్రద్దలవుతుందనే సమస్య ఏర్పడింది. మరి ఈ భారాన్ని ఎవరు మోస్తారు? వారు భగవానుని ప్రార్థించారు. ఆయన కూర్మం (తాబేలు)గా అవతరించి, తన వీపుమీద ఆ బరువును మోశాడు. సముద్ర మథనం జరిగింది. ఫలితంగా 14 రత్నాలు వెలికివచ్చాయి. వాటివల్ల దేవతలూ, అసురులూ సుఖించారు.

ఇదీ కూర్మావతార కథ.

ఈ కథలో శరీర విజ్ఞానం, సమాజ శాస్త్రం, సాధనా విజ్ఞానముల అద్భుత సమన్వయం ఉంది.

తాబేలు ఇంత పెద్ద పర్వతాన్ని ఎలా మోయగలిగింది? సముద్రాన్ని మథించడం ఎలా సాధ్యం? అదీ విషం క్రక్కే సర్పంతోనా? అయినా కూర్మావతారం కథ వీటిని నిజం చేస్తోంది.

**బుద్ధిని నిర్మలమూ, పవిత్రమూ, ఉత్కృష్టమూ చేసేది గాయత్రీ మంత్రం.**

సముద్ర మథనం ద్వారా వెలువడిన 14 రత్నాలలో అమృతమూ ఉంది, విషమూ ఉంది. రెండూ జీవితంలో ఎలా ఉపయోగపడతాయో, కూర్మావతారంలోని ఈ రహస్యం ఏమిటో ప్రజ్ఞావతారం వెల్లడిస్తుంది.

భోగ విలాసాలను అనుభవించడమే జీవన లక్ష్యమనీ, అందుకోసం ఇతరులను పీడించినా తప్పులేదనీ భావించేవారు అసురులు. ఇది భౌతికవాదం ఇది బుద్ధివాదం. ఇది విజ్ఞానవాదం.

నేటి ప్రపంచంలో ఈ త్రిపురాసురులు సర్వత్రా కనిపిస్తున్నారు. ఈ భౌతికవాద సిద్ధాంతాలు కారణంగానే నేడు ప్రపంచంలో పరపీడన పరాయణత్వం, దోపిడీ, నేరం, అవాంఛనీయతలు, దొంగతనం, బలాత్కారం, లూటీలు, హత్యలు ఇంతగా చెలరేగుతున్నాయి. పర్యావరణ కాలుష్యంనుండి విశ్వాస సంక్షోభంవరకు రకరకాల వినాశకర పరిణామాలు కానవస్తున్నాయి. శ్రద్ధా విశ్వాసాలు లోపించిన సమాజం సంవేదనలూ, హృదయ స్పందనలూ లేని జడ సమాజం అవుతుంది. ఈ జడత్వం నేడు అన్ని రంగాలలో గోచరిస్తోంది. సంవేదనల ప్రవాహాలు పూర్తిగా ఇంకిపోయాయి, నేడు భార్యాభర్తల మధ్య నమ్మకం లోపిస్తోంది. తండ్రీ కొడుకులమధ్య వైమనస్యం ఏర్పడుతోంది. అన్నదమ్ముల మధ్య కలతలు వస్తున్నాయి. ఇదంతా అసురత్వంనుండి జనించిన దుఃఖం. స్వార్థంతో నిండిన భోగవాదం ఫలితం ఇది, మనిషి వట్టి శరీరం మాత్రమేనని నమ్మడంవల్ల కలిగిన దుష్పరిణామం ఇది.

మరో ప్రక్క - అధ్యాత్మయే సర్వస్వమని భావించి మానవతా విలువలను మరచిపోవడంవల్ల నేడు మతం గ్రుడ్డి నమ్మకంగా తయారయింది. తీర్థ క్షేత్రాలలో దుకాణాలు; ఆశ్రమాలు, మఠాలు, దేవాలయాలు ఒకవిధంగా దుకాణాలు; కపట సన్యాసులూ, సాధువులూ ప్రజలను దోచుకోవడం - ఇదంతా మతానికి పట్టిన మురికికి గుర్తు. రాజకీయాలలో అవినీతిని కొంతవరకు క్షమించవచ్చునేమో. కానీ, ఆధ్యాత్మిక రంగంలో అవినీతి ప్రవేశిస్తే సర్వనాశనం తప్పదు. దేవత్వం పాక్షికం కావడం దీనికి మూలం.

ఈ రెండింటినీ ఒకే త్రాటిమీదికి తేవడమే సముద్ర మథనం. సాధన గీటురాయిగా జీవితాన్ని మథించాలి. దీనివల్ల ప్రాపంచిక కర్తవ్యాలపట్ల అవగాహన ఏర్పడుతుంది; ఆధ్యాత్మికమైన సత్ఫలితాలనుకూడ పొందవచ్చు.

ఈ రెండు సిద్ధాంతాలనూ సమన్వయ పరచడం పూజ్య గురుదేవులు సాధించిన మహత్కార్యం, బుద్ధివాదులనూ, బ్రహ్మవాదులనూ ఒకచోటికి తేవడానికి ఆయన బ్రహ్మవర్చస్ శోధ సంస్థాన్‌ను స్థాపించారు. శ్రద్ధా ప్రధానమైన సాకార ఉపాసన ఫలితాలనూ, యోగాభ్యాస ప్రధానమైన నిరాకార ఉపాసన ఫలితాలనూ ఈ సంస్థ వైజ్ఞానిక పద్ధతిలో ప్రతిపాదిస్తోంది. పూజ్య గురుదేవులు చేసిన కుండలినీ సాధనకు బాహ్యరూపం ఇది. ఆయన పరమ జ్ఞాని, సిద్ధ పురుషులు; ప్రాపంచిక వైభవానికి అధినేత కూడ. రెండూ పరస్పర విరుద్ధములైన ధోరణులు. రెండూ ఒకే స్థలంలో ఎలా కలుస్తాయో ఆయన రచనలోనే చూద్దాం. ("గాయత్రీ మహావిజ్ఞాన్" గ్రంథంనుండి).

అందులో వ్రాయబడినదాని సారాంశం ఇది.

మేరుదండమే మందర పర్వతం. ఇడ అనగా చంద్రనాడి (వామస్వరం) శీతలత్వం. ఇది దేవత్వానికి ప్రతీక. పింగళ అనగా సూర్యనాడి (కుడిస్వరం) ఉష్ణత్వం. భౌతిక వాంఛలకు ప్రతీక. ప్రాణాయామం మున్నగు క్రియలద్వారా ఈ నాడుల మథనం జరుగుతుంది. తద్వారా మూలాధారం మేలుకొలుపబడుతుంది. ఇక్కడనుండి బ్రహ్మనాడి అనగా విరాట్‌యొక్క అవగాహన ప్రారంభం అవుతుంది.

మేరుదండం (వెన్నెముక) చివరి భాగం సమీపంలో నల్లరంగు కలిగిన, ఆరు కోణములు కలిగిన పరమాణువు ఉంటుంది. బ్రహ్మనాడి దీనితో బంధింపబడి ఉంటుంది. ఈ విధంగా ప్రాణ సత్తా శరీరంతో జోడింపబడి ఉంటుంది. ఈ పరమాణువునే ఆలంకారికంగా కూర్మంగా వర్ణించారు. ఎందుకంటే, అది తాబేలు ఆకారంలో ఉంటుంది. భూమి కూర్మ భగవానునిపై నిలచి ఉంది. అంటే అర్థం - జీవితం ఈ కూర్మంపై నిలచి ఉన్నదని.

ప్రచండ సాధన జరిపిన వ్యక్తికి మాత్రమే ఈ అవగాహన కలుగుతుంది. పూజ్య గురుదేవులు అలా

**సజ్జనుల సాధన కష్టాలను దాటిన తర్వాతనే పూర్తవుతుంది.**

ప్రచండమైన సాధన చేశారు. మానవాళికి 14 రత్నాలు ప్రదానం చేశారు. అనగా 14 మార్గాలు చూపారు. ఆ మార్గాలను అనుసరిస్తే, ప్రాపంచిక వైభవంతో జీవిస్తూనే మనిషి తన జీవన లక్ష్యాన్ని చేరుకోగలుగుతాడు.

నేడు బుద్ధిజీవుల వర్గం, శాంతిప్రియులైన శ్రద్ధాళువుల వర్గం - ఈ రెండూ గాయత్రీ పరివార్‌తో తమను తాము జోడించుకుని కూర్మ భగవానుని కథను నిజం చేస్తున్నాయి.

## కాలుష్యాన్ని క్షాళన చేసిన వరాహావతారం

హిరణ్యాక్షుడనే రాక్షసుడు ఉండేవాడు. అతడికి విపరీతమైన ధన దాహం ఉండేది. ఆ దాహంవల్ల అతడు మొత్తం భూగోళాన్నే దొంగిలించాడు. దానిని కాలుష్యంతో కప్పివేసి, సముద్ర మార్గాన దాన్ని తీసుకుని పారిపోయాడు. ప్రపంచం హాహాకారాలు చేసింది. ఈ స్థితిలో ఆ కాలుష్య ఆవరణను ఎవరు తొలగిస్తారు అనే సమస్య ఏర్పడింది. అప్పుడు భగవానుడు వరాహం రూపం ధరించి, హిరణ్యాక్షుణ్ణి సంహరించాడు. భూగోళాన్ని రక్షించాడు. కాలుష్యాన్ని క్షాళన చేసాడు.

ఇదీ వరాహ అవతారం కథ.

హిరణ్యాక్షుడు అంటే హిరణ్య + అక్షుడు. అనగా - అతడి కళ్లలో కేవలం హిరణ్యమే, బంగారమే, ధనమే ఉంది. ఈ తృష్ణ వ్యవసాయంవల్ల తీరదు. కర్మాగారాల ద్వారా, వైజ్ఞానిక ఉపకరణాలద్వారా మాత్రమే ఈ దాహం తీరుతుంది. మన ఋషులు మహా వైజ్ఞానికులు. అయినా, ప్రకృతిని ఉల్లంఘించే, నాశనంచేసే కార్యక్రమాలు అమలు జరపలేదు.

నేడు అల్లోపతీ ఔషధాల తయారీ, పరిశోధనల పేరిట ప్రపంచంలోని జీవులను దారుణంగా హింసిస్తున్నారు. భూగోళాన్ని కొల్లగొడుతున్నారు. నగరాల కాలుష్యం, ఎటామిక్ వేస్ట్ (పరమాణు వ్యర్థ పదార్థాలు) విషమ సమస్యలు అయినాయి. కొత్త కొత్త రోగాలు పుట్టుకువస్తున్నాయి. ఇలా భూగోళం కాలుష్యంతో కప్పబడి ఉండడం అనే కథ అక్షరాలా అమలు జరుగుతోంది.

'చారియట్స్ ఆఫ్ ది గాడ్' అనే గ్రంథంలో డేనియల్ వాల్‌కెన్ ఇలా వ్రాశాడు -

ఒకప్పుడు శుక్ర గ్రహంలో మానవులు నివసించే వారు. అక్కడ భూగోళంలో వలెనే వాహనాల పొగ, కోలాహలం, కార్బన్‌డై ఆక్సైడ్, మోనో ఆక్సైడవంటివి పెచ్చు పెరిగిపోయాయి. వాటి అధ్యయనం కోసమై రెండు కృత్రిమ ఉపగ్రహాలు అంతరిక్షంలోనికి పంపబడ్డాయి. (శుక్రుని చుట్టూ తిరిగే ఉపగ్రహాలు ఫోవోస్, లోవోస్‌లు కృత్రిమ ఉపగ్రహాలని వాల్‌కెన్ భావించాడు). అక్కడ ఆమ్ల వర్షం కురియసాగింది. ఆ విషాన్ని తట్టుకోలేక జనం ఇతర గ్రహాలకు పారిపోయారు.

ఈ కథ నిజమో కాదో తెలియదు, అయితే, భూగోళంపై పెరుగుతూన్న కాలుష్యం నేడు కాకపోతే రేపయినా ఈ పరిస్థితులను సృష్టిస్తుంది. వాహనాల పొగ, నగరాల కోలాహలం, వ్యర్థ పదార్థాలు ఈ పరిస్థితులను తేవడానికి చాలు.

పూజ్య గురుదేవులు వరాహంగా మారి, ఈ కాలుష్యాన్ని నిర్మూలించే సాహసం చేశారు. ప్రాకృతిక జీవనం గడపడానికి ఆయన ప్రేరణ ఇచ్చారు. మహా యజ్ఞాలు జరిపారు. ఇప్పుడు శాస్త్ర విజ్ఞానం ఈ వాస్తవాన్ని అంగీకరించింది. గోరఖ్‌పూర్ అశ్వమేధ యజ్ఞ సమయంలో అక్కడి శాస్త్రవేత్తలు ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు.

ప్రజ్ఞా పురుషునికి ప్రాపంచిక వ్యామోహం అణుమాత్రమయినా లేదు. అయితే, మానవ కళ్యాణం కోసం, భూగోళాన్ని ఈ విషాలనుండి రక్షించడం కోసం ఆయన విషాన్ని పానం చేశారు. వరాహంగా మారి, పర్యావరణ పరిరక్షణ సంకల్పం చేయించారు. గాయత్రీ పరివార్ ఇంతవరకు కోట్లాది మొక్కలను నాటింది. ఆయుర్వేదానికి జీవం పోసింది. ఈ కాలుష్యాన్ని తొలగించడానికి కంకణం కట్టుకున్నది. ఇకముందు ఈ కృషికి విశ్వవ్యాప్తంగా గుర్తింపు లభిస్తుంది. అప్పుడే భూగోళం రక్షింపబడుతుంది.

## శ్రద్ధను పునరుద్ధరించిన నరసింహావతారం

హిరణ్యాక్షుని సోదరుడు హిరణ్యకశిపుడు. అతనినికూడ 24 గంటలూ ధన దాహమే పీడించింది. ఈ తృష్ణ అతడిని పూర్తిగా ఆత్మవిముఖుణ్ణి చేసింది. అంతులేని

**అసత్ నుండి సత్‌కూ, చీకటి నుండి వెలుగుకూ పురోగమించడమే సాధన.**

వైభవాన్ని సంపాదించి, అతడు మనిషే దేవుడని ప్రకటించాడు. భగవంతుని పేరు వినడానికి సైతం అతడు ఇష్టపడలేదు. అతడు ఎన్నెన్నో ఆవిష్కరణలు చేశాడు. ఫలితంగా - మనిషికాని, మరో ప్రాణికాని తనను చంపలేడనే భ్రమ అతడికి కలిగింది. అతడు ఇంటిలోనూ చావడు. బయటా చావడు. అతడికి రక్షణ బీమా ఉన్నది. అతడు ఏ ఆయుధంవల్లా చావడు, ఏరోగంవల్లా చావడు. పగటిపూటా చావడు, రాత్రిపూటా చావడు.

ఇలాంటి స్థితిలో - మనిషి, పశువు కలసిన సంయుక్త ప్రకృతికి చెందిన (నర + సింహ) నరసింహ భగవానుడు గుమ్మంమీద కూర్చొని, గోళ్లతో పొట్ట చీల్చి, అతడిని సంహరించాడు. భక్తుడైన ప్రహ్లాదుణ్ణి రక్షించాడు. శ్రద్ధా సామ్రాజ్యాన్ని స్థాపించాడు.

నేటి మనిషి అక్షరాలా హిరణ్యకశిపుడు అయినాడు. ఆయుధాలు పుష్కలంగా ఉన్నాయి. కనుక, చంపబడతాననే భయం అతడికి లేదు. ఔషధాలు పుష్కలంగా ఉన్నాయి. కనుక, ముసలితనంవరకు భోగ విలాసాలలో మునిగి తేలవచ్చుననీ, అమరుడను అవుతాననీ అతడి నమ్మకం. అది గ్రుడ్డి నమ్మకమే కావచ్చు. ఈ దృష్టిలో నేటి బుద్ధిజీవులకు గ్రుడ్డి నమ్మకం మరింత హెచ్చు. తన భద్రతగురించి అతడికి పూర్తి భరోసా ఉంది. అతడు కోరుకునేది ఒకే ఒకటి - భగవానుని పేరు వినబడకూడదని. కొన్ని పత్రికలు ఈ కోరికను ప్రచారం చేస్తున్నాయి.

ఈ స్థితిలో - భగవానుడు సంధులు అన్నింటినీ వాడుకున్నాడు. వాటి ద్వారా ప్రజల శ్రద్ధను పొందాడు. ప్రాపంచిక లోభ లాలసలను మర్దించాడు.

సంధి అంటే అర్థం గాయత్రీ ఉపాసన (సంధ్యావందనం). ఇది ఒక సంధి.

మరొక సంధి యుగ సంధి. ఇందులో భౌతిక సుఖమే సర్వస్వం. ఈ నమ్మకం నశిస్తోంది. ఆధ్యాత్మిక విశ్వాసం వికసిస్తోంది.

ప్రజ్ఞావతారం ఇదంతా సునాయాసంగా చూస్తూచూస్తూ ఉండగానే చేశారు - స్తంభం బ్రద్దలుకొట్టి వెలికివచ్చినట్లు ధర్మం అనే ప్రహ్లాదుణ్ణి రక్షించారు. తన భక్తులు స్తుతిస్తూ ఉండగా వారిని వదిలి, తాను అంతర్ధానం అయినారు.

ఆయన కరుణామయుడు. మహా సంవేదనశీలి. అయితే, దుష్టత్వంపట్ల ఆయన **భయానామ్ భయం భీషణం భీషణానామ్**. అనగా సాక్షాత్తూ కాల పురుషుడు. ఆయనలో అపారమైన ప్రేమ ఉంది. దుర్దాంతమైన క్రోధం ఉంది. ఆయన ఎన్నడూ సిద్ధాంతాలతో రాజీపడలేదు. ఆయన రక్షించిన శ్రద్ధా శిశువుకు ఉజ్వల భవిష్యత్తును తీసుకువస్తూ 21వ శతాబ్దం వచ్చింది.

ఈ ఉజ్వల భవిష్యత్తుకు ట్రయిలర్ (ముందుగా చూసే సంక్షిప్త చిత్రం) యుగసంధి మహాపురశ్చరణ ప్రథమ పూర్ణాహుతి రూపంలో 1995 నవంబరు 3, 4,5,6,7లలో పరమపూజ్య గురుదేవుల జన్మస్థలి ఆవల్‌ఖేడాలో కానవచ్చింది. తృష్ణ విసర్జన దృశ్యాన్నీ, శ్రద్ధ యొక్క విశ్వవ్యాప్తి దృశ్యాన్నీ అది చవిచూపింది.

## వామనుని మూడడుగులు - భక్తి, జ్ఞాన, కర్మలు

బలి చక్రవర్తికి తన వైభవంపట్ల మితిమీరిన అహంకారం ఉంది. అతడు ఉదారుడే. అయినా అత్యాశ అతడిని పట్టి పీడిస్తోంది. కీర్తి పొందడంకోసం అతడు ఏ పనికయినా ఒడిగడతాడు. అతడు భూమండలం అంతటినీ తన ఆధిపత్యంలోనికి తెచ్చుకున్నాడు.

ఒకరోజున బాలుడయిన వామనుడు ఆయన వద్దకు వచ్చాడు. మూడడుగుల భూమి ఇవ్వమని అడిగాడు. బలి నవ్వి, సరే అన్నాడు. అప్పుడు వామన భగవానుడు తన విరాట్ రూపాన్ని ప్రదర్శించాడు. రెండడుగులలో భూమండలం అంతనూ కొలిచాడు. మూడవ అడుగుకు స్థలం లేకపోయింది. అప్పుడు బలి చక్రవర్తి దర్పం పూర్తిగా అణగిపోయింది. అతడు భగవానుని శరణు పొందాడు.

ఇదీ వామనావతార కథ. అయితే దీని విస్తరణకు విరాట్ స్వరూపం ఉంది.

నేడు అంతటా అత్యాశ ప్రబలి ఉంది. కనుకనే -

**మానవ జీవితాన్ని సద్వినియోగం చేసే వైజ్ఞానిక పద్ధతి - అధ్యాత్మ.**

రోజూ శాసన సభలు రద్దవుతున్నాయి. కొత్త ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయి. సిద్ధాంతాల కోసం రక్తపాతం జరుగుతోంది. పెద్ద దేశాలు చిన్న దేశాలను బెదిరిస్తున్నాయి. విశృంఖలంగా వ్యవహరిస్తున్నాయి. పాత్రికేయులు దిగజారిపోతున్నారు. న్యాయం ఇచ్చేవారి ఆదర్శాలు అడుగంటుతున్నాయి. రక్షకులు భక్షకులు అవుతున్నారు. ఇదంతా బలి చక్రవర్తి చర్యవలె బహిరంగంగా జరుగుతోంది. దీనిపై నలువైపులా చర్చ జరుగుతోంది. నిజాలు బయటికి వస్తున్నాయి. అయినా వ్యక్తులు సిగ్గుపడడం లేదు. తాము ఘనకార్యం చేస్తున్నట్లు భావిస్తున్నారు. దేశంలో ఆడపిల్లలను తగులబెడుతున్నారు. వరకట్న దురాచారం వారిని వేధిస్తోంది. ఈ దురాచారం జరిపేవారు బుద్ధిజీవులుగా, గౌరవనీయులుగా చెలామణీ అవుతున్నారు. వీరు తమను తాము విద్వాంసులుగా, భక్తులుగా, కర్మయోగులుగా భావించుకోవడం మరింత బాధాకరమైన విషయం.

ప్రజ్ఞావతారం 2700 గ్రంథాలు వ్రాసి, ప్రపంచమంతటిలో ఉన్న జ్ఞానాన్ని ఒకచోటుకు తెచ్చారు. యథార్థాన్ని ప్రజల ముందుంచారు. నేడీ సాహిత్యాన్ని ప్రపంచమంతా ప్రశంసిస్తోంది. ఈ సాహిత్యం కావాలని కోరుకుంటోంది.

గాయత్రీ పరివార్ **షికాగోలోని వివేకానందకు** మరో పేరుగా పరిణతి చెందుతోంది. ఈ సాహిత్యాన్ని ప్రపంచమంతటికీ భారీయెత్తున అందించే పని మాత్రమే మిగిలి ఉంది.

అలాగే - ఆయన మతాడంబరాల మధ్య ఉపాసనయొక్క యథార్థ స్వరూపాన్ని ప్రజల ముందుంచారు. రానున్న రోజులలో ఆడంబరపు భక్తి కాక, నిర్మల హృదయంతో అర్పించే భక్తినే ప్రపంచం నమ్ముతుంది.

అలాగే - ఏ పనిలో అయినా భగవంతుణ్ణి నింపుకుని, కర్మయోగి అయి, ఒక శరీరంతో అయిదు శరీరాల పని చేయడం ఎలాగో ఆయన చేసి చూపారు.

ఈ మూడు ప్రవాహాల సంగమమే గాయత్రీ ఉపాసన. జ్ఞాన, భక్తి, కర్మల త్రివేణి ఆ ఉపాసన. ప్రాచీన కాలంలో ఈ ఉపాసనయే సర్వత్రా అనుష్ఠించబడేది. భవిష్యత్తులో కూడ అదే జరుగుతుంది.

అలాగే - నేడు కానవస్తున్న బలి చక్రవర్తి, అధికార దర్పం, అణగిపోతుంది. ఏకత, సమత, మమతల సామ్రాజ్యం ఏర్పడుతుంది. అందరికీ శ్రేయస్సూ, అందరికీ కళ్యాణమూ అందించే మార్గాన్ని వచ్చే యుగం అనుసరిస్తుంది. ఆరోగ్యకరమైన శరీరం, నిర్మలమైన మనస్సు, సభ్య సమాజం పై త్రివేణి ఆధారంగా నిర్మాణం అవుతాయి.

## నాడు క్షత్రియ సంహారం, నేడు భావ విప్లవం

ఒకనాడు రాజులు నిరంకుశులూ, పరపీడన పరాయణులూ అయినారు. ఆ సమయంలో పరశురామ భగవానుడు జన్మించాడు. ఆయన ఏరి ఏరి అలాంటి రాజుల శిరస్సులను ఖండించాడు.

బ్రాహ్మణుడై ఉండి, పరశురాముడు అలాంటి పని చేయడం సంభవంగా కనిపించదు. ఆయన రాజస ప్రవృత్తి కలిగిన వ్యక్తులకు తగు శిక్షణ ఇచ్చి, వారిలో భావ పరివర్తన తీసుకువచ్చారు.

పరమపూజ్య గురుదేవుల జీవన సరళిలో ఈ కార్యం సుస్పష్టం అవుతోంది. మెదడులో ముసురుకున్న దురాలోచనలే దుష్కర్మలుగా ఆచరణలోకి వస్తాయి. పూజ్య గురుదేవులు అత్యంత శక్తిశాలి అయిన తమ కలంతో ప్రజలను మేలుకొలిపారు. ఆయన కర్మ ఫలంపై వైజ్ఞానిక రీతిలో వ్యాఖ్య చేయడంవల్ల పెద్దపెద్ద దుర్మార్గులు సైతం మారిపోయారు. బ్రహ్మాండమైన నైతిక ఉద్యమం నిర్మాణమయింది. రాజుల శిరస్సులను ఖండించడం వంటి పని ఇది. పూజ్య గురుదేవులు రచించిన 2700 గ్రంథాలు ఖడ్గముల వంటివి. వాటిని చదివిన వ్యక్తి ప్రభావితుడు కాకుండా ఉండడు; మారకుండా ఉండడు. ప్రభుత్వ అధికారుల కోసం నిర్వహించిన శిబిరాలలో వేల సంఖ్యలో ఆ అధికారులు పాల్గొనడం ఈ నైతిక ఉద్యమ ప్రభావమే.

**ఉపాసనకు ఫలితం సుసంస్కారిత.**

## మర్యాదల పాలనతో శ్రీరామచంద్రుడు

రామచంద్ర భగవానుడు మర్యాదా పురుషోత్తముడు. పరమపూజ్య గురుదేవులు జీవితంలోని ప్రతి రంగంలో కట్టుబాట్లను ఏర్పరచారు. వాటిని పాటించేందుకు శిక్షణ ఇచ్చారు. వాటిని తమ జీవితంలో అక్షరాలా పాటించి, ఆ విధంగా తన ఆచరణద్వారా ప్రజలకు మార్గదర్శనం చేశారు.

రామచంద్ర భగవానుడు రాజుల, మహారాజుల సహకారాన్ని తీసుకోలేదు. వానరులనే తన సహచరులుగా చేసుకున్నారు. పూజ్య గురుదేవులు భావనాశీలురైన మామూలు వ్యక్తులనే సహచరులుగా తీసుకున్నారు. ప్రతి రోజూ పదిపైసలు, ఒక గంట సహచరులనుండి స్వీకరించి, గాయత్రీ పరివార్‌ను భూమినుండి ఆకాశంవరకు వ్యాప్తి చేశారు.

శ్రీరాముడు స్వర్ణమయమైన లంకను తగులబెట్టారు. పూజ్య గురుదేవులు భౌతిక విషయాలపట్ల లోభ మోహములను భస్మం చేశారు.

రామచంద్ర భగవానుడు దళితులనూ, మహిళా జీవనాన్నీ, పతితులనూ ఉద్ధరించారు. పూజ్య గురుదేవులు నూటికి నూరుపాళ్లూ ఈ పనే చేశారు.

రామచంద్ర భగవానుడు ప్రపంచానికి విరాట్ రూపాన్ని చూపారు. పూజ్య గురుదేవుల విరాట్ రూపాన్ని అందరూ చూస్తున్నారు.

రామచంద్ర భగవానుడు ఋషులను గౌరవించారు. పూజ్య గురుదేవులు ఆ పనే చేశారు. ఋషి పరంపరను పునరుద్ధరించారు. మత వ్యవస్థకు కొత్త దారి చూపారు.

## 16 కళలు, 24 శక్తి ధారలు

కృష్ణ భగవానుని జీవితం ఒక ప్రక్క సంఘర్షణతో, మరో ప్రక్క జానపద కళల ప్రతిష్ఠాపనతో ప్రారంభమయింది. ప్రజ్ఞావతారం కథ సరిగ్గా ఇదే. మహారాజుల భోగ విలాసాలకు సమర్పితమైన కళలను కృష్ణ పరమాత్మ భక్తివైపు, లోక కళ్యాణంవైపు మళ్లించారు. పూజ్య గురుదేవులు గానం, అభినయం, సంగీతం అన్నింటికీ లోకకళ్యాణపు దిశను ప్రదానం చేశారు.

కృష్ణ పరమాత్మ భగవద్గీత ద్వారా కర్మయోగాన్ని ప్రబోధించారు. పూజ్య గురుదేవులు నేటి పరిస్థితులకు అనుగుణంగా అతిసరళమైన కర్మయోగాన్ని నేర్పారు. తాను గృహస్థాశ్రమాన్ని తపోవనంగా మలచారు. అలా మలచడం ఎలాగో అందరికీ నేర్పారు.

కృష్ణ పరమాత్మ మహాభారత యుద్ధానికి సారథ్యం వహించారు. యుగ నిర్మాణం ఆ మహాభారత యుద్ధానికి అంతిమ పర్వం. ఈ యుద్ధంలో అభిమన్యునివంటి బాలురు మహారథుల కార్యాన్ని నిర్వహిస్తున్నారు. అర్జునుడు, భీముడువంటి సమర్థులుకూడ ఆ పని చేస్తున్నారు. ప్రతిభామూర్తులందరూ జాతిని సమర్థవంతం చేసే పనిలో నిమగ్నులై ఉన్నారు.

## బుద్ధ సంఘం, బుద్ధి సంఘం

కార్య సరళి, స్థాపనలు, సిద్ధాంతాలు, యుగ ప్రవాహాన్ని మళ్లించే కార్యక్రమాలు - అన్నింటిలో బుద్ధ భగవానుని కార్యకలాపాలకూ, యుగ నిర్మాణ యోజన కార్యకలాపాలకూ అపూర్వమైన సమానత్వం కానవస్తుంది. బుద్ధుడు వదిలివెళ్లిన పనినే ప్రజ్ఞావతారం పూర్తి చేస్తోందని అనిపిస్తుంది. బుద్ధి, వివేకముల అధిష్ఠానమే గాయత్రీ ఉపాసన.

ధర్మ సంస్థాపనను బుద్ధుడూ, ప్రజ్ఞావతారమూ నిర్వహించారు.

వైదిక హింసను బుద్ధుడు వ్యతిరేకించారు. గాయత్రీ పరివార్ వ్యతిరేకిస్తోంది.

మహిళా జాగరణ బుద్ధుని లక్ష్యం. నేటి యుగ నిర్మాణ ఉద్యమంలో మహిళా జాగరణ అతిప్రధానమైన అంశం.

బుద్ధుడు సంఘారామాలను స్థాపించారు. యుగ నిర్మాణ ఉద్యమం శక్తిపీఠాలను స్థాపించింది.

ఈ విధంగా - పదవ నిష్కళంక అవతారం అన్ని అవతారాల సారం. ఇందులో సందేహం లేదు.

H H H

**సాధనకు ఫలితం శాలీనత (శిష్టత).**

## ముఖచిత్ర కథనం-2

# యుగద్రష్ట, యుగస్రష్ట - గురుదేవులు

"ద్రష్ట" అనే పదానికి స్థూల అర్థం చూసేవాడు, కాని ఈ శబ్దాన్ని సూక్ష్మ దర్శనం చేసే దివ్యదృష్టిసంపన్నులకోసం ప్రయోగించవలసి ఉన్నది. వాస్తవికమైన భవిష్యత్‌వేత్తలు కూడా చూడగల్గుతున్నది చాలా తక్కువ. భవిష్యత్‌వేత్తలలో చాలా కొద్దిమందికి మాత్రమే యుగాంతర దృష్టి ఉంటుంది. ఇలాంటి వారినే యుగద్రష్టలుగా చెప్పవలసి ఉన్నది. ఈ యుగద్రష్ట కావటమే చాలా విశేషం. ఇంక యుగ స్రష్ట కావడమంటే, ఆ శక్తి కేవలం అవతార పురుషులకు మాత్రమే ఉంటుంది. పూజ్య గురుదేవులు యుగద్రష్టే కాదని, యుగస్రష్టయని ప్రకృతిలోని ప్రతి అణువు గొంతెత్తి ఘోషిస్తున్నది. వారు ఎప్పుడు ఏది జరుగుతుందని చెప్పేవారో అప్పుడు అదే జరుగుతూ ఉంది.

### బ్రహ్మాస్త్ర ప్రయోగం

గురుదేవులు 1958లో 1008 కుండముల యజ్ఞాన్ని చేయాలని సంకల్పించినపుడు ఆనాటి పరిస్థితులు ఆ కార్యక్రమం నిర్విఘ్నంగా జరగటానికి కాదుకదా కనీసం అలాంటి సంకల్పం చేయటానికి కూడా అనువైనవి కావు. సహచరులు, శ్రేయోభిలాషులు కూడా వీరిని పరిహాసంచేసి అసంభవమైన ఈ ప్రయత్నాలను ఆపివేయమని, చిక్కుల్లో పడవద్దని హెచ్చరించారు. ప్రకటించిన కార్యక్రమాన్ని నిలిపివేయటంవల్ల పరువు పోతుందని భావిస్తే 1008 మట్టి ప్రమిదలలో అగ్నిని ప్రజ్వరిల్ల చేసి తమ పరిజనులద్వారానే ఆహుతులు వేయించి, సంకల్పాన్ని నెరవేర్చుకోమని సలహాను ఇచ్చారు. గురుదేవులు చిరుమందహాసం చేస్తూనే వారి సలహాలకు తలూపి తాను అనుకొన్నదాన్ని నెరవేర్చటానికి స్థిర సంకల్పంతో ముందుకు సాగిపోయేరు. ఆ తరువాత ప్రతిష్ఠగల వ్యక్తులు, శక్తి సంపన్నులు ప్రతిఘటిస్తున్న ప్రతికూల వాతావరణంలో స్వల్ప సాధనాలు గల అతి తక్కువ మంది సహచరులతో యజ్ఞాన్ని గురుదేవులు ఎంత అద్భుతంగా జరిపించేరో ప్రజలు తమ కళ్లతో స్వయంగా చూసేరు. ఇది కేవలం స్థూల ప్రక్రియ యొక్క సమీక్ష మాత్రమే. ఇంతకంటె గొప్ప విషయమేమంటే - ఈ యజ్ఞానుష్ఠానానికి బ్రహ్మాస్త్రానుష్ఠానమని వారు నామకరణం చేసేరు. ఈ వింత కార్యక్రమానికి ఒక గారడీ పేరు పెట్టి ప్రజలను ఆకర్షితులను చేసి మనోవైజ్ఞానికమైన ఆటను ఆడుకున్నారని ప్రజలు చెప్పుకున్నారు. కానీ సర్వవిధాలా సఫలమైన ఆ యజ్ఞం ముమ్మాటికీ బ్రహ్మాస్త్రానుష్ఠానమేనని సూక్ష్మ అధ్యయనం వల్ల స్పష్టమయ్యింది.

### యుగదైత్యునిపై తిరుగుబాటు

మానవుని దుఃఖానికి కారణం దుష్కర్మకు ప్రేరణను ఇచ్చి దుర్గతి పాలు చేస్తూన్న దుర్బుద్ధేనని గురుదేవులు ఒక ద్రష్టగా దర్శనం చేశారు. అందువలన వారు తమ తపశ్శక్తితో సద్బుద్ధికి అధిష్ఠాన దేవతయైన గాయత్రీ మహా విద్యపై కప్పబడిన ఆంక్షలను తొలగించివేసేరు. అదే విధంగా సత్కర్మకు ప్రేరణను ఇచ్చే యజ్ఞకర్మను ప్రజల కోసం సులభతరం కావించేరు. అయినా అవిశ్వాసమనే రాక్షసుని యొక్క ప్రభావం వలన ప్రజలు ఆ దివ్య ఔషధాన్ని సేవించలేకపోతున్నారని ఆయన గ్రహించేరు. అందువల్ల ఈ అసుర సంహారం తప్పనిసరి అని భావించారు. బ్రహ్మాస్త్ర ప్రయోగాన్ని చేసేరు. ఈ ప్రయోగం జరిగిన తరువాత సద్బుద్ధి సత్కర్మలకు ప్రేరణను ఇచ్చే గాయత్రీ యజ్ఞ ఉద్యమం వెల్లువగా సాగింది. శాస్త్రవిజ్ఞానం, విద్వాంసుల తర్కం, నాస్తికవాదం - ఇవేవి దీనిముందు నిలువలేక పలాయనం చిత్తగించేయి. కానీ ప్రజలు దశాబ్దాలు గడచిన తరువాతకానీ ఈ ప్రయోగం యొక్క సార్థకతను అవగాహన చేసికోలేకపోయేరు.

### అవసరానికి అనుగుణంగా వికాసం

అవతార పురుషుల విశిష్టత ఏమిటంటే - వీరు

**త్యాగం లేనిదే ఏదీ లభించదు ఈ ప్రపంచంలో.**

అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని కావలసినంత మేరకే తమ స్వరూపాన్ని ప్రకటితం చేస్తారు. అనవసరంగా బయటపడరు. గురుదేవుల దివ్యశక్తుల పరదా మరల 1962లో అష్టగ్రహకూటమి సమయంలో తొలగింది.

అష్టగ్రహయోగం సూక్ష్మజగత్తు ప్రక్రియకు అధిక ప్రాధాన్యత నిచ్చిన ప్రప్రథమ సందర్భం. అధికశాతం ప్రజలు అఖండ ప్రళయంవంటి ఒకానొక ప్రాకృతిక విపత్తును, అణువిస్ఫోటం వంటి అనర్థాన్ని ఊహించి భయకంపితులైనారు. మరికొంతమంది దీనిని మాయగా కృత్రిమమైనదిగా భావించి ఉపేక్షించారు. ఇలాంటి స్థితిలో పూజ్యగురుదేవులు అటువంటి కాల్పనిక భ్రమలకు భిన్నంగా తమ సునిశితమైన అభిప్రాయాన్ని సంతులనంతో కూడిన శబ్దాలతో అందరిముందూ ఉంచేరు. అష్టగ్రహకూటమిని గూర్చి ప్రకటించటానికి రెండు నెలల ముందు నుండి ఆయన దీనిని గురించి కొన్ని ముఖ్యమైన విషయాలను అఖండజ్యోతిలో ముద్రించేరు. "స్థూల దృష్టితో చూస్తే అష్టగ్రహయోగ సమయంలో ఏ పరిస్థితులు ఉండాలో ఆ పరిస్థితులు ఉన్నప్పటికీ, సూక్ష్మజగత్తులో మాత్రం చాలా పరివర్తన జరిగింది. యుగసంధి కాలపు ఒడిదుడుకులు ఇక్కడ నుండి ప్రారంభమవుతున్నాయి. కాబట్టి జపము, తపము వంటివి బాగా చేయండి. అంతేకాని సమాజంలో ఎలాంటి భయాలను, వదంతులను వ్యాపింపజేయవద్దు'' - అని వ్రాశారు.

ఆయన మాట నూటికి నూరుపాళ్ళు సత్యమేనని చరిత్ర చెపుతోంది. అష్టగ్రహ కూటమి సందర్భంగా ఎలాంటి ప్రమాదకరమైన సంఘటనలూ జరుగలేదు. ఇది అందరూ చూసేరు. కానీ సూక్ష్మజగత్తులో చాలా మార్పులు జరిగేయనే మాటకు తక్కువ మంది ప్రజలు విలువ నిచ్చారు. గురుదేవులు ఆ సమయంలో ఇంకా అనేక మహత్తర విషయాలను తెలియచేసేరు. ఉదాహరణకు - యుగపరివర్తనకు సమయం ప్రారంభమవుతోంది. యావత్ విశ్వము విషమ పరిస్థితులను ఎదుర్కొనవలసి ఉన్నది. ఉత్పన్నమయ్యే విపత్తుల నివారణకు స్థూల ప్రయత్నం ఉపయోగించవలసి ఉన్నది. మొత్తం విశ్వానికి భారతదేశం ఆధ్యాత్మిక మార్గదర్శనాన్ని చేయవలసి ఉన్నది. దీనికోసం బంగారాన్ని శుద్ధం చేయటానికి పదే పదే అగ్నిలో పుటం పెట్టటం లాంటి ప్రక్రియలు జరుపుతూ ముందుకు సాగవలసి ఉన్నది - అని వారు తెలియజేసేరు.

విజ్ఞ జనులకు ఈ విషయాలకు సంబంధించిన ప్రమాణాలు అవసరం లేదు. ఎందుకంటే ఆశించని ఈ విషయాలన్నీ ఎదుటకు వస్తూ ప్రక్కకి తొలగిపోతున్నాయి. కానీ వీటివల్ల గురుదేవులు భవిష్యత్‌ద్రష్ట అనే విషయాన్ని ఒప్పుకోక తప్పదు. భారతదేశపు ఔన్నత్యాన్ని తెలుపుతూ ఆయన - "వైజ్ఞానిక సాంకేతిక దృష్టితో చూస్తే భారతదేశం చాలా వేగంగా ముందుకు పోతున్నది. ఆర్థిక వికాస క్రమం అవసరమైనప్పుడు ప్రకృతి తన గుప్త భాండాగారాన్ని తెరచి దేశాన్ని ఆదుకొంటు''దని వ్రాసేరు. ఇది యుగస్రష్టగా వారి శక్తికి నిదర్శనం. మన దేశం చిన్న చిన్న యంత్రభాగాలే విదేశాలనుండి ఆశించే పరిస్థితిలో ఉండగా, ఈనాడు ఇక్కడ విమానాలు రాడార్‌లు, క్షిపణులు, కృత్రిమ ఉపగ్రహాలవంటి ఉన్నత సాంకేతిక ఉపకరణాలు తయారవుతున్నాయి. విదేశాల్లో కూడా భారతీయ వైజ్ఞానికుల విజ్ఞానమే ఎక్కువగా అవసరమవుతోంది. దేశంలో పెట్రోలియం గనులవరకు ఈ మధ్యకాలంలో లభిస్తూ వచ్చేయి. మానవుడు తన అంతః ప్రకృతిలో దాగి ఉన్న దివ్య సంపద భాండాగారాన్ని తెరవటానికి సిద్ధపడితే పదార్థసంపదకు ఎంతమాత్రం కొరత ఉండదు.

యుగద్రష్ట సామర్థ్యం దేశాన్ని గురించి కూడా ప్రత్యక్షంగా ప్రకటితమవుతూ వచ్చింది. భారతదేశానికి స్వాతంత్ర్యం లభిస్తుందని తెలియగానే నాయకులు పదవులకోసం ఆరాటపడసాగేరు. కానీ ఆచార్యజీ మాత్రం తన సృజనాత్మక సామర్థ్యం పట్ల అచంచల విశ్వాసంతో ఒంటరిగా సాధనాలు లేని స్థితిలో కూడా "దేశానికి నేను క్రొత్త శక్తిని ఇస్తాను'' - అనే నినాదాన్ని చేస్తూ వ్యక్తి నిర్మాణం, కుటుంబ నిర్మాణం, సమాజ నిర్మాణం అనే సృజనాత్మక ఉద్యమానికి సూత్రధారులు అయ్యారు.

ఆచార్యజీ సాఫల్యాన్ని చూచి అప్పటి ఉత్తరప్రదేశ్

**భారతీయ ధర్మ - దర్శనానికి ఆత్మ గాయత్రి.**

గవర్నర్ డా॥ మఱ్ఱి చెన్నారెడ్డి ఏమన్నారంటే - "రాజకీయ ఉద్యమం మహాత్మాగాంధీ నాయకత్వంలో సఫలమయ్యింది. కానీ జాతి నిర్మాణ ప్రణాళికలను ఆయన అనుయాయులు విఫలం చేసేరు. అందువల్ల ఆయన దుఃఖితుడై నా బాధను అర్థంచేసుకొనేవారు ఎవరని ...... బాధతో ప్రశ్నించినపుడు సాధనాలు లేని ఒకే ఒక వ్యక్తి (ఆచార్యజీ) ఆత్మవిశ్వాసం 'నేనున్నాను' అని బదులు పలికింది. చెప్పడమే కాదు చేసి చూపించింది. దానిని ఒక మహాద్భుతంగా చెప్పవలసి ఉన్నది''.

దేశంలో ఉత్పన్నమయ్యే విపత్తుల పట్ల ముందుగానే అప్రమత్తులను చేయడం, విపత్తులు మీదికి ఉరికినపుడు వాటికి ప్రతిక్రియలు చేయడంలో నిమగ్నంకావటం ఆయన స్వభావం. చైనా యుద్ధం, పాకిస్తాన్, బంగ్లాదేశ్ యుద్ధాలు సంభవించినపుడు ఆయన విశేష తపస్సాధనలు చేసేరు. యావత్ గాయత్రీ పరివారం చేత విశేష అనుష్ఠానాన్ని చేయించేరు. శ్రేయస్సును పొందటంకంటే శ్రేయస్సును పంచటం ఆయనకు ఎక్కువ ఇష్టం. తాము చేసిన విశేష సాధనలను, కృషిని ఆయన చాలా గుప్తంగా ఉంచేవారు. అయినా ఒక్కోసారి ఆ ప్రకాశం బహిర్గత మవుతూ ఉండేది. లాల్‌బహుదూర్ శాస్త్రి గారు ప్రధానమంత్రి అయినపుడు దేశంలో కొంతకాలం ఆధ్యాత్మిక వాతావరణం తాండవిస్తుందని గురుదేవులు భవిష్యత్‌వాణి చేప్పేరు. సరిగ్గా అదే సమయంలో సరిగ్గా అదేవిధంగా శాస్త్రీజీ యొక్క తపోమయ జీవిత ప్రభావం సర్వత్రా కానవచ్చి ఆయన ప్రసంగాలవల్ల దేశంలో నైతికవ్రతశీలత ఉప్పొంగింది. ముఖ్యంగా 18 నెలల తరువాత శాస్త్రీజీ మరణించిన పిదప గురుదేవుల మాటలోని రహస్యం స్పష్టంగా బయటపడింది. ఇదే విధంగా శ్రీమతి ఇందిరాగాంధీ ప్రధానమంత్రి అయ్యే ముందు స్త్రీ ఔన్నత్యం ఇనుమడించబోతున్నదని, విశ్వంలో ఎక్కువ జనసంఖ్య ఉన్న దేశానికి ఒక స్త్రీ ప్రధానమంత్రి కావటం ఆ ఔన్నత్యాన్ని గుర్తించమని చేసే హెచ్చరికేనని ఆయన చెప్పేరు. ఈ అభిప్రాయాన్ని వ్యతిరేకిస్తూ ఒక పెద్దమనిషి పాశ్చాత్య సంస్కృతి మధ్య పెరిగిన ఒక ఆడపిల్లను మీవంటి వ్యక్తి పొగడటం బాగాలేదని అన్నాడు. గురుదేవులు ఆయనను మందలిస్తూ "నీవు చూస్తూ ఉండు. ఆమె పని చేస్తుంది. మనం శక్తిని ఇస్తాం. ఆమె భారతదేశపు ఆధ్యాత్మిక శక్తికి కూడా వారసురాలనే విషయం మరచిపోకు'' - అన్నారు.

సరిగ్గా బంగ్లాదేశ్ ఆపరేషన్ సమయంలో పూజ్య గురుదేవులు హిమాలయయాత్రలో ఉన్నారు. ఆనాటి భారతసైన్య సాఫల్యాన్ని గూర్చి అంతటా "ఈ సాఫల్యం ఏదో ఒక దివ్యశక్తిది మాత్రమే''నని ఉచ్చరించబడింది. స్వయంగా ఇందిరాగాంధీ కూడా అంతర్జాతీయ ప్రెస్‌మీట్‌లో ఈ గెలుపు కేవలం భారతదేశపు ఆధ్యాత్మిక శక్తిదని పత్రికా విలేఖరులకు తెలియజేశారు. సరిగ్గా యుద్ధం ముగిసిన తరువాత కొంతకాలంగా వందనీయ మాతాజీ హృద్రోగంతో బాధ పడుతున్నారనే విషయం వెల్లడయ్యింది. కానీ ఆశ్చర్యమేమంటే తరువాత ఎన్నడూ ఇ.సి.జి.లో హృద్రోగ చిహ్నాలు ఆమెలో కనిపించలేదు. తరువాత పూజ్య గురుదేవులు హిమాలయాల నుండి శాంతికుంజ్‌కు తిరిగి వచ్చిన వెంటనే ఒక ప్రసంగంలో "ఈనాడు సంస్థకు మాతాజీ అవసరం ఎంతగానో ఉన్నది. ఆదేవిధంగా ఆమెకు ప్రస్తుతం నా అవసరం ఏర్పడింది. అందువల్ల నేను అనుకొన్నదానికంటే ముందుగా తిరిగి వచ్చాను. ఇంకా ముందుగా రావాలంటే బంగ్లాదేశ్ సమస్య పరిష్కారం కాకుండా రావటం కుదరలేదు''అని తెలియజేసేరు.

## సూక్ష్మీకరణ సమయంలో

సూక్ష్మీకరణ సాధనాకాలంలో గురుదేవులు తన స్థూల లీలను తగ్గించసాగేరు. అందువల్ల ఆయన కథనం చాలా స్పష్టంగా ఎట్టెదుట సాక్షాత్కరించసాగింది. ఆయన లెక్కలేనన్ని ఊహించనలవికాని ప్రకటనలు చేశారు. వీటిద్వారా ఆయన ద్రష్ట, స్రష్ట స్వరూపానికి స్పష్టమైన ప్రమాణాలు లభిస్తాయి. సూక్ష్మీకరణ సందర్భంగా ఫిబ్రవరి 1987 అఖండజ్యోతి 63వ పేజీలో వారి ప్రతిపాదనలు మార్గదర్శన భాషలో ఉన్నాయి. ప్రతి వ్యక్తి కర్తవ్యాన్ని ఆ వాక్యాలతో గుర్తు చేశారు "ఈ మొత్తం ప్రతిపాదనలు సునిశ్చితమైన భవిష్యవాణివంటివి. పూర్తిగా

**పరమప్రేరకమైన గురు మంత్రం గాయత్రి.**

విశ్వసింపవలసిన విషయాలుగా గుర్తించి ముందుకు సాగవలసి ఉన్నది'' అని అందులో వ్రాయబడి ఉన్నది. ఈ వాక్యాలలో ఒక సజ్జనుని పవిత్ర శబ్దాలలో ఒక ద్రష్టలోని స్పష్టమైన దృష్టి, ఒక స్రష్టలోని ఆత్మవిశ్వాసం చాలా స్పష్టంగా గోచరమవుతున్నాయి. తరువాత పంక్తులలో వారు ఈ విధంగా వ్రాసేరు - ఈ అనాచార వేళలలో దేవశక్తిపుంజం కార్యక్షేత్రంలోనికి ఉరికింది. కంఠంపైన తుపాకీని పెట్టి వెనక్కి తిరుగు అని చెప్పేవాళ్లచేత కూడా సమయానుకూలమైన తిరోగమనాన్ని తెప్పిస్తాను. ముందుకు సాగటం శ్రేయస్కరంకాదనే నినాదాలు ఇరుపక్షాలనుండి మారుమ్రోగే దశలో వివేకంతో పనిచెయ్యాలి. సాహసంతో వెనుకకు తగ్గాలి. ఎవరూ సర్వనాశనానికి కారకులు కాకూడదు. యుద్ధం ఖచ్చితంగా తొలగి ఎక్కుపెట్టబడిన ఖండాంతర వేధులు ప్రస్తుతానికి ఆగిపోతాయి. (జూలై 1984, 9 నుండి 11వ పేజీవరకు). దేవశక్తుల సముదాయంలో తన పాత్రను తెలుపుతూ వారు జరుగబోయే కార్యక్రమానికి కర్తలుగా దేవశక్తులను చూపటం జరిగింది. యుద్ధోన్మాదగ్రస్తులైన వారికి వారి అస్తిత్వాన్ని ఉటంకించి సవాలునిండిన స్వరంతో వేసిన అడుగు వెనక్కి తీసికొమ్మని సలహా ఇవ్వటం జరిగింది. తరువాత ఎంత వేగంగా సంధివార్తలు సఫలమయ్యాయో పాఠకులందరికీ తెలుసు. అలాగే వేధులను తయారుచేసే వారు స్వయంగా వాటిని నాశనం చేసేరు. అయినా మిగిలినవి విశ్వ యుద్ధానికి, విశ్వ వినాశనానికి తక్కువేమీ కావని చింతించేవారికి వారు ఊరడింపు నిస్తూ - “రాబోయే రోజుల్లో మహా వినాశనపు నినాదం ప్రతి రంగంలోనూ వినిపిస్తుంది. పరిస్థితులను చూచేవాళ్ళు మహా వినాశనం ఇప్పుడు వచ్చింది అప్పుడు వచ్చింది అని చెప్పుకొంటారు. అయినా నేను ఒక్కడినీ చెప్పిన ఈ విషయం మిగతా అందరి అభిప్రాయానికి విరుద్ధంగా ఉంది. ఈ ప్రపంచం జీవించి ఉండటమేగాక ఇంకా బాగా తయారవుతుంది. ఆసక్తి ఉన్నవారు ఈ భవిష్యవాణిని పదిలపరచుకోండి. యుద్ధం ఎక్కడో అక్కడ స్థానిక స్థాయిలో జరుగుతూనే ఉంటుంది. కానీ దీనివల్ల మొత్తం మానవాళి భవిష్యత్తు కష్టాలలో మునిగిపోయే పరిస్థితి ఎన్నటికీ రాదు.'' -అని వ్రాశారు.

ప్రపంచ యుద్ధం జరిగే పరిస్థితులు ఏర్పడి కూడా అని సమసిపోవటాన్ని ప్రపంచం చూస్తోంది. చిన్న, పెద్ద సంఘర్షణల తరువాత ఆవేశంపైన వివేకం స్వారీ చేసింది. తరువాత పంక్తులలో నక్షత్ర యుద్ధం (స్టార్‌వార్) వంటి ఆపదల విషయంలో గురుదేవులు ఈ క్రింది విధంగా వ్రాసేరు -

“నక్షత్ర యుద్ధం జరిగే సమయంలో రోజులు చాలా గడ్డుగా ఉంటాయి. కానీ అది కూడా పూర్తిగా నిష్ఫలంకావటం ఖాయం. ఆకాశంపైన ఆధిపత్యాన్ని పొందటానికి ఎంత ప్రయత్నం జరిగిందో, జరుగుతూ ఉన్నదో, అది కూడా సత్యమని అనుకోకతప్పదు. ఈ సందర్భంగా ఎవరు ఎంత ఉత్సాహాన్ని చూపిస్తున్నారో వారు అధికస్థాయిలో నిరాశ ముసుగుల్లో బంధింపబడతారు.''

అప్పటి అమెరికా రాష్ట్రపతి శ్రీ రీగన్ నక్షత్రయుద్ధ సన్నాహాలను ఆపటానికి ఏమాత్రం ప్రయత్నించలేదు. కానీ దైవీ చేతనత్వ ప్రభావం ముందు నిస్సహాయుడుగా ఉండిపోయేరు. అనేక రాకెట్లు నిష్ప్రయోజనమయ్యేయి. దానికి సంబంధించిన వైజ్ఞానికులు నక్షత్ర యుద్ధ కార్యక్రమాన్ని బహిష్కరించమని నినాదాలు చేసేరు. ఆ వినాశకరమైన ప్రణాళిక తన మృత్యువును తానే కొని తెచ్చుకొన్నది. దీనికోసం సూక్ష్మీకరణ సాధన ద్వారా చేసిన ప్రయత్నాల వివరణ ఈ క్రింది విధంగా ఉంది -

“మహా యుద్ధాన్ని కొనసాగించటం, యథాతథంగా ఉంచటం చాలా ఖర్చుతో కూడుకున్న పని. దీర్ఘకాలం దానిని కొనసాగనీయరాదు. దానిని వదలివేయటమే మంచిదని పరిస్థితులు తెలుపుతున్నాయి. చివరకు పన్ను చెల్లించేవారు కూడా అంత భారాన్ని ఎంతవరకు మోయగలరు? ఈ వివేకాన్ని మేల్కొల్పడానికి మేము సూక్ష్మీకరణ సాధన ద్వారా ఆర్జించుకొన్న శక్తిని ఉపయోగించి ఇరువర్గాలపై వెనుకకు మళ్ళేటట్లు ఒత్తిడిని తీసుకొని వస్తాము. ఆక్రమణ చేయటం

**మోసం చేయకుండా పొందిన సాఫల్యమే నిజమైన సాఫల్యం.**

కంటే వెనుకకు తగ్గటమే సర్వవిధాల శ్రేయస్కరమనే విశ్వాసాన్ని ఏదోవిధంగా వారిలో కలిగించగలం. ఈ ఒత్తిడివల్ల అప్పటి ఉద్రేకం చల్లబడుతుంది. వివేకం, బాధ్యతలతో కూడిన ఒక క్రొత్త ప్రవాహం అక్కడ ప్రవహిస్తుంది. ఆవిధంగా సెగలు కక్కే యుద్ధం ప్రచ్ఛన్న యుద్ధంగా మారింది. చివరకు ప్రచ్ఛన్నయుద్ధం ఎక్కువకాలం కొనసాగదు.''

(అఖండ జ్యోతి జూలై 84, పుట.8)

ప్రపంచ యుద్ధంపట్లనే కాక విశ్వంలోని ప్రతి సమస్యపట్ల వారు చూపిన అప్రమత్తత దర్శింప తగినది. ప్రతిభావంతులు, విజ్ఞానవేత్తలు, వేదాంతులు, రచయితలు మున్నగు వారందరినీ అవాంఛనీయస్థితినుండి దారి మళ్ళించి శ్రేయోమార్గంలో నడిపిస్తానని వారు సంకల్పం చేసేరు-

"వైజ్ఞానికులు - దార్శనికులు ఒక మహా విప్లవం వంటివారు. వైజ్ఞానికులను యుద్ధానికి సంబంధించిన మారణాయుధాలను తయారు చేయడంలో సహకరించవద్దని ఒత్తిడి తీసుకొనివస్తాము. సాగే బండి నిలచి పోతుంది.

"సూక్ష్మీకరణ సాధన తరువాత మేము ఆ విధంగా జరుగనివ్వం. ఉచ్ఛస్థాయికి చెందిన వైజ్ఞానిక ప్రతిభ, తెలివితేటలు, వారిని ఆవిధంగా చేయనివ్వవు. వారి మస్తిష్కంలోని ప్రతిభలు కుటీర పరిశ్రమలకు సహాయపడే చిన్న చిన్న ఉపకరణాలను తయారుచేయడానికి మళ్ళించబడతాయి. ఇందుకు ఒక నమూనా వారి ఎదుట సాక్షాత్కరిస్తుంది. రచయితలు, వేదాంతులు ఒక క్రొత్త వర్గంగా ఏర్పడి తమ ప్రతిభా పాటవాలతో స్వతంత్రంగా వ్రాయటానికి, ఆలోచించటానికి ప్రయత్నాలు చేస్తారు. వారి ఉద్దేశ్యాలకు సర్వ సహాయాలూ లభిస్తాయి. వారి మస్తిష్క కవాటాలు పూర్తిగా తెరచుకొని - ఈ పరిస్థితులలో ఏమి వ్రాయాలో, ఏమి వ్రాయకూడదో నిర్ధారించుకొనే యోగ్యమైన బుద్ధికుశలత వారికి లభిస్తుంది.'' (అఖండ జ్యోతి జూలై 84, 19 పేజీ)

ఆయన ఏదైతే చెప్పారో అది ఎంత అసంభవమైనదిగా కనిపించినా తరువాత జరిగిపోవటం, క్రమంగా తీవ్రతరం, తేజవంతం కావటం ఖాయం. పరిశోధకులు ఈ విషయాలపై పరిశోధన చేయగా వారిని ఆశ్చర్య చకితుల్ని చేసే వాస్తవాలు ప్రకటితమయ్యాయి. ఇంత సహజంగా, ఇంతటి ఉన్నతస్థాయికి చెందిన సృజనాత్మక కార్యక్రమాలను నిర్వర్తించే వ్యక్తి ఇంతకు ముందు ఎన్నడైనా జన్మించాడా అన్న ప్రశ్న అధ్యయనశీలురకు ఉద్భవించక తప్పదు.

H H H

## వీరనారి జోన్ ఆఫ్ ఆర్క్

ఫ్రాన్స్‌లో స్వాతంత్ర్య జ్వాలను రగుల్చుటతో, దానిలో తనను తాను ఆహుతి చేసికొనుటతో - యూరపులోనే కాక సమస్త విశ్వంలో జోన్ ఆఫ్ ఆర్క్ అత్యంత గౌరవంగా చూడబడింది. ఫ్రాన్సు పై ఆంగ్లేయులు అధికారం సంపాదించారు. ఫ్రాన్సువారు వ్యతిరేకించినా, వారు వైదొలగుటలేదు. ఆ సమయంలో ఒక రైతు కుమార్తె జోన్ ఆఫ్ ఆర్క్ ప్రజలను సంఘటిత పరచి స్వాతంత్ర్య శంఖం పూరించింది. ఒక సైన్యం తయారు చేసింది. జనము ధనముల అవసరం దేశభక్తుల ద్వారా పూరించబడేది. పురుష వేషంలో సేనా నాయకునిగా పనిచేసేది. ఆమె రెండుసార్లు గాయపడింది. అయినా ఎవరినీ చంపలేదు. ఆమె ఆత్మశక్తి వలన శత్రువులు గాయపడకుండానే పారిపోయేవారు.

జోన్ శత్రువులకు చిక్కింది. వారు ఆమెను ప్రాణాలతో అగ్నిపాలు చేశారు. అయినా ఆంగ్లేయులకు విరుద్ధంగా ఫ్రాన్సు ప్రజలు యుద్ధం కొనసాగించారు, స్వాతంత్ర్యం పొందారు.

- ప్రజ్ఞాపురాణం నుండి

**కుశాగ్రబుద్ధికి సైగ చాలు. మూర్ఖునికి చెంపదెబ్బ అయినా చాలదు.**

# ముఖచిత్ర కథనం-3
# అంతరంగ అనుభూతులకు అక్షరరూపం

### ఆ దివ్య సంరక్షణ

తమ జీవితం పరమపూజ్య గురుదేవులదేనని డాక్టర్ ప్రణవ్ పండ్యా చెపుతారు. ఎందుకంటే - ఆయన రక్షించకపోతే, స్కూటరు ప్రమాదంలోనే తన జీవితం సమాప్తమై ఉండేదని ఆయన వివరిస్తారు.

ఆ ప్రమాదంనుండి బయటపడిన తర్వాత ఆయన తన జాతకం చూచుకొన్నారు. ఆ రోజులలోనే ఆయనకు మారకం ఉన్నదని ఒక ప్రసిద్ధ జ్యోతిషాచార్యుడు వ్రాసి ఉన్నాడు. అయితే, ఆయనను రక్షించవలసి ఉంది. ఆయనచేత పని చేయించవలసి ఉంది. కనుక పరమపూజ్య గురుదేవులు ఆయనను రక్షించారు.

దివ్య శక్తి కలిగిన పురుషుల కార్య సరళి విలక్షణంగా ఉంటుంది. సర్వ సమర్థులు అయి ఉండికూడా వారు ప్రకృతి యొక్క సహజ ప్రవాహంలో వీలైనంత తక్కువగా జోక్యం కలిగించుకుంటారు. కనుక - ప్రమాదం జరగవలసి ఉంది. దాన్ని జరగనిచ్చారు. ఆ తర్వాత - ఎంతటి ప్రమాదం తప్పిపోయిందో ఎవరికీ తెలియని విధంగా సంఘటనాక్రమాన్ని నడిపిస్తూ వచ్చారు.

ఆరోజునే పూజ్య గురుదేవులు, వందనీయ మాతాజీ రిక్షామీద బయటికి వెళ్లారని ఆదరణీయ శైలదీదీ చెప్పారు. గురుదేవులు చిరంజీవి చీనూ (డా॥ ప్రణవ్ పండ్యాజీ కుమారుడు) కోసం ఆటబొమ్మ తెచ్చారు. అది స్కూటరు నడుపుతున్న మనిషి బొమ్మ. ఆయన శాంతికుంజ్ వచ్చి ఆ బొమ్మ అతడికి ఇచ్చారు. ఆ ఆటబొమ్మ కింద పడిపోయింది. స్కూటరు ఇటూ, నడుపుతున్న మనిషి అటూ. అరే, ఇది క్రింద పడిపోయిందే - అని మాతాజీ అన్నారు. దాదాపు అదే సమయంలో డా॥ ప్రణవ్ పండ్యాకు ప్రమాదం జరిగింది. స్కూటర్ ఇటు పడింది. నడుపుతూన్న ఆయన అటు పడిపోయారు.

ఆ రోజుల్లో డా॥ ప్రణవ్ పండ్యా హరిద్వార్‌లోని బి.హెచ్.ఈ.ఎల్.లోనే డాక్టరుగా పని చేస్తున్నారు. ప్రమాదం జరిగిన వెనువెంటనే చికిత్సకు ఏర్పాట్లు జరిగాయి. ఆయనతో కలసి పని చేస్తూన్న డాక్టర్లు చికిత్స జరిపారు. కానీ, దవడ ఎముక నాలుగుచోట్ల విరిగింది. అప్పుడు ఫేశియో మైగ్జిలరీ యూనిట్ (ముఖానికి శస్త్ర చికిత్స జరిపే విభాగం) ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్‌లో ఉంది.

బయలుదేరుతున్నప్పుడు పూజ్యవరులు స్పష్టంగా నిర్దేశం ఇచ్చారు - ఢిల్లీలో వద్దు, భోపాల్‌లో చికిత్స జరిపించాలని. విచిత్రమైన మాట అది. భోపాల్‌లో ఆ చికిత్సకు వ్యవస్థ లేనేలేదు. అయితే ఆయన మాట వ్యర్థం కాదు. చికిత్స అంతా భోపాల్‌లోనే జరిగింది. శస్త్రవైద్య నిపుణులు ఇందూర్‌నుంచి భోపాల్ వచ్చారు. ఎంతో నైపుణ్యంతో అతిక్లిష్టమైన శస్త్రచికిత్స జరిపారు. ముఖంమీద ఆ దెబ్బవల్ల ఏర్పడిన మచ్చకూడ కనపడకుండా అద్భుతంగా చికిత్స జరిపారు.

డా॥ ప్రణవ్ పండ్యా ఇలా అంటారు -

"వారు (పూజ్యవరులు) ఏది తలచుకుంటే అది చేయిస్తారు. ఒక డాక్టరుకు రచనా వ్యాసంగంతో ఏమి సంబంధం ఉంటుంది. కానీ, ఆయన అతడిచేత రచన చేయిస్తారు. సామాజిక జీవనంలో అనుభవం లేనప్పటికీ బాధ్యత అప్పగిస్తారు. ఆ బాధ్యతను నిర్వహింపజేస్తారు కూడా. నా కణ కణం ఆయనకు ఋణపడి ఉంది. ఆ ఋణాన్ని తీర్చుకోవడం ఎలాగో అర్థంకాదు. ఆ ఋణాన్ని తీర్చుకోవాలనే ఆలోచనా లేదు. జన్మజన్మలకూ ఆ ఋణం అలాగే ఉండిపోవాలి; ఈ తనువూ మనసూ ఆయనకు అంకితం అవుతూ ఉండాలి - అనే భావన మనసులో ఎగిసిపడుతూ ఉంటుంది."

### నా జీవితం ధన్యమయింది

1969 శివరాత్రి నాడు గ్వాలియర్‌లోని గాయత్రీ మందిర్‌లో పూజ్య గురుదేవులు గాయత్రీ మాత ప్రాణ ప్రతిష్ఠ జరిపారు. ఒక సంత్ వస్తున్నారని తెలిసి నేను అక్కడికి వెళ్ళాను. నేను గురువుకోసం అన్వేషిస్తున్నాను.

**ప్రతి ప్రాణినీ ప్రేమించే వ్యక్తి పరమేశ్వరునికి ఇష్టుడు.**

ఆచార్యజీ ఎక్కడ ఉన్నారని అడిగాను. గదిలో ఉన్నారని ఒక పరిజనుడు చెప్పాడు. ఆ గదిలో ఇద్దరు ముగ్గురు మహిళలు కూడ కూర్చొని ఉన్నారు. వారిలో ఒక మహిళ ఇలా అడిగింది -

గురూజీ! మహిళలు గాయత్రీ మంత్రం జపించకూడదని 'కళ్యాణ్' పత్రికలో శంకరాచార్యులు వ్రాశారు.

గురుదేవులు ఇలా అన్నారు -

అమ్మాయీ! శంకరాచార్యులు వేదాలను వ్రాయలేదు. నేను వేదాలకు భాష్యం వ్రాశాను. మహిళలు గాయత్రీ జపం చేయాలి.

నేను ఆ మాటలు విని గది బయటికి వచ్చాను.

కొద్దిసేపటి తర్వాత ఒక ప్రకటన వెలువడింది - పూజ్య గురుదేవులనుండి దీక్ష తీసుకోవాలని అనుకునేవారు యజ్ఞశాలకు రావాలని.

నేను పెక్కు సంవత్సరాలుగా గురువు కోసం అన్వేషిస్తున్నాను. సాధు సంత్‌లు పలువురిని కలుసుకున్నాను. కానీ, ఎవరినీ గురువుగా స్వీకరించడానికి నా అంతఃకరణ అంగీకరించలేదు. ఆ రోజున హృదయం ఉప్పొంగింది. ఆ క్షణంలోనే గురుదీక్ష తీసుకోవాలనే అనుభూతి కలిగింది. నేను యజ్ఞశాలలోకి వెళ్లి కూర్చున్నాను. పూజ్య గురుదేవుల నుండి దీక్ష తీసుకున్నాను.

నాటినుండి ఉపాసనద్వారా పూజ్య గురుదేవుల సూక్ష్మశక్తి ప్రవాహం నాకు ప్రేరణ ఇస్తూ వచ్చింది. క్రమక్రమంగా నా శరీరమూ, మనస్సూ పూజ్యవరుల ఆలోచనలతో నిండిపోతూ వచ్చాయి. ఇంట్లో కూర్చుని ఉండే పరివ్రాజకుణ్ణి అయినాను. 1974లో శాంతికుంజ్ చేరాను. పూజ్య గురుదేవులతో మాట్లాడాను. ఏమి పని చేస్తున్నావు - అని వారు అడిగారు. ఉద్యోగం - అని చెప్పాను.

జీతం ఎంత అని అడిగారు. రూ.250లు అని చెప్పాను. నీ జీతం రెట్టింపు చేయిస్తాను - అని వారన్నారు. డబ్బు అక్కరలేదని చెప్పాను. వ్యాపారం చేయిస్తాను - అని ఆయన అన్నారు. వ్యాపారం చేయలేనని చెప్పాను. భూమి, ఆస్తులు ఇప్పిస్తాను - అని ఆయన అన్నారు. అక్కరలేదన్నాను. వెండి, బంగారాలు ఇప్పిస్తాను - అన్నారు. అక్కరలేదన్నాను. పూజ్య గురుదేవులు కోపగించి ఇలా అన్నారు -

మాకు అర్థం కావడం లేదు. వేరుశెనగ కాయలు అమ్ముకునేవాళ్లను మేము లక్షాధికారులు చేశాము. మేము హిమాలయాలనుండి వచ్చాము. మేము ఇంతవరకు మా తపస్సులో నాల్గవ వంతు మాత్రమే ఖర్చు చేశాము. మిగిలిన మూడువంతులూ మాదగ్గర ఉంది.

ఆయన ఇంకా ఇలా అన్నారు -

నీవు ఏదీ కోరడం లేదు. ఎందుకని?

నాకేమీ అక్కరలేదని నేనన్నాను.

ఆయన ఇలా అన్నారు -

అయితే నిన్ను బ్రాహ్మణ ఫకీరును చెయ్యనా?

నేను మౌనం వహించాను.

ఆయన ఇలా అన్నారు -

మనిషి ఫకీరు కావడానికి భయపడతాడు. భోజనం ఎలా వస్తుందని అతడు ఆలోచిస్తాడు. నాయనా! భగవంతుడు తన కుక్కకుకూడా ఆహారం అందేటట్లు చూస్తాడు. భక్తులచేతనే తన చేతులతో తినిపిస్తాడు.

అలాగే చేయండి.

- అని నేనన్నాను.

ప్రతి సంవత్సరం శాంతికుంజ్‌కి వచ్చివెళ్లే క్రమం సాగుతూవచ్చింది. వీడ్కోలు తీసుకునేటప్పుడు బొట్టుపెట్టి ఇలా అనేవారు-

రావడం వెళ్లడం ఆపివేయి. ఇలా వెళుతూ ఉంటే ఇక్కడికి రావద్దు. వస్తే ఇక్కడనుండి ఎన్నడూ వెళ్లవద్దు.

1980 డిసెంబరులో రాజస్థాన్‌లోని జయపూర్‌లో శ్రీవీరేంద్ర అగ్రవాల్ గృహంలో శక్తిపీఠాన్ని ప్రారంభించడానికి పూజ్య గురుదేవులు వచ్చారు. ఆయన దర్శనం చేసుకోవడానికి నేనూ, అగ్రవాల్‌జీ ఉదయం పూట వెళ్లాము. ప్రణామం చేశాము. ఆ తర్వాత నాతో వారిలా అన్నారు -

**పడినవాడిని, వెనుకబడినవాడిని లేవనెత్తడమే ప్రేమ స్వరూపం.**

నీవు ఇప్పుడు ఉద్యోగం వదలకపోతే, వేయి సంవత్సరాలపాటు నా శాపం నీకు తగులుతుంది. ఉద్యోగం వదిలితే, వేయి సంవత్సరాలపాటు నా ఆశీస్సు నీకు ఫలిస్తుంది. నాయనా! నీకు కనబడడంలేదా, మేము ఒక తుపానును సృష్టించాము.

1981 మార్చి నెలలో నేను శాంతికుంజ్ వెళ్లాను. ఉద్యోగం వదిలిపెట్టావా - అని పూజ్యవరులు అడిగారు. వదిలిపెట్టలేదని చెప్పాను. ఇక్కడనుంచే రాజీనామా పంపు - అని ఆయన అన్నారు. నేను ఉద్యోగం వదిలివేశాను.

నా కుటుంబ సభ్యులు దీన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. నా మిత్రులుకూడ తీవ్రంగా వ్యతిరేకించారు. అయితే అంతరాత్మ చెప్పింది - పూజ్య గురుదేవుల ఆజ్ఞను పాటించడంలోనే కళ్యాణం ఉన్నదని.

గురుదేవులు -మాతాజీల దివ్య సంరక్షణలో నివసించసాగాను. కుమ్మరి కుండలను తయారుచేసే విధంగా - పూజ్య గురుదేవుల స్నేహం, ప్రేమ, ఆజ్ఞలు అందసాగాయి. మిషన్ పనులు చేసే బాధ్యత నెమ్మది నెమ్మదిగా పెరగసాగింది. బ్రాహ్మణ జీవితం గడిపే శిక్షణ, అభ్యాసం అందసాగాయి. మనస్సులో తృప్తి, సంతుష్టి, శాంతి ఏర్పడసాగాయి. జీవితం ఎలా సార్థకం అవుతుందో అవగాహన కావడం ప్రారంభమయింది.

1990లో ఒకరోజు ఉదయం పూజ్య గురుదేవులతో గోష్ఠి జరుగుతోంది. గోష్ఠి తర్వాత వారు నన్ను ఆగమన్నారు. వారిలా అన్నారు -

నీవు నన్ను మోసం చేశావు.

మీరు చెప్పేది నాకు అర్థంకావడం లేదు - అని నేనన్నాను.

వారిలా అన్నారు -

గురూజీ కోసం ఉద్యోగం వదులుకున్నానని నీవు ప్రపంచానికి చూపుతున్నావు. కానీ, నీ మెదడులో నీ భార్య, పిల్లలు కూర్చొని ఉన్నారు.

నేను మౌనం వహించాను. వారు తమ సూక్ష్మ దృష్టితో చూచారు. మన జీవితం వ్యర్థం అయిపోయిందని నేను నా భార్యతో చెప్పాను. ఆ తర్వాత మధ్యాహ్నం నేను నా భార్యతోపాటు గురుదేవుల దగ్గరకు వెళ్లాను. విషయం ఏమిటని వారు అడిగారు. నా మెదడులో ఇప్పుడు భార్య, పిల్లలు లేరని చెప్పాను.

ఈ పిల్ల మెదడులో ఉండవచ్చు - అని వారన్నారు.

నా మెదడులోనూ లేరని ఆమె చెప్పింది.

పూజ్య గురుదేవులు ఇలా అన్నారు -

అయితే నేటినుండి మేము నీవాడిని అయ్యాము. ఇంతవరకు మేము నీ వాళ్ళము కాలేదు. ఈ స్థితి వచ్చేవరకు మా గురువు మాకు లభించలేదు. అటువంటప్పుడు మేము నీకెలా లభిస్తాము.

గురుదేవులు అలాంటివారు.

వారితో ముడిపడి, ఈ జీవితం ధన్యమయింది.

- బ్రజ్‌మోహన్ గౌడ్

## దివ్యదృష్టి

1970లో జరిగిన సంఘటన. బీహారులోని చంపారన్‌నుండి న్యాయవాది శ్రీరామకృష్ణ సింహ్ ఒక శిబిరంలో పాల్గొనడానికి శాంతికుంజ్ వచ్చారు. రాగానే పరమపూజ్య గురుదేవులను కలుసుకోడానికి వెళ్లారు. పూజ్య గురుదేవులు ఇలా అడిగారు - రామకృష్ణా! వచ్చేశావా. త్రోవలో ఇబ్బంది ఏమీ కలగలేదు కదా.

కలగలేదు. ఉమాకాంత్ ఝూ తమకు ప్రణామాలు అందించమన్నారు - అని రామకృష్ణ జవాబు చెప్పారు.

పూజ్య గురుదేవులు ఒక్కక్షణం అర్ధనిమీలిత నేత్రాలతో ఉండిపోయారు. ఆతర్వాత బాధతో ఇలా అన్నారు-

అతడు వచ్చి ఉంటే, అతడిని చూడడం జరిగేది. అతడి సమయం పూర్తవుతోంది.

ఆమాట శ్రీరామకృష్ణ సింహ్‌కు రుచించలేదు. అయితే, పరమాత్మ యొక్క ఒక స్వరూపం సత్యం. సత్యం మరొకరికి నచ్చకపోయినా - ఆయన ఆవిషయాన్ని పట్టించుకోవలసిన అవసరం ఏముంది?

**మన కృతయుగ స్వప్నాలకు సంగ్రహ స్వరూపం శాంతికుంజ్.**

శిబిరం పూర్తయిన తర్వాత శ్రీరామకృష్ణ సింహ్ చంపారన్ తిరిగివెళ్లారు. అక్కడనుండి ఆయన వ్రాసిన ఉత్తరం నేటికీ శాంతికుంజ్‌లో భద్రంగా ఉంది. ఆయన ఆ ఉత్తరంలో ఇలా వ్రాశారు -

పూజ్య గురుదేవ్! నేను శాంతికుంజ్‌లో మీతో మాట్లడుతూన్న రోజునే, సరిగ్గా ఒక గంట తర్వాత శ్రీ ఉమాకాంతజీ అకస్మాత్తుగా జబ్బుపడి చనిపోయారు.

ఎక్కడి శాంతికుంజ్. ఎక్కడి చంపారన్. అంత దూరంలో ఉన్న దృశ్యాన్ని తన అంతర్ నేత్రాలతో చూడగలిగారు పూజ్య గురుదేవులు. ఆయన సర్వజ్ఞులు, సర్వవ్యాపి.

## హస్తసాముద్రికం

మథురలో దాఊదయాళ్‌జీ గుప్త అనే సాహిత్యవేత్త ఉన్నారు. ఆయన "జ్యోతిర్విజ్ఞాన్" అనే గ్రంథాన్ని రచించారు. ఆ గ్రంథం ఉపోద్ఘాతంలో ఆయన ఇలా వ్రాశారు -

నాకు జ్యోతిషంలో నమ్మకం ఉండేది కాదు. ఒక రోజున పూజ్య ఆచార్యజీతో మాట్లాడుతూ ఆ విషయం చెప్పాను. ఆయన నా చేయి చూచారు. గతంలో నా జీవితంలో జరిగిన సంఘటనలను పొల్లుపోకుండా వర్ణించారు. నాకు తప్ప మరెవరికీ తెలియని సంఘటనలు అవి. ఆరోజునుండి నాకు జ్యోతిషంలో నమ్మకం ఏర్పడింది.

## భవిష్యవేత్త

గతంవలెనే భవిష్యత్తుకూడ వారి గుప్పిట్లో ఉండేది.

రాజస్థాన్‌లో బిచూన్ అనే సంస్థానం ఉంది. ఆ సంస్థానపు రాణి శ్రీమతి నరేంద్ర కుమారి ఇప్పటికీ జీవించి ఉన్నారు. జయపూర్‌లో నివసిస్తున్నారు. ఆమె కుమార్తెకు వివాహం జరిగి చాలా కాలం గడిచింది. ఆమెకు పిల్లలు కలుగలేదు. ఒక రోజున నరేంద్ర కుమారి తన కూతురునూ, అల్లుడినీ తీసుకుని మథుర వచ్చారు. ఈ సంఘటన 1967 - 68లో జరిగి ఉండవచ్చు. ఆమె పూజ్య గురుదేవులకు తమ అభిలాష తెలిపారు. గురుదేవులు నవ్వి, వారిని చూచి ఇలా అన్నారు -

వచ్చే సంవత్సరం అస్సాంలోని మీ ఇంటికి వస్తాను. (నరేంద్ర కుమారి అల్లుడు అస్సాంలో తేయాకు తోటకు మేనేజరుగా పనిచేస్తున్నారు.) వచ్చి, నీ కొడుకును నా ఒడిలోకి తీసుకుని గోరుముద్దలు తినిపిస్తాను.

ఈ సంభాషణ జరిగినప్పుడు పూజ్య గురుదేవులు పర్యటించే కార్యక్రమం ఏదీ నిర్ణయం కాలేదు. తర్వాత సంవత్సరమే కార్యక్రమం నిర్ణయమయింది. పూజ్య గురుదేవులు అస్సాం వెళ్లారు. సరిగ్గా తాము చెప్పినట్లే - ఆయన వారి పిల్లవాడిని ఒడిలోకి తీసుకుని గోరుముద్దలు తినిపించారు.

ఎంతో విలక్షణమైన సంఘన ఇది.

## ఓ కార్డు చెప్పిన కథ

రాజస్థాన్‌లోని సీకర్ జిల్లాలో ఖూడ్ అనే పెద్ద గ్రామం ఉంది. ఆ గ్రామ నివాసి పండిత రామగోపాల్‌జీ శర్మ నిష్ఠావంతుడైన గాయత్రీ పరివార్ కార్యకర్త. పరమపూజ్య గురుదేవులపట్ల ఆయన శ్రద్ధ అనన్యమైనది. ఆయన ఎంతటి శ్రద్ధాళువో ఆయన కుమారుడు శ్రీశ్యామసుందర్ వశిష్ఠ అప్పుడు అంతటి అవిశ్వాసి. అతడు తరచు మథుర వచ్చేవాడు. మిషన్‌ను విమర్శచేసేవాడు.

కాలం గడిచింది. పరమపూజ్య గురుదేవులు మథురనుండి హరిద్వార్ వచ్చారు. హరిద్వార్‌నుండి హిమాలయాలకు వెళ్లారు. అప్పుడు శాంతికుంజ్ కార్యాలయంలో మేము ఇద్దరు ముగ్గురమే ఉండేవాళ్లం. వచ్చిన ఉత్తరాలకు జవాబులు వ్రాసే పనిని వందనీయ మాతాజీ మాకు అప్పగించారు. మా అవగాహన మేరకు మేము ఆ పని చేసేవాళ్లం.

ఒకరోజున శ్రీవశిష్ఠజీనుండి ఉత్తరం వచ్చింది -

"మా తండ్రిగారు తీవ్ర అస్వస్థతతో ఉన్నారు. మేము ఆయనను ఆసుపత్రికి తీసుకువెళ్లాలా, వద్దా."

ఈ ప్రశ్న ఎందుకు వచ్చిందో మాకు అర్థం కాలేదు. పరిస్థితి అదుపులో లేకపోతే ఆసుపత్రికి తీసుకువెళ్లాలి. ఇది మామూలు విషయమే కదా.

ఆ మాటే మేము ఉత్తరంలో వ్రాశాము -

"మీరు వారిని ఆసుపత్రికి తీసుకువెళ్లండి. వందనీయ మాతాజీ వారికోసం గాయత్రీ మాతను ప్రార్థిస్తారు".

**మతం ఉపదేశం కాదు - దివ్య నేత్రంపై పేరుకున్న ధూళిని తొలగించే వైద్యం.**

ఆ ఉత్తరం వారికి అందింది. అప్పుడు పండిత రామగోపాల్‌జీ కోమాలో ఉన్నారు. ఆయనను ఆసుపత్రికి తీసుకువెళ్లారు. కొద్దిసేపటి తర్వాత ఆయనకు స్పృహ వచ్చింది. నేను ఎక్కడ ఉన్నాను - అని ఆయన తన కుమారుడు వశిష్ఠను అడిగారు. ఆసుపత్రిలో ఉన్నారని ఆయన జవాబిచ్చారు. రామగోపాల్‌జీ నవ్వారు. ఇలా అన్నారు -

"నాయనా చూడు. గురుదేవులను నీవు అర్థం చేసుకోలేదు. నా పెట్టెలో ఒక కార్డు ఉంది. గురుదేవులు ఆ ఉత్తరంలో నన్ను ఆసుపత్రికి వెళ్లవద్దన్నారు. జరిగింది మంచికే జరిగింది. ఆయన 8 3/4 సంవత్సరాల గడువు నిర్ణయించారు. నీవు ఆ కార్డు తప్పక చూడు."

ఆయన కళ్ళు మూసుకున్నారు శాశ్వతంగా.

శ్రీ వశిష్ఠ ఆ కార్డు వెదికారు. పరమపూజ్య గురుదేవులు 1962లో వ్రాసిన కార్డు అది. "మేము మథురలో 8 3/4 సంవత్సరాలు ఉంటాము. నీవు ఆసుపత్రికి వెళ్లవద్దు. రోగం ఎంత తీవ్రం అయినా నీకేమీ కాదు. ఇది మా బాధ్యత" - అని అందులో వ్రాసి ఉంది.

"శ్రీవశిష్ఠ ఒక్కొక్కరోజు లెక్కవేశారు. ఆరోజునుండి పండిత రామగోపాల్‌జీ చనిపోయిన రోజువరకు సరిగా 8 3/4 సంవత్సరాలు అయింది. ఒక రోజు ఎక్కువా కాదు, తక్కువా కాదు. ఈ కార్డు శ్రీవశిష్ఠను శ్రద్ధాళువుగా మార్చివేసింది.

అంత్యక్రియల తర్వాత తండ్రిగారి అస్థికలను గంగలో కలపడానికై శ్రీవశిష్ఠ హరిద్వార్ వచ్చారు. ఆ కార్యక్రమం ముగించుకుని ఆయన సరాసరి శాంతికుంజ్ వచ్చారు. పూర్వ పరిచయం ఉండడంవల్ల ఆయనను చూచి చిరునవ్వు నవ్వాను.

"పరిహార్ జీ ! మీరు నవ్వడం బాగుండలేదు" - అన్నారు వశిష్ఠజీ.

"ఎందువల్ల? ఏదైనా జరిగిందా?" - అని అడిగాను.

ఆయన ఇలా అన్నారు -

"నేను పూర్వపు వశిష్ఠను కాను. నా విషయంలో ఏ అద్భుతం జరిగిందో ఈ కార్డు చూస్తే మీకే తెలుస్తుంది" - అంటూ ఆయన పూజ్య గురుదేవులు వ్రాసిన కార్డును తన జేబులోనుంచి తీసి నాకిచ్చారు. ఆ ఉత్తరం చదివితే నాకు బాధ కలిగింది. తమ తండ్రిగారిని ఆసుపత్రికి తీసుకువెళ్లాలా వద్దా అని ఆయన ఎందుకు అడిగారో నాకు అర్థమయింది.

మరో విశేషం ఉంది. 1962లో మేము మథుర వచ్చాము. నాటినుండి 1970వరకు గురుదేవులు మథుర వదలి హరిద్వార్ వెళతారని ఎవరికీ ఏమాత్రం తెలియదు. వారి అవతరణ వ్యక్తిగాకాక సంకల్పంగా జరిగిందని ఈ కార్డునుబట్టి స్పష్టమవుతోంది.

రెండవ విషయం. వారు మథుర వదలి వెళ్లిన తర్వాతనే ఆసుపత్రిలో ఆయన మరణం జరుగుతుందని ఆ ఉత్తరం పరోక్షంగా సూచించింది. ఎందుకంటే - మృత్యువును ఎవ్వరూ తప్పించుకోలేరు. కనుకనే - 8 3/4 సంవత్సరాల తర్వాత ఆయన జీవిస్తారని హామీ ఇవ్వలేనని ఆ కార్డులో పరోక్షంగా సూచించారు. అంటే ఆయన మరణం ఖాయమని. లేకపోతే - మథునుండి జరిగిన పని హరిద్వార్‌నుండి జరగడానికి ఇబ్బంది ఏముంది?

లక్షలు ఇచ్చినా ఆ కార్డు ఇవ్వనని శ్రీవశిష్ఠ ఖచ్చితంగా చెప్పారు. అయితే ఆ కార్డు ఫోటోస్టాట్ ప్రతిమాత్రం ఆయన ఇచ్చారు.

శ్రీవశిష్ఠజీ ప్రస్తుతం జిల్లా ఆయుర్వేద వైద్య అధికారిగా పని చేస్తున్నారు. ఖుడ్‌లోని గాయత్రీ శక్తిపీఠం పనికూడ చూస్తున్నారు.

పరమపూజ్య గురుదేవులు సర్వజ్ఞులనీ, సర్వద్రష్ట అనీ, మహాకాలుడు అనీ పై సంఘటన చెపుతోంది.

### పండిట్‌జీ జయజయధ్వానాలు

1967లో జరిగిన ఒక సంఘటన.

రాజ్‌కోట్ కార్యకర్త శ్రీనట్వర్‌లాల్ జానీ గాయత్రీ తపోభూమికి వచ్చారు. దిగువ సంఘటనలోని వ్యక్తి పూర్తి చిరునామా జానీజీ డైరీలో ఉంది.

ఒక రోజున బీహారులోని ధన్‌బాద్‌నుండి ఒక పండిట్‌జీ మథురలోని గాయత్రీ తపోభూమికి వచ్చారు. ఆయనను ఒక ప్రక్కన ఆయన భార్య పట్టుకున్నారు. మరోప్రక్క ఆయన

**కాలాన్ని సత్కర్మలతో నింపు. అది ఫలాలతో నిన్ను నింపుతుంది.**

కుంటివాని పోటీ కర్ర పట్టుకున్నారు. ఆయనకు పోటీకర్ర పూర్తిగా అలవాటు లేకపోవడంవల్ల ఆయన కూతురు ఆసరా ఇస్తోంది. పండిట్‌జీ ఆసనంమీద కూర్చొని నిర్విరామంగా భగవద్గీత నవాహ్న పారాయణ చేశారు. అలా తొమ్మిది రోజులు ఒకే స్థితిలో కదలకుండా కూర్చొని ఉండడంవల్ల ఆయన కాళ్లు చచ్చుబడిపోయాయి. ఆయన మథుర వచ్చారు. పూజ్య గురుదేవులతో ఇలా అన్నారు -

నా జబ్బు నయం చేయమని భిక్షం అడగడానికి నేను మీవద్దకు రాలేదు. నాకు ఒక్క విషయం చెప్పండి. భగవద్ భక్తికి ఇలా శిక్ష పడితే - ప్రపంచంలో ఎవరు భక్తులు అవుతారు, ఎవరు తపస్సు చేస్తారు?

పూజ్య గురుదేవులు సంయమనంతో, సహజరీతిలో ఇలా జవాబిచ్చారు -

పండిట్‌జీ! ఇలా ఎందుకు జరిగిందో నేను చెప్పలేను. ఒక్క మాట మాత్రం చెప్పగలను. మీరు ఇతరుల కాళ్లతో వచ్చారు మీరు ఇక్కడినుంచి వెళ్ళేది మీకాళ్ళతో.

పండిట్‌జీ బసకు ఏర్పాటు జరిగింది. ఒక రాత్రి ఆయన ఆ స్థితిలోనే గడిపారు. మరునాడు నిద్ర పోయారు. అర్ధరాత్రి మూత్ర విసర్జనకు లేచారు. మామూలుగా అయితే ఆయన తనను బయటికి తీసుకువెళ్లడానికి భార్యను లేపేవారు. ఆరోజున ఏమయిందో తెలియదు. లోపలనుంచి ఏదో ఆవేశంలాంటిది ఉబికివచ్చింది. ఒక బెత్తం పుచ్చుకుని లేచి నిలబడ్డారు. సరాసరి నడిచారు. ఆ సమయంలో ఆయన తన భావోద్వేగాన్ని అదుపుచేసుకోలేకపోయారు. బిగ్గరగా కేకలు వేస్తూ జయజయధ్వానాలు చేస్తూ ఆయన తపోభూమి అంతటా తిరగసాగారు. ఆ కేకలకు జనం మేలుకున్నారు. ఆ దృశ్యం చూచి ఆశ్చర్యానికి లోనయ్యారు.

## భక్తరక్షణ

ఢిల్లీ నివాసి బశేసర్ నాథ్ గుప్తకు పరమపూజ్య గురుదేవులపై అపారమైన శ్రద్ధాభక్తులు ఉండేవి. ఆయన కుటుంబంలో, బంధువర్గంలో ఈ శ్రద్ధ ఫలించి పుష్పించింది. ఆయన కుటుంబంలోని ఎవరో ఒకరు - ముఖ్యంగా ఆయన కుమారులు శ్రీశివశంకర గుప్త, శ్రీహేమచంద్ర జీ, ఆయన భార్య పూజ్య గురుదేవుల దర్శనం కోసం ప్రతి ఆదివారం మథుర వచ్చేవారు. నేటికీ వస్తున్నారు. అయితే వారు మథురలో ఆగేవారు కాదు. ఎంత పొద్దుపోయినా, రాత్రికి ఢిల్లీ చేరుకునేవారు. మొదటినుంచి వారి పద్ధతి అదే. కనుక పరమపూజ్య గురుదేవులు వారిని ఆపేవారు కాదు.

కానీ, ఒకరోజున వారు రాత్రికి ఉండిపోవాలని ఆయన పట్టుపట్టారు. అందుకు శ్రీశివశంకర్‌జీ ఇలా అన్నారు -

తమకు తెలుసు కదా. ఉదయమే దుకాణం తెరవాలి.

గురుదేవులు ఇలా అన్నారు -

మీరు లేకపోయినా, ఎవరో ఒకరు దుకాణం తెరుస్తారు కదా.

అయినా వారు వెళ్లడానికే నిర్ణయించుకున్నారు. ఆరోజున శ్రీశివశంకర్‌జీ, శ్రీహేమచంద్రజీ, ఆయన భార్య విమలాజీ, కూతురు పింకీ - మొత్తం నలుగురు వచ్చారు. ఈ చర్చ చాలాసేపు జరిగింది. బాగా ఆలస్యం అయినందువల్ల వారు బస్సుకోసం బస్ స్టాండ్‌కు బదులు దారి మధ్యలో ఉన్న మసానీ రైల్వే స్టేషన్ సమీపంలోని మూడురోడ్డుల కూడలివద్దకు వెళ్లవలసి వచ్చింది.

బస్సు పల్‌వల్ సమీపించింది. ఎదురుగా వస్తున్న లారీ ఆ బస్సును ఢీకొన్నది. ప్రమాదం జరిగింది. పదముగ్గురు అక్కడికక్కడే చనిపోయారు. ఈ నలుగురూ తప్ప - బస్సులోని మిగతా ప్రయాణికులందరూ గాయపడ్డారు. నిలబడి ఉన్నందువల్ల వీరు గాయపడకుండా బయటపడ్డారు.

ఆశ్చర్యకరమైన సంగతి ఏమంటే - ప్రమాదం జరగడానికి ఒక సెకనుముందు పిల్ల పింకీ - 'మమ్మీ! గురూజీ!' అన్నది. 'ఎక్కడ?' - అని కుటుంబ సభ్యులు అడుగుతూ ఉండగానే, ఈ ఘోర ప్రమాదం జరిగింది.

పూజ్య గురుదేవులు ఆ దెబ్బలు తనమీద వేసుకున్నారు. ఆ కుటుంబానికి మాత్రం ఏమాత్రం దెబ్బతగలనివ్వలేదు.

- బలరామ్ సింహ్ పరిహార్

H H H

**నిరర్థకమైన పనులే కలుపుమొక్కలు. వాటిని తొలగించు.**

# ఉపాసన, సాధన, ఆరాధనల త్రివేణి - 1

## ఉపాసన నా ఊపిరి

*పరపూజ్య గురుదేవులు తమ ఆత్మకథలోని ఏడవ అధ్యాయంలో తమ జీవన సాధనను వర్ణించారు. ఆ సాధన తన జీవితానికి ఎలా కేంద్ర బిందువు అయిందో వివరించారు. ఆ సాధన వెనుక ఉన్న సిద్ధాంతాన్ని విశదీకరించారు. కనుక - ఈ అధ్యాయం సాధకులకు - ముఖ్యంగా గాయత్రీ సాధకులకు - కరదీపిక అవుతోంది; దీపస్తంభం అవుతోంది. ఆ అధ్యాయాన్ని మూడు భాగాలుగా అందిస్తున్నాం.*

అనంతర సంఘటనలను వివరించే ముందు నా ఆధ్యాత్మిక ప్రగతితో ముడిపడిన నా జీవన సాధనలోని మూడు ప్రధాన దశలను వర్ణించుట సముచితము. విజయవంతమైన నా జీవన యాత్రలోని కేంద్ర బిందువు ఇదియే. పాఠకులు ఈ మార్గములో పయనించుటకు ప్రేరణను పొందినయెడల- నేను నా జీవితంలో అనుసరించిన సాధన వెనుక ఉన్న సిద్ధాంతమును వారు జీర్ణము చేసుకొనవలెను. అద్భుత సంఘటనలు ఆసక్తిని కలిగించు మాట నిజము. అయితే అవి ఆ వ్యక్తికి మాత్రమే పరిమితమైనవి. అట్టి సంఘటనలకు ఆకర్షితుడై, ఒక వ్యక్తి ఆ కర్మకాండను అనుసరించిన యెడల, హిమాలయ యాత్ర జరిపిన యెడల అతనికి ఏమియును సిద్ధించదు. ఈ శరీరములో నివసించుచూ నా ఆత్మ గ్రహించిన అతి ముఖ్యమగు పాఠములు మూడు. నిజమగు ఉపాసన, సరియగు జీవన సాధన, ఆరాధన (అనగా మానవ సేవ). ఈ మార్గము వ్యక్తిని దివ్య మానవునిగా, ఋషిగా, లేక దేవ దూతగా మలచును.

మనిషి ప్రాణము నిలుపుకొనవలెనన్నచో అతడికి ఆహారము, వస్త్రములు, గృహ వసతి అవసరము అగును. గ్రంథ రచనకు కలము, సిరా, కాగితము అవసరము. పంట పండించుటకు విత్తనము, ఎరువు, నీరు అవసరము. ఈ మూడును ముఖ్యమైనవే. వీనిలో దేనిని కూడ ఉపేక్షించలేము. ఆ విధముగానే ఆధ్యాత్మిక ప్రగతికి ఉపాసన, సాధన, ఆరాధనల సమన్వయము అవసరము.

### ఉపాసన నిజ స్వరూపం

ఉపాసనలో పూజ, స్తోత్రము ముఖ్యమైనవి కావు. ఇవే ఉపాసన అనుకొనుట పొరపాటు. దేవునికి నైవేద్యము పెట్టుట, బాహ్యమైన కొంత కర్మకాండ పూజగా పరిగణించబడుచున్నది. భగవంతుని గుణగణములను కీర్తించుట స్తోత్రము. మిఠాయి, కొబ్బరికాయ మొదలైనవి దేవునికి నైవేద్యము పెట్టుదురు. ఆయనకు అవి లేనట్లు, వాటిని సమర్పిస్తే ఆయన ఆనందంలో తలమునకలు అగునట్లు, వంది మాగధుల స్తోత్రముల వల్ల పాలకుడు ఉబ్బితబ్బిబ్బు అయ్యే విధముగా - దేవుడు తమ పూజా పురస్కారములవల్ల ప్రసన్నుడై ప్రాపంచికములగు తమ కోర్కెలు తీర్చునని ప్రజలు భావింతురు. అట్టి వ్యక్తులకు భగవానుని యొక్క తత్వము తెలియదు. బాలునివలె అతనిని ప్రలోభపెట్టవచ్చునని, ఏమరచవచ్చునని, అతడు మూర్ఖుడని వారు భావిస్తారు. తమ కోర్కెలు న్యాయమైనవి అయినను కాకున్నను, సముచితము లైనను కాకున్నను వాటిని తీర్చుటకు దేవుని ఒప్పించవచ్చునని వారు భావిస్తారు. సామాన్య వ్యక్తి ఈ భ్రమకు లోనవుతాడు. భక్తులని పిలువబడువారు సంపద, విజయము, స్వర్గము, మోక్షము, సిద్ధులు ఇవ్వమని దేవుని ప్రార్థిస్తారు. దేవుని మామూలు కళ్లతో చూచిన తర్వాత కొందరి మనస్సులు తెలివి తప్పుతాయి. మాలలు లెక్క పెట్టువారిలో, అగరవత్తులు వెలిగించువారిలో పలువురు ఈ తరహాకు చెందుతారు. కొందరు మరింత చౌక అయిన పద్ధతిని అనుసరిస్తారు. దేవాలయములో విగ్రహాన్ని దర్శించడంవల్ల, సాధువుల దర్శనం వల్ల తమ కోరికలు తీరుతాయని వీరు భావిస్తారు. ఇటువంటి మూఢ నమ్మకాలు సమాజములో వ్యాపించి ఉన్నాయి.

నిజంగా విలువైన వస్తువు మరింత ఖరీదుగా ఉంటుందని స్పష్టంగా గ్రహించాలి. కేంద్ర మంత్రివర్గంలో

**పండిన పంటను దురావేశాలు అనే దుమ్మునుండి వేరు చెయ్యి.**

చేరాలంటే పార్లమెంటు సభ్యునిగా ఎన్నిక కావాలి. ఉపాసన అనగా దగ్గర కూర్చొనుట. రైలులోకి ప్రవేశించాలని ఒకరినొకరు త్రోసుకునే ప్రయాణికుల పద్ధతి కాదు ఇది. ఒకే మనస్సు, ఒకే ఆత్మ కలిగిన ఇద్దరు ప్రాణమిత్రులు కలసి కూర్చొనడం ఇది. ఈ సాన్నిహిత్యంలో ఒకరు మరొకరికి శరణాగతి కావాలి. భక్తుడు తన జీవితాన్ని మలచుకుని, భగవంతునికి శరణాగతి కావాలి.

ఆధ్యాత్మిక ఉన్నతికి తొలిమెట్టు ఉపాసన. దాని ప్రాముఖ్యాన్ని, దాని తత్వాన్ని వివరిస్తూ గురుదేవులు ఇలా అన్నారు - "దేవుడు నీవు ఆడించినట్లు ఆడడు. నీవు ఆయనకు భక్తుడవు కావాలి. ఆయన సంకల్పం ప్రకారం నీవు పని చేయాలి. ఆ పని చేయగలిగితే, నీవు దేవునితో మమేకం అవుతావు. మంటను కౌగలించుకుని, మంటగా మారినపుడే కట్టెకు సార్థకత. నీవు కట్టెగా మారాలి. కట్టె నిప్పుగా మారాలి. మురుగు కాలువ నదిలో కలుస్తుంది. నదివలె పవిత్రంగా, గొప్పగా మారుతుంది. కాని, నది వ్యతిరేక దిశగా ప్రవహించి మురుగు కాలువను కలసి, దానివలె మురికిగా మారడం ఎన్నడూ జరుగదు. ఇనుము పరుసవేదికి తాకితే బంగారంగా మారుతుంది. అది పరుసవేదిగా మారదు. సాధకుడే తోలుబొమ్మవలె భగవంతుడు ఆడించినట్లు ఆడాలి. దేవుడు సాధకుని కోర్కెలను తీర్చడు. సాధకుడే తీర్చాలి. నీటిబొట్టు సముద్రంలో కలసి సముద్రం అవుతుంది. సముద్రం నీటి బొట్టుగా మారదు. ఉపాసనలోని తత్వం ఇది. ఉపాసన చేయగోరు వ్యక్తి దేవుని దగ్గర కూర్చొని, ఆయన సంకల్పాన్ని అమలుచేసే అనుచరుడుగా మారాలి".

నేను ఆ పద్ధతినే అనుసరించాను. నేను దేవుడిని పూజించాను. దివ్యమాత గాయత్రీ జపం చేసేను. దివ్యపిత సవితపై ధ్యానం చేసేను. నిరంతరం నాలో ఒకే భావం ఉండేది. శ్రవణ కుమారునివలె నేను నా తల్లిదండ్రుల నుండి దేనినీ కోరను. వారిని మోసుకుని తీర్థయాత్రలకు తీసుకువెళతాను. యోగ్యులైన తల్లిదండ్రులకు యోగ్యుడైన కుమారుడుగా పిలువబడే విధంగా నేను నా వ్యక్తిత్వాన్ని మలచుకుంటాను. ధ్యాన సౌలభ్యం కోసం నేను గాయత్రిని మాతగా, సవితను పితగా పరిగణించాను. అయినా, వారు నిరాకారులు, అంతరిక్షవాసులని, సర్వవ్యాపకులని నాకు తెలుసు. ఈ విశ్వాసం కారణంగా - వారు నా ఆత్మను పూర్తిగా ఆవరించి ఉన్నారని నేను భావించగలిగాను. వారితో నాకు పూర్తి తాదాత్మ్యం ఏర్పడింది. దేవుని, గాయత్రీమాతను నేను ప్రత్యేక వ్యక్తులుగా పరిగణించి ఉంటే, మా మధ్య దూరం నిలచి ఉండేది. పూర్తి తాదాత్మ్య భావన నాకు లభించేది కాదు.

ప్రారంభంలో సాధన కోసం వ్యక్తి తనను లతగా, దేవుడిని చెట్టుగా పరిగణించాలి. లత చెట్టును కౌగలించు కుంటుంది. చిటారు కొమ్మకు చేరుతుంది. తాను తన జీవితాన్ని క్రమశిక్షణబద్ధంగా, స్ఫూర్తి ప్రదంగా చేసికోవడానికై వ్యక్తి తనను మురళిగా, దేవుని మురళీధరునిగా పరిగణించాలి. గాలిపటం గాలిలో ఎగురుతూ ఉండడం, దానిని అదుపుచేసే దారం బాలుని చేతుల్లో ఉండడం అనే విషయాన్ని ధ్యానం చేయడం కూడ ప్రయోజనకరం. నేను ఈ మూడు విధములైన ధ్యానములను చేశాను. ఉత్సాహకరమైన, ఆనందకరమైన అనుభవాలను పొందాను.

నా ఉపాసనలో కర్మకాండకు అంత ప్రాధాన్యం లేదు. ఆ ఉపాసన భావతీవ్రతతో, భక్తి శ్రద్ధలతో పొంగిపొరలింది. జపం చేయడంలో నేను నిర్ణీత పద్ధతిని అక్షరాలా పాటించాను. రోజూ ఉదయం ఒంటిగంటకు నిద్రలేచి జపం చేయడంలో నాగా ఉండేది కాదు - అత్యవసర పరిస్థితి వస్తే తప్ప. ఏదైనా కొరత వస్తే, దానిని మరునాడు పూర్తి చేసేవాడిని. బకాయి ఎన్నడూ మిగిలేదు కాదు. నా ఉపాసనలో భావ తీవ్రతతో నిండిన వైఖరిని కొనసాగించడానికి నేను సాధన చేసేను. త్యాగం, ఏకత్వం, తాదాత్మ్యం, ద్వంద్వముల తిరస్కృతి అనే భావనలను మేలుకొలిపే అభ్యాసం మొదట్లో ఊహ రూపంలో జరిగేది. తర్వాత అది స్వభావంలో అంతర్భాగం అయింది. చివరికి ఆత్మసాక్షాత్కారంగా పరిణతి చెందింది.

గాయత్రీ మాత యొక్క శక్తి కారణ శరీరంలో శ్రద్ధగా, సూక్ష్మ శరీరంలో ప్రజ్ఞగా, భౌతిక శరీరంలో నిష్ఠగా ప్రతిబింబించింది. ఇది వట్టి కపోల కల్పనగా మిగిలిపోకుండా జాగ్రత్తపడడానికై కఠినమైన ఆత్మ పరీక్ష ఎప్పటికప్పుడు జరిగేది.

**నీవు నీ కృషికి దాసుడవై, నీవు చేసే పంపకానికి యజమానివై ఉండు.**

ఆదర్శవాద జీవితాన్ని గడపాలనే నిష్ఠ, మానవాళికి సేవ చేయాలనే నిష్ఠ పెరిగాయా లేదా, ప్రలోభం తొలగిందా లేదా అని రోజువారీ సంఘటనల వెలుగులో నన్ను నేను పరీక్షించుకున్నాను. విశ్లేషించుకున్నాను. ఋషికల్పుడైన సాధకుని భావనలవలె నా భావనలు పూర్తిగా పరిణతి చెందినట్లు కనుగొన్నాను.

గాయత్రీ మాత స్త్రీ రూపంలో దివ్యశక్తిగా వ్యక్తమయింది. ఆమె ప్రజ్ఞగా మనోభూమికి ఆధిపత్యం వహించింది. ప్రజ్ఞ రూపంలో వివేకం, బాధ్యతాయుతత్వం, నిర్భీకతల సమన్వయం అంతరాంతరాలలో జరిగిందా అని ధృవపరచుకోవడానికై నేను పలు సందర్భాలలో పరీక్ష జరిపాను. గాయత్రీ మాత ప్రజ్ఞగా నా అంతః చైతన్యంలో అవతరించిందనీ, నా ఉపాసన, జపము, ధ్యానము ఫలించాయనీ నేను అనుభూతి పొందుతూవచ్చాను. **మన విశ్వాసాలు, మన సిద్ధాంతాలు, మన కర్మలలో, గుణములలో, స్వభావములలో ప్రతిబింబించడం అన్నది ఉపాసనకు నిజమైన పరీక్ష.**

త్రిపదా గాయత్రీలోని మూడవ అంశం నిష్ఠ, నిష్ఠ అంటే దృఢ నిశ్చయం, ఓర్పు, ధైర్యం, సాహసం, తపస్సు, ధృతి. కుమ్మరి ఆవం నుండి వెలికి తీసిన కుండను వ్రేళ్లతో మ్రోగించి చూస్తాడు. అది పూర్తిగా కాలిందా, సగం సగం కాలిందా అని పరీక్షిస్తాడు. అలాగే, ప్రలోభాలవల్ల, భయం వల్ల నా దృఢత్వం సడలిందా అని నేను ఆత్మపరీక్ష చేసుకుంటూ వచ్చాను. ప్రతి అడుగూ ముందడుగేనని కనుగొన్నాను.

సవిత యొక్క తేజస్సును బ్రహ్మవర్చస్సు అంటారు. దానిని ఓజస్సు, తేజస్సు, వర్చస్సు అని కూడ అంటారు. పుణ్యము, కుశాగ్రత, దీప్తి అనే రూపాలలో అది ప్రత్యక్షంగా ప్రతిబింబిస్తుంది. **భౌతిక, సూక్ష్మ, కారణ కోశాలలో సవిత యొక్క తేజస్సు కురిసినపుడు - శరీరం బలంతో, మెదడు జ్ఞానంతో, హృదయం ప్రేమ ధైర్యాలతో నిండిపోతుంది.** నా ఆత్మ అంతా ఒక కాంతి క్షేత్రంగా, అగ్ని జ్వాలగా మారిన అనుభూతి ఆ తర్వాత నాకు కలిగింది. నా శరీరంలోని ప్రతి కణంలోనుండి అమృతం ప్రవహించింది. సోమరసాన్ని త్రాగుతూన్నట్లు, సంతృప్తినీ, సాఫల్యాన్నీ, శాంతినీ, ఆనందాన్నీ పొందుతూన్నట్లు నాకు అనుభూతి కలిగింది.

ప్రతి రోజూ నాలుగు గంటలపాటు నేను చేసిన ఉపాసనలోని నియమిత కార్యక్రమం క్లుప్తంగా ఇది.

విసుగుదల, అలసట, ఆవులింత లేకుండా ఈ సమయం సునాయాసంగా సాగిపోయేది. అరగంట మాత్రమే గడచినట్లు అనిపించేది. అనుక్షణం నేను దివ్యానందాన్నీ, దైవ సాన్నిధ్యాన్నీ పొందాను. ఇది నిత్య విధి అయింది. లెక్కించాలని, గొప్ప చెప్పుకోవాలని, బహుమతులను గురించీ ఫలితాలను గురించీ ఆలోచించాలని నాకు అనిపించేది కాదు. దినచర్యలోని మిగతా పనులవలెనే, ఉపాసన - దేవుని సన్నిధిలో కూర్చోవడం - నాకు సజీవమైన సహజమైన చర్య అయింది. **ఆ ఉపాసన లేనిదే నేను ఒక్క రోజయినా జీవించలేను.** ప్రతి రోజూ నిర్ణీత సమయంలో ఉపాసన చేయడం ఆధ్యాత్మిక శక్తితో నన్ను నేను నింపుకోవడమే. ఆ శక్తి రోజంతా దివ్యానందంతో నన్ను నింపేది. **దేవునిలో నన్ను, నాలో దేవుణ్ణి ఆనందంగా అనుభూతి పొందుతూ నేను అనుక్షణం గడుపుతున్నాను.**

ఆంతరిక చైతన్యం ఆ దశలో ఉన్నప్పుడు వ్యక్తి ఎగుడు దిగుడులను సమానంగా స్వీకరిస్తాడు. సంతోషం కాని, విచారం కాని అతడికి ఉండవు. చుట్టూ బ్రహ్మానంద సముద్రం తరంగాలతో కానవస్తుంది.

ఎటు చూసినా నాకు దైవమే కనిపిస్తున్నాడు. నేను ఎక్కడకు వెళ్ళినా అతడు నా ప్రక్కన నడుస్తున్నాడు. ప్రతి క్షణం ఆయన ఉనికి నాకొక రక్షగా, ఒక మార్గదర్శక శక్తిగా ఉన్నట్లు నేను అనుభూతి పొందుతున్నాను. సముద్రం నీటి బొట్టుగా మారజాలదు. నీటి బొట్టు తన అస్తిత్వాన్ని సముద్రంలో లీనం చేసి తాను సముద్రంగా మారుతుంది. **దేవుని నిరంతర సాన్నిహిత్యంవల్ల నిస్సంకోచం, నిర్భయం సహజంగా ఉదయిస్తాయి.**

నేను నా జీవితమంతటిలో దైవం పట్ల శ్రద్ధను నింపుకున్నాను. దైవంతో ఏకం కావడంలో అది నా ఆత్మకు సాయపడింది. భగవతిగా అది తనను తాను వెల్లడించుకుంటోంది. ప్రకటించుకుంటోంది. HHH

**మానవజాతిలోని అసమగ్రతను తరించి నిలబడిన పరిపూర్ణ మూర్తులు పరమ గురువులు.**

## గురుపూర్ణిమ వ్యాసం - 1

# ఉపాధ్యాయుడు, ఆచార్యుడు, గురువు, సద్గురువు

### నాలుగు కాంతికేంద్రాలు

ఉపాధ్యాయుడు, ఆచార్యుడు, గురువు, సద్గురువు సమాజానికి వెలుగుబాట చూపే మహత్తర పాత్రను నిర్వహిస్తారు. జ్ఞానానికీ, చేతనకూ సంబంధించిన ఒక ప్రత్యేక స్థితికి వారు దివ్య ప్రతీకలు, దివ్య ప్రతినిధులు. కళను నేర్పే వ్యక్తి ఉపాధ్యాయుడు. జీవితాన్ని నేర్పే వ్యక్తి ఆచార్యుడు. చేతనలోని నిగూఢ రహస్యాలను విప్పిచెప్పే వ్యక్తి ఆచార్యుడు. శిష్యుడిని తనలో కలిపివేసుకునే తత్వం సద్గురువు. ఈ తత్వాలు నాలుగూ కలగలిసి ఉన్నప్పటికీ ఒకటి కావు. వీరిలో ప్రతి ఒక్కరికీ తన పరిధి, సామర్థ్యం ఉంటాయి. అయితే, అసంస్కృత వ్యక్తిత్వాన్ని సంస్కరించి, మెరుగులు దిద్ది, దానిని భౌతికంగా, ఆత్మికంగా పరిపూర్ణం చేయడంలో వీరు తమతమ మౌలిక ప్రతిభలను అందిస్తారు.



ఉపాధ్యాయుడు జ్ఞానంలోని ఒక విభాగంలో నిపుణుడై ఉంటాడు. అతడు వివిధ నైపుణ్యాలకు ద్వారాలు తెరుస్తాడు. వాటిని ఆవిష్కరిస్తాడు. అతడికి తన విశిష్ట రంగంలో విశేషమైన, లోతయిన జ్ఞానం ఉంటుంది. ఆ రంగంలో అతడి ప్రతిభ బాగా వికసించి ఉంటుంది. తన రంగంలో లోతయిన అనుభవం ఉంటుంది. అతడు తన అనుభవాన్ని విద్యార్థికి అందిస్తాడు. విద్యార్థిలోపల ఉన్న కౌశల్యాన్ని వికసింపజేసే అపార సామర్థ్యం ఉపాధ్యాయునికి ఉంటుంది. విద్యార్థిని తనంత నిష్ణాతుడిని చేసే కళ, తనను మించిన నిష్ణాతుడిని చేసే కళ అతడివద్ద ఉంటాయి. మామూలు విద్యార్థిని మహత్తర ప్రతిభ కలిగిన పరిశోధకునిగా తీర్చిదిద్దే విశేషజ్ఞత అధ్యాపకుని దివ్య లక్షణం.

ఉపాధ్యాయుడు జ్ఞాన సముద్రుడుగా ఉంటాడు. ఆ సముద్రంలో కళా కౌశల్యాలు ఉత్తుంగ తరంగాలుగా పొంగిపొరలుతూ ఉంటాయి. విద్యార్థి జీవితంలోనికి అతడీ కౌశల్యాల వరదలను తీసుకువస్తాడు. అతడు తన విద్యార్థిని అసామాన్య ప్రతిభలో నిష్ణాతుడుగా, పారంగతుడుగా చేసివేస్తాడు.

ఇలా ఉపాధ్యాయుడు జ్ఞానాన్నీ, కౌశల్యాన్నీ నేర్పుతాడు. అయితే - జీవించే కళను నేర్పడంలో మాత్రం ఉపాధ్యాయుడు నిస్సహాయుడు అవుతాడు, అసమర్థుడు అవుతాడు. ఎందుకంటే - ఆ కళ అతడి పరిధిలోనిది కాదు. ఆ విషయం అతడికి తెలియనిది, అతడికి పరిచయం లేనిది. శస్త్రచికిత్స నిపుణునికి తన ఆపరేషన్ థియేటర్‌లో శస్త్రచికిత్స చేసే పరిజ్ఞానం ఉంటుంది. కానీ, జీవితానికి శస్త్ర చికిత్స చేసే కళను అతడు బోధించలేడు. ఈ కళ కొంచం కఠినమైనది. ఎందుకంటే - జీవితాన్ని జీవించిన తర్వాతనే నేర్పగలుగుతాము. తన వ్యక్తిత్వాన్ని సంస్కరించుకున్న వ్యక్తియే, సక్రమంగా తీర్చిదిద్దుకున్న వ్యక్తియే ఇతరుల వ్యక్తిత్వాలను వికసింపజేయగలుగుతాడు.

### ప్రావీణ్యం వేరు, అనుభవం వేరు

నేడు సమాజంలో, జాతిలో, ప్రపంచంలో ప్రతిభల

**మానవసేవలో నిన్ను నీవు మరచిపోతే - నీ అవసరాలు వాటికవి పూర్తవుతాయి.**

కొరత లేదు. మెడికల్, టెక్నికల్, ప్రొఫెషనల్ కాలేజీలనుండి ప్రథమ శ్రేణిలో వెలికివచ్చే ప్రతిభావంతులైన విద్యార్థులకు కొదువ లేదు. ప్రభుత్వ రంగంలో, కార్పొరేట్ రంగంలో, ప్రొఫెషనల్ కాలేజిలలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లకూ, ప్రొఫెసర్లకూ కొరత లేదు. కానీ, నిపుణులైన ఈ అధ్యాపకులూ, ప్రతిభావంతులైన ఈ విద్యార్థులూ జీవించే కళ విషయంలో బలహీనులే. వారి ఆంతరిక వ్యక్తిత్వాలు కేంద్ర రహితములుగా, అస్పష్టంగా, బోలుగా కనిపిస్తాయి. ఏదో తీరని దాహం వారిని వేధిస్తున్నట్లు అనిపిస్తుంది. వారి భావనలు దారి తప్పినవిగా, తృప్తిచెందనివిగా, ఆరనివిగా ఉంటున్నాయి. వారికి బుద్ధి కుశలత లభించింది. కాని అనుభవం లభించలేదు. ప్రావీణ్యం లభించింది. కాని వ్యక్తిత్వం మెరుగుపడలేదు. అనుభవాన్ని కలిగించే, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే ఆచార్యుడు వారికి లభించలేదు.

## ఉపాధ్యాయునికీ, ఆచార్యునికీ తేడా

ఉపాధ్యాయుడు ఆచార్యుడు కాడు. ఆచార్యుడు ఉపాధ్యాయునికి మరోపేరు కాదు, కాలేదు. అయితే ఆచార్యుడు ఉపాధ్యాయుడుకూడా కాగలుగుతాడు. ఎందుకంటే - అతడు వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడంతోపాటు కళా కౌశల్యాన్ని కూడ నేర్పగలుగుతాడు.

వ్యక్తిత్వంలోని వివిధ కోణాలనుగురించి ఆచార్యునికి లోతయిన అవగాహన, పరిజ్ఞానం ఉంటాయి. కనుకనే, అతడు వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దగలుగుతాడు, నిగ్గుతేల్చగలుగుతాడు. ఆచార్యుని వాణి మాత్రమే మాట్లాడదు. అతడి ఆచరణ అతడి వాణికన్న మరింత స్పష్టంగా, మరింత అర్థవంతంగా మాట్లాడుతుంది. వాణి చెవులవరకే చేరగలుగుతుంది. ఆచరణ ప్రాణాలవరకు చేరుతుంది. ఆచార్యుడు ఆలోచనలను అందించి ఊరుకోడు. వాటితో అనుభవాన్నికూడ అందించి, వాటికి ప్రాణం పోస్తాడు. ఆచార్యుడు ఆలోచనలనే కాక లోతయిన అనుభవాల సారంనుండి లభించిన ఆచరణనుకూడ అందిస్తాడు.

## నవసృష్టి చేసే ఆచార్యుడు

ఆలోచననుండి వ్యవహరణవరకు జరిగే మహా యాత్ర ఎంత కఠినమైనదో, ఎంత దుష్కరమైనదో, ఎంత భీషణమైనదో ఆచార్యునికి సహజంగా అనుభవం అవుతుంది. భావాన్ని ఆచరణలోనికి తేవడమనే పురుషార్థంలో ఎంత శ్రమ ఉన్నదో, ఎంత కష్టం ఉన్నదో, అందుకు ఎంత సమయం పడుతుందో ఆచార్యునికి పూర్తిగా అవగాహన అయి ఉంటుంది. సంకల్పం పలుమారులు ఖండితం అవుతుంది, చెదిరిపోతుంది. వైఫల్యం ఓటమిని అంగీకరించమని ఒత్తిడి చేస్తుంది. 'ఈ మహా పురుషార్థం నీవల్ల సాధించబడదు. నీవు ఇందుకు జన్మించలేదు. వెళ్లు. మరో ప్రత్యామ్నాయం వెదుకుకో. సంకల్పం నీవంటివాడికి కాదు' - వంటి లెక్కలేనన్ని కుతర్కాలను ప్రయోగించి, వైఫల్యం అడుగడుగునా అడ్డుపడుతుంది. సంకల్ప యాత్రను ప్రారంభించగానే, ఆలోచనకూ ఆచరణకూమధ్య సంస్కారం ఆటంకాలు పరచడం మొదలుపెడుతుంది. ప్రవృత్తులు అగ్ని పర్వతాలవలె సెగలు క్రక్కుతాయి. అలవాట్లు పట్టి పీడిస్తాయి. ఫలితంగా - మంచిపని చేయాలనే కోరిక పగటికలగా మిగిలిపోతుంది. అయితే, ఆచార్యుడు ఈ పగటి కలలకు దివ్యత్వాన్ని ప్రదానం చేయడంలో ప్రవీణుడుగా ఉంటాడు. మంచి ఆలోచనను మంచి వ్యవహరణగా మార్చి, ఆచార్యుడు నవ సృష్టి చేస్తాడు.

## వ్యక్తిత్వానికి ఆచార్యుని శస్త్రచికిత్స

ఆచార్యుని జ్ఞానం ఎంతో పారదర్శకంగా ఉంటుంది. ఆయన వ్యక్తిత్వ నిర్మాణపు విధి విధానాలన్నింటిలో నిపుణుడై ఉంటాడు. సంస్కారాలు, అలవాట్లు, ప్రకృత్తులు సృష్టించే బలహీనతలను ఎలా తొలగించవచ్చో, ఎలా నిర్మూలించవచ్చో ఆయనకు క్షుణ్ణంగా తెలిసి ఉంటుంది. వాటి స్థానంలో సదాలోచనలను, సదాచారాలను, సత్ప్రవృత్తులను ఎలా స్థాపించాలో కూడ ఆయనకు ఆమూలాగ్రం తెలిసి ఉంటుంది. ఆచార్యుడు వ్యక్తిత్వ నిర్మాణమనే సూక్ష్మ శస్త్రచికిత్స తెలిసిన సర్జన్ అయిఉంటాడు. ఆయనకు ఆ చికిత్సలోని లోతుపాతుల గురించి సమగ్రమైన, లోతైన అవగాహన ఉంటుంది. సిద్ధాంతాల పరిజ్ఞానంతోపాటు ఆయనకు ఎంతో వ్యవహార జ్ఞానంకూడా ఉంటుంది. సిద్ధాంత జ్ఞానంలో శాస్త్రం ఉంటుంది. పదాలు

**గాలివాటున కొట్టుకుపోయి, వ్యామోహాలలో చిక్కుకోకుండా రక్షించేది కార్యశూరత.**

ఉంటాయి. పదాలద్వారా పదాల అర్థం వ్యక్తం కాజాలదు. శాస్త్రంవల్ల అనుభవం లభించదు. ఆచార్యుని తీవ్ర తపస్సువల్ల పదాలు అర్థవంతం అవుతాయి; శాస్త్రం అనుభవంగా మారి నిగ్గుతేలుతుంది. లోతయిన ఈ అనుభవాన్ని అందించే పని ఆచార్యుని ద్వారానే సాధ్యపడుతుంది.

## చాణక్యుడూ, శ్రీ అరవిందులూ

చాణక్యుడు ఆచార్యుడు. ఆయన చంద్రగుప్తునికి అతడి వ్యక్తిత్వం ఏమిటో బోధపరచాడు. అసంస్కృతమైన అతడి వ్యక్తిత్వాన్ని సుసంస్కృతం చేశాడు. ఆచార్య చాణక్యుడు రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు. చంద్రగుప్తుడిని రాజనీతిలో నిపుణుడిని చేశాడు.

ఆచార్యుడు జీవన రహస్యాన్ని తెలుసుకుని ఉంటాడు. 250 రసాయనాలను కనుగొన్న డా॥ పి.సి.రే నిజమైన ఆచార్యుడు. ఆయన తన విద్యార్థులలో దేశభక్తి భావనను బలీయం చేశాడు. మాతృభూమికోసం బలిదానం చేయడం తమ కర్తవ్యం అనే భావజ్వాలను రగిలించాడు.

ఐ.సి.ఎస్ ఉద్యోగాన్ని కాలదన్నిన శ్రీఅరవిందులు నిజమైన ఆచార్యులు. ఆయన తన విద్యార్థులలో ప్రాణ శక్తిని నింపేవారు. వారి వ్యక్తిత్వాలను మలచేవారు. ఆచార్యుని ప్రభావం ఎలా ఉంటుందో ఆయన ఆచరణలోని ఆకర్షణ చాటి చెప్పేది.

వెలిగే దీపం మాత్రమే ఆరిపోయిన దీపాన్ని కాని, వెలగని దీపాన్నికాని వెలిగించగలుగుతుంది. ఆచార్యుడు వెలుగుతున్న దీపం ఇచ్చే జ్యోతిర్మయ ప్రకాశం. అతడు తన వెలుగుతో వెలుగును కోరేవారికీ, జిజ్ఞాసువులకూ, దారి తప్పినవారికీ ఎందరెందరికో దారి చూపుతాడు. ఆచార్యుని స్నేహమయ స్మర్శవల్ల వ్యక్తులలోపల దాహార్తితో ఉన్న భావనలు తృప్తి చెందుతాయి. దారీ తెన్నూ లేని ఆలోచనలు కొత్త దిశ, కొత్త రూపం సంతరించుకుంటాయి. అసభ్య వ్యవహరణ సౌమ్యమైన సదాచరణగా పరివర్తన చెందుతుంది.

## ఆచార్యునికి పరిమితులు

శీలం, ఆలోచనా సరళి, వ్యవహరణలతో కూడిన వ్యక్తిత్వాన్ని ఆచార్యుడు మలచుతాడు. కానీ, ఆంతరిక చేతనలోని వివిధ పొరలను ఆవిష్కరించే సామర్థ్యం అతడికి ఉండదు. మానవ చేతనలోని రహస్యాలను అతడు కనుగొనలేడు. ఆచార్యుని పరిధికీ, ఉపాధ్యాయుని పరిధికీ ఆవల ఉన్న రంగం ఇది; వారికి అందని రంగం ఇది. గురువు మాత్రమే ఆ పనిని సహజంగా, సులువుగా చేయగలుగుతాడు. మానవ చేతనలోని మర్మాలను లోతుగా తెలుసుకున్న వ్యక్తి గురువు. అతడు చేతనలోని రహస్యాలను విప్పిచెప్పగలుగుతాడు.

## చేతనను సంస్కరిస్తాడు గురువు

చేతనను క్షాళన చేయడం, సంస్కరించడం, వికసింపజేయడం అనే పని వ్యక్తిత్వ వికాసంకన్న ఉన్నతమైనది. మానవ చేతనయొక్క శిఖర యాత్ర మామూలు సంఘటన కాదు. అది అసాధారణమైన సంఘటన. పిండంలో ఇమిడి ఉన్న బ్రహ్మాండ చేతనను అనుభూతి పొందడం, అనుభూతి పొందజేయడం ఉపాధ్యాయునివల్ల, ఆచార్యునివల్ల అయ్యే పనులు కావు. ఆ మహా సంఘటనను గురువు మాత్రమే నిర్దేశించగలుగుతాడు, పర్యవేక్షించగలుగుతాడు. అతడు మానవ చేతన యొక్క సమగ్రతను తెలుసుకుంటాడు, బోధపరుస్తాడు. అతడు అద్వితీయ విషయాలను మాత్రమే బోధించడు. ఆ అద్వితీయ విషయాల అనుభూతిని అనుక్షణం కలిగిస్తూ ఉంటాడు. ఎన్నడూ చెప్పబడనివీ, విననివీ, తెలుసుకోనివీ, అర్థంకానివీ అయిన విషయాలను అతడు కొత్త తరహాలలో వ్యాఖ్యానిస్తాడు, వివేచన చేస్తాడు.

## భగవానుని రూపం గురువు

గురువు దేహాన్ని ధరించిన పరమేశ్వరుడు. భగవానుడు గురువు రూపంలో ప్రత్యక్షం అవుతాడు. గురువువద్ద కూర్చొనడంద్వారా భగవత్ చేతన యొక్క దివ్య స్పర్శ అనుభవం అవుతుంది.

కనుకనే - గురువు హృదయం 'భగవానుని రహదారి

**కార్యాచరణ మార్గంలో లభిస్తుంది పరిణతి.**

బంగళా' అని రామకృష్ణ పరమహంస చెప్పారు. ఆవిధంగా గురువు గరిమను అద్భుతంగా వర్ణించారు.

గురు పదం భగవానుని కన్న గొప్పదని సంత్ కబీరు చెప్పారు. గురుపదాన్ని భగవానుడు స్వయంగా ఇస్తాడు. గురు పదాన్ని పొందడం ఈ మర్త్య ప్రపంచంలో ఒక మహా విప్లవం. ఎందుకంటే - గురువు శిష్యుడిని మూర్ఛ స్థితినుండి మేలుకొలుపుతాడు. అతడికి ఆత్మసాక్షాత్కారం అనే మహత్తర అధికారాన్ని అందిస్తాడు. గురువు శిష్యుడిని చేతన యొక్క శిఖరాగ్రానికి చేర్చుతాడు. ఇచ్ఛలతో, కామనలతో, వాసనలతో అట్టుడికి పోతూన్న ఈ ప్రపంచంలో గురువుయొక్క అవతరణ సుఖదాయకమైన చల్లని నీడ, ఆర్ద్రమైన నీడ. ఆ నీడలో ఎందరికో బోధ లభిస్తుంది; ఆ దివ్య స్పర్శ ఎందరో బుద్ధులను తయారు చేస్తుంది. గురువు నిర్విరామంగా, నిస్వార్థంగా కృపావర్షాన్ని కురిపిస్తూ ఉంటాడు.

## తనలో కలుపుకునేవాడు సద్గురువు

గురువు శిష్యునికి బోధ చేస్తాడు. అతడిని బోధిసత్వుడిని చేస్తాడు. అయితే, సద్గురువు శిష్యుడిని తనలో కలుపుకుంటాడు. శిష్యుని చేతనలో నివసించేవాడు సద్గురువు. తన మహా చేతనలో శిష్యుడిని ముంచెత్తివేసేవాడు సద్గురువు. కనుక, ప్రతి గురువూ సద్గురువు కాడు. సద్గురువుకు బాహ్యమైన పరుగు అవసరం ఉండదు. అతడు లోపల నివసిస్తాడు. అతడు బయట కనపడడు, లోపల వెలుగుతాడు.

## సద్గురువు విరాట్

సద్గురువు స్వరాట్ కాడు విరాట్. సద్గురువు బ్రాహ్మీ చేతనకు పూర్తిగా అభిన్నుడు. కనుక అతడు ఈ జగత్తుకు పరమ కేంద్రంగా ఉంటాడు. ఈ జగత్తు అతడి విస్తరణ, అతడి విరాట్ రూపం. అతడు మహాబీజం (విత్తనం), మహావటం (వటవృక్షం) కూడా, బయటికి ఎన్ని వైవిధ్యాలు కనిపించినా, ఎన్ని రూప భేదాలు కనిపించినా - సద్గురువుయొక్క పరమపావన చేతన అభిన్నమైనది, అభేదమైనది. అతడు బయట ఎక్కడో లేడు. లోలోపలనే విరాజిల్లుతున్నాడు. అతడు దేహాతీతుడు.

కనుక, సద్గురువును మనం మన లోపలే అన్వేషించాలి. సద్గురువు యొక్క మహాచేతన శిష్యుల లోపల నివసిస్తుంది. మనం మన లోపల వెదకడంద్వారానే అతడి దివ్య సాక్షాత్కారాన్ని పొందగలుగుతాము. మన చేతన యొక్క అంతర్ యాత్రలోనే మనం సద్గురువుతో ఏకరూపం కాగలుగుతాము.

## కళ, జ్ఞానం, చేతన, మహాచేతన

ఈ విధంగా - ఉపాధ్యాయుని ద్వారా కళారూపాన్నీ, ఆచార్యుని ద్వారా జ్ఞాన రూపాన్నీ, గురువుద్వారా చేతన రూపాన్నీ, సద్గురువుద్వారా మహాచేతన రూపాన్నీ స్పర్శించి, ఫలితంగా మన జీవితం భౌతికంగా, ఆత్మికంగా సమృద్ధిని సంపాదిస్తుంది.

H H H

## హవల్దారైన పద్మ

భోపాల్ సమీపంలోని ఒక గ్రామంలో ఒక క్షత్రియ కుటుంబం ఉండేది. యువకుడు జోరావర్. సోదరి పేరు పద్మ. తండ్రి లేనందున సోదరుడు అప్పుల పాలైనాడు. పాలకులు అతనిని జైలులో బంధించారు. అప్పు తీర్చాలి, సోదరుణ్ణి విడిపించాలనే లక్ష్యంతో పద్మ గ్వాలియర్ రాజ సైన్యంలో పురుష వేషంలో చేరిపోయింది. ఆమె ప్రతిభ అసాధారణం. త్వరలోనే హవల్దారైనది. వయసు పెరిగినా మీసాలు రాలేదు. సందేహించారు. యువతి అని తెలుసుకున్నారు. విషయం రాజుగారి వద్దకు వెళ్ళింది. ఆయన అన్ని పరిస్థితులూ తెలుసుకున్నాడు. ఖజానా నుండి డబ్బు పంపి భోపాల్‌లో అప్పు తీర్చారు. సోదరుణ్ణి జైలు నుండి విడిపించారు. ఆమె వివాహం ప్రధాన సేనాపతితో జరిపించారు.

- ప్రజ్ఞాపురాణం నుండి

**సమన్వయ పద్ధతిని అనుసరించేవారు సుఖ జీవనానికి అధిపతులు.**

# గురుపూర్ణిమ వ్యాసం - 2

# శాశ్వత గురువును ఆరాధించే పర్వం

## విశ్వగురువు కోసం పిలుపు

ప్రశ్నలే కాని సమాధానాలు లేవు. సమస్యలే కాని పరిష్కారాలు లేవు. గురుబోధ లోపించడంతో - వేర్పాటుతనం, ఉగ్రవాదం, అస్థిరత్వం, అవ్యవస్థ మానవ నాగరికతను భయాందోళనలతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పతనం, వినాశనం తనను మృత్యుపాశంలో బంధిస్తాయని మానవత కలవరపడుతోంది. అన్ని రంగాలలో సంక్షోభకర పరిస్థితులు నెలకొన్నాయి. విజ్ఞానం, అంతర్జాతీయ వ్యవస్థ ఈ వైపరీత్యాలను చక్కదిద్దుతాయని ఆశించబడింది. కానీ, అవి తమ అసమర్థతను ప్రదర్శించుకున్నాయి.

వ్యథతో నిండిన ఈ క్షణాలలో వ్యాకులత చెందిన మానవత హృదయంలో నుండి విశ్వ గురువుకోసం పిలుపు ఎగసిపడింది. "**వందే బోధమయం నిత్యం గురుం శంకర రూపిణమ్**" - అంటూ గోస్వామి తులసీదాసు వర్ణించిన విశ్వగురువుకోసమే ఆ పిలుపు. బోధ స్వరూపుడు, శాశ్వత గురువు, సృష్టికి సూత్ర సంచాలకుడు అయిన మహాకాలునికి వందనం - అన్నది ఆ వర్ణనకు అర్థం. మానవుని అమసర్థతనూ, నిస్సహాయతనూ ఆయనతప్ప మరెవరు తొలగించగలుగుతారు? ఇలాంటి సందర్భాలలో మనిషికి దారి చూపడానికి ఆయనయేకదా '**తదాత్మానం సృజామ్యహమ్**' - (అందుకోసమే అవతరించాను) అని సంకల్పం చేసింది.

## విశ్వగురువుల అవతరణ

మనిషి బుద్ధి దారి తప్పినప్పుడల్లా, భ్రమలలో చిక్కుకున్నప్పుడల్లా - విశ్వగురువు దానికి మార్గదర్శనం చేస్తూ వచ్చాడు. యుగయుగాల నాగరికత చరిత్ర ఇందుకు సాక్ష్యం పలుకుతోంది. విశ్వ గురువుకు కులం, మతం, దేశముల పరిధులు ఆటంకాలు కాలేదు. సృష్టిలోని కణకణం ఆయన ప్రేమమయ బోధనలవల్ల ప్రయోజనం పొందింది. కృష్ణుడు, ఏసుక్రీస్తు, బుద్ధుడు, జొరాస్టర్, మహమ్మద్, మహావీరుడు, వ్యాసుడు, వాల్మీకి వంటి రూపాలలో ఆ శాశ్వత గురువే, మహాకాల భగవానుడే, దారి తప్పిన మానవతకు వెలుగుబాట చూపుతూవచ్చాడు. వీరి వర ప్రసాదాలకు సహజంగా కృతజ్ఞమైన భారతీయ జనమానసం ప్రతి సంవత్సరం గురు పూర్ణిమ రోజున వీరికి భావాంజలి అర్పిస్తుంది.

నామ రూపాలు వేరయినా, దేశ కాల పరిస్థితులకు అనుగుణంగా ఈ విశ్వ గురువుల చేతనయే తగు పరిష్కారాలను అందిస్తూ వచ్చింది.

కౌరవుల ఉగ్రవాదంవల్ల ఆర్తనాదం చేస్తున్న మానవతకు అభయం ఇచ్చినవాడూ, దిక్కుతోచని పాండవులకు గీతోపదేశం చేసినవాడూ అయిన శ్రీకృష్ణుడిని '**కృష్ణం వందే జగద్గురుం**' అంటూ ఆరాధించారు.

దార్శనిక భ్రమల జాలంలో, రకరకాల మూఢ నమ్మకాలలో చిక్కుకున్న మానవతకు వ్యాస మహర్షి మార్గదర్శనం చేశారు. నాలుగు వేదాలు, షడ్దర్శనాలు, 18 పురాణాల విస్తృత సాహిత్యం ద్వారా దిశానిర్దేశం చేసిన ఆ మహర్షిని మానవాళి విశ్వ గురువుగా స్వీకరించింది. ఫలితంగా - గురు పూర్ణిమ వ్యాస పూర్ణిమగా ప్రఖ్యాతి పొందింది.

## విశ్వగురువు ఆచార్యశ్రీ

నేడు మరోమారు మతం మూఢత్వంలో మునిగిపోయింది. చిత్ర విచిత్రములైన నమ్మకాలూ, దురాచారాలూ, దుష్ట సంప్రదాయాల కారు మబ్బులు ఆ సూర్యుడిని కప్పివేశాయి. ఆర్యావర్తంలోని మహర్షులూ, సోక్రటీసువంటి మనీషులూ జీవన పథంగా సృజించిన దర్శనం కొనఊపిరితో ఉంది. మరోమారు విశ్వగురువు సాన్నిధ్యాన్ని పొందాలని మానవత ఆకాంక్షించింది. ఆ ఆకాంక్ష వ్యర్థం కాలేదని దివ్యదృష్టికల వ్యక్తులు చూడగలుగుతారు. '**ఆచార్య శ్రీరామశర్మ**' రూపంలో 'తదాత్మానం సృజామ్యహం' అనే

**బాహ్య, ఆంతరిక లోకాల సమన్వయం యోగ విద్య.**

వాగ్దానం నెరవేరింది.

ప్రశ్నలతో సతమతం అవుతూన్న ప్రపంచానికి ఆయన వ్యక్తిత్వం సమాధానానికి పర్యాయపదమై అవతరించింది. ఋషిత్వం, మనీషి లక్షణం కలగలిసిన విలక్షణ ప్రజ్ఞాపురుషుడు ఆయన. మతంపై క్రమ్ముకున్న కారుమబ్బులను పటాపంచలు చేసే ధైర్యాన్ని, దర్శనాన్ని బుద్ధివాదపు విషవలయంనుండి విముక్తిచేసే సాహసాన్ని ఆయన ప్రదర్శించారు. మతం, దర్శనం, విజ్ఞానములు కలగలిసిన కషాయాన్ని ఆయన తన అంతర్ ప్రజ్ఞ అనే గంగా ప్రవాహంతో మధుర పానీయంగా మార్చారు. అవతార ప్రవాహాలు సదా ఒకే లక్ష్యంతో దిగివచ్చాయి. దర్శనంలో ఆనాడు చొరబడిన భ్రష్టత్వాన్ని తొలగించి, దానిని ఉన్నత స్థాయికి గొనిపోవడమే ఆ లక్ష్యం. శ్రేష్ఠత్వపు ఆధారం సనాతనమైనది. నికృష్టత ఆధారం తాత్కాలికమైనది, అస్థిరమైనది. ఉద్ధరణ పతనాలు ఆ ఊయలమీదనే ఊగుతూ ఉంటాయి. అయితే, పాత సంస్కరణ ప్రక్రియను ప్రతిసారీ మార్చవలసివస్తుంది. ఎందుకంటే - మౌలిక వాస్తవం యథాస్థితిలో ఉన్నప్పటికీ, సమకాలీన పరిస్థితులతో ముడిపడిన వికృతుల స్వరూపం మారుతూ ఉంటుంది.

బుద్ధ భగవానుని కాలంలో యజ్ఞాలలో హింస అనే వామమార్గ అసురత్వం వికటాట్టహాసం చేస్తోంది.

స్వామి దయానందుని కాలంలో అనాచారం వెర్రితలలు వేసింది.

స్వామి వివేకానంద భారతీయ సంస్కృతిపట్ల అవిశ్వాసం తెచ్చిన దుష్పరిణామాలను చూచారు.

గాంధీజీ జనమానసంలో బానిసత్వాన్ని కోరుకునే నిరాశ వేరూనడాన్ని చూచారు.

వీరందరి కృషి మౌలికంగా ఒకే సంస్కరణ ప్రక్రియ యొక్క పునరుద్ధరణయే. అయినా వీరి కార్యక్రమాలు ఒకే విధంగా లేవు. అవి ఒకే మార్గంలో సాగలేదు. ఇందుకు కారణం స్పష్టమే - వికృతులు వివిధ సమయాలలో వివిధ రూపాలు ధరిస్తాయి.

## గురుదేవుల ప్రయోగాలకు ప్రేరణ

మన యుగంలో అనాచారాల రూపాలు గతంలోకన్న భిన్నంగా ఉన్నాయి. దార్శనిక భ్రష్టత్వం నేడు మరో రూపం ధరించింది. కనుక, దాని పరిష్కార ప్రక్రియకూడ భిన్నంగా ఉండాలి. ఆ ప్రక్రియలో సమకాలీన వికృతుల సమీక్ష జరగాలి. వాటి నిర్మూలనకు సమకాలీనమైన మార్గాలను అనుసరించాలి.

సమస్యల ప్రపంచంలో ఆచార్యశ్రీ ఆవిర్భావం ఈ లక్ష్యంతోనే జరిగింది. జన జీవనంలోని ఆర్తినీ, మానసిక క్షోభనూ ఆయన తన గుండె చప్పుళ్లలో అనుభూతి పొందారు. తన నిర్మాణాత్మక ప్రతిభ ఆధారంగా వాటికి పరిష్కారాన్ని అన్వేషించారు. వారి దార్శనిక ఆలోచనల లక్ష్యం బుద్ధివైభవంనుండి జనించిన ఒక అభిప్రాయాన్ని కాని, వాదాన్నికాని ప్రతిపాదించడం కాదు. జీవితమంతా జరిపిన మహత్తర పరిశోధనల, ప్రయోగాల నుండి లభించిన ఫలితాలను వితరణ చేయడమే ఆ లక్ష్యం. దుష్కరములూ, కష్టసాధ్యములూ అయిన ఈ ప్రయోగాలకు ఊతం ఇచ్చే ప్రేరణ గురించి వారిలా వ్రాశారు -

"పీడిత మానవత, విశ్వాత్మ, వ్యక్తి, సమాజం పొందుతూన్న వ్యథ, వేదన నాలో జ్వలించాయి. నన్ను అశాంతికి గురి చేశాయి. కళ్ల మంటతో, కడుపునొప్పితో మెలిదిరిగిపోతున్న వ్యక్తి ఈ బాధనుండి బయటపడడం ఎలా? అందుకు ఏం చేయాలి? ఎక్కడికి వెళ్లాలి? - అని వ్యాకులతతో తిరుగాడుతాడు. తనకు సాధ్యమైన పరిష్కారాన్ని అమలుచేయడానికి క్షణమైనా ఆలస్యం చేయడు. నా మనస్సు సరిగా అలాగే తయారయింది."

అంతరాత్మలోని ఈ అశాంతి ఆయనను పరిష్కారం వెదకడానికి పురికొల్పింది.

## హిమాలయ ఋషిసత్తా మార్గదర్శనం

ఆర్ద్రమైన, అపారమైన ఈ మహాకరుణయే ఆయన తపశ్చర్యకు ఆధారం అయింది. యోగంలోని గహన ప్రక్రియలు, గుహ్య ప్రక్రియలు ఆయన వ్యక్తిత్వాన్ని మహాకాలునికి నివాసంగా రూపొందించాయి. నిత్య గురువు ప్రేరణలు

**యోగవిద్య వేద ఋషులుగా, అవతార మూర్తులుగా భరతభూమిలో చిరకాలంగా దిగివస్తోంది.**

ఆయనను విశ్వ గురువుగా చేశాయి. బుద్ధిపరమైన ఆలోచనలనుండి, తెలివితేటలనుండి ఉత్పన్నంకాని ఆంతరిక సంపదను ఆయనకు ప్రదానం చేశాయి. వేద మంత్రాలవలె - ఆ సంపద అత్యున్నత స్థాయికి చెందిన చేతననుండి అవతరించింది. ఈ సత్యాన్ని పరమపూజ్య గురుదేవులు ఇలా ఉద్ఘాటించారు -

"అఖండజ్యోతి బాహ్యరూపం ముద్రించిన కాగితాల ప్యాకెట్‌లా కనిపించవచ్చు. కానీ, వాస్తవం ఏమంటే - దాని పుటలమీద ఒకరి ప్రాణ చేతన ప్రవహిస్తోంది. పాఠకులను తన కొంగుకు ముడివేస్తుంది. ఎక్కడనుంచి ఎక్కడికో చేర్చుతుంది. విషయం వ్రాతకు పరిమితం కాలేదు. దాని మార్గదర్శనం, దాని అనుగ్రహం, దాని అవతరణ ఏదో ఊర్ధ్వ భూమిక నుండి, ఎగువ అంతస్థునుండి జరుగుతుంది. ఈ మార్గదర్శనాన్ని ఒక్కమాటలో ఇలా చెప్పవచ్చు - హిమాలయంలోని దేవాత్మ క్షేత్రంలో నివసించే ఋషి చేతన చేసే సమన్విత సూత్ర సంచాలన, లేదా దాని ప్రతినిధి సత్తా చేసే సూత్ర సంచాలన.

"ఈ భావాలు చేతనయొక్క అత్యున్నత స్థాయినుండి అవతరించాయి; అంతఃకరణలోని కరుణలో తడిశాయి; బుద్ధిపరమైన తీక్షణతతో మిళితం అయినాయి. వీనిలో ఎంత వెలుగు ఉన్నది, ఎంత కాంతి ఉన్నది అనే విషయం చెప్పేది కాదు, అనుభూతి పొందేది. వీటిని చదివినవారు చలించిపోయారు. జ్వలించే హృదయం కన్నీటి సిరాతో వీటిని వ్రాసింది. కనుక - వీటి ప్రభావం మనిషి అంతఃకరణలోని బోధ బీజాలను అంకురింపచేస్తుంది."

## ఆచార్యశ్రీ క్రాంతిదర్శి

క్రౌంచ పక్షి వధవల్ల వ్యధచెంది, వాల్మీకి రామాయణం వ్రాశారు. జన జీవన గరిమనూ, సాహసాన్నీ, వివేకాన్నీ, మహోజ్జ్వల శీలాన్నీ కలిగిన మహానాయకుని ఆదర్శాన్ని పాఠకుని ముందుంచడంలో అద్భుత సఫలత సాధించారు.

మహాభారత యుద్ధం తర్వాత వికలమై, పీడితమై, దారీ తెన్నూ కోల్పోయిన మానవతకు నవ నిర్మాణానికై సాహసాన్ని ప్రదానంచేసే భావధార వేదవ్యాస మహర్షి యొక్క భావనాభరితమైన అంతర్ చేతననుండే ప్రవహించింది.

ఆచార్యశ్రీ స్వరంలోకూడ సంబోధి, సక్రమ బోధన ఉవ్వెత్తున ప్రవహించింది. తమ స్వరాలలో సామాజిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, రాజకీయాది వివిధ రంగాలలో తలెత్తిన సమస్యలకు సార్థకమైన పరిష్కారాలను ప్రతిపాదించిన ఆచార్యశ్రీ వేదఋషుల యొక్క, ఉపనిషత్తులు శ్రుతులయొక్క ద్రష్టలవలె క్రాంతి దర్శి అయిన మహర్షి. దానితోపాటు వారు ఆది శంకరుల, మధ్వాచార్యుల పరంపరలో యుగానికి అనుగుణమైన భాష్యాలు రచించిన భాష్యకారులుకూడా. గహనమైన ఆయన సాధన ఆధారంగా సత్యగంగోత్రి ఆయనకు నివాసంగా రూపొందింది. ఆయన ఆలోచన లయబద్ధమైన సంగీతం. ఆయన అనుభూతి దానికి ఆధారం. పరమ ప్రజ్ఞను పొందిన సంత్ ఆయన. బోధమయమైన ఆయన స్వరాలలో ప్రాచ్య, పాశ్చాత్య చింతనల గంగా యమునల సంగమం ఉంది; అందులో సరస్వతివంటి మౌలికత గుప్తంగా ఉన్నా వ్యక్తం అవుతుంది.

## మహాయోగి, మనీషి, లోకనాయకుడు

ఏసుక్రీస్తు చెప్పిన స్వర్గ రాజ్యాన్ని ధరిత్రిపై అవతరింపజేయడానికి యోజన చేసిన విలక్షణ దేవమానవుడు ఆచార్యశ్రీ. మేడిపండ్లలా మిగిలిపోయిన సంస్కృతీ సభ్యతలకూ, బాధల బరువుతో క్రుంగి కృశించిపోయిన మానవ జాతికీ త్రాణ ఇవ్వడానికై నవయుగ అవతరణ సందేశాన్ని తెచ్చిన, ఆ అవతరణను యోజన చేసిన యుగ ప్రవర్తకుడు, లోకనాయకుడు ఆయన. తమ అనుభూతిపై ఆధారపడినప్పటికీ, ఆయన చింతనలో ప్రాచ్య పాశ్చాత్యాలు సహజంగా ఇమిడిపోయాయి. వేలాది గ్రంథాలలో, అఖండజ్యోతిలోని లక్షలాది పుటలలో ఉప్పొంగే ఆయన భావ సాగరంలో ఎక్కడా నిషేధ భావన లేదు. ఆచార్యశ్రీ మొదట మహాయోగి. ఆతర్వాత మనీషి, జన నాయకుడు. ఆయన ఆలోచనాయోగంలో ప్రత్యక్ష సత్యాల విశ్లేషణ, సూక్ష్మజగత్తులోనూ, స్థూల జగత్తులోనూ జరిగే భావి సంఘటనల విశ్లేషణ ఉన్నాయి. ఆలోచనల చరిత్రలో విప్లవాన్ని తెచ్చింది ఆయన చింతన. అయినా, ఆ చింతన ఏ

**తాను సాధించిన సంపదలు తన క్రీడారంగమని భావిస్తే - నరజన్మకు పరమావధి ఉంటుంది.**

ఆలోచన స్థానాన్నీ ఆక్రమించదు. ఆ ఆలోచనను ఆదరించి, దానిని పూర్వంకన్న మరింత శ్రేష్ఠంగా మలచుతుంది. అపూర్వ సమన్వయం అనే దీపస్తంభం ఆ చింతన. దానినుండి లక్షలాది ప్రజలు వెలుగును పొందుతున్నారు.

## విశ్వగురుత్వం

శ్రీకృష్ణుని జీవిత కాలంలో ఆయన ఆలోచనలకు పూర్తిగా సమర్పితులైన శిష్యులు ఇద్దరు - మహావీరుడైన అర్జునుడు, మనీషి అయిన ఉద్ధవుడు. అయినా, ఆ ఆలోచనల సార్వభౌమికతా, ప్రపంచవ్యాప్తీ ఎలాంటివంటే - మానవ జాతి అంతా **కృష్ణం వందే జగద్గురుం** అంటూ ఆయనకు నతమస్తకం అయింది. ఏసుక్రీస్తుకుకూడ ఆయన జీవిత కాలంలో 12 గురు శిష్యులే ఉండేవారు. కానీ, నేడు ఆయన భావాలు ప్రపంచమంతటికీ వెలుగు ఇస్తున్నాయి.

ఆచార్యశ్రీ భావాలను మొదట్లో కొద్దిమంది మాత్రమే ఆమోదించారు. నేడు లక్షలాది శిష్యులు ఆయనను పరమపూజ్య గురుదేవులుగా ఆరాధిస్తున్నారు. అయితే - భావిమానవాళి, సమస్త ప్రపంచం **వందే బోధమయం నిత్యం గురుం శంకర రూపిణం** అంటూ ఆయనకు నమస్కరించకుండా ఉండవు.

ఈ సందర్భంగా విక్టర్ హ్యూగో తన నవలలో వ్రాసిన ఈ వాక్యాలు గుర్తు వస్తున్నాయి -

## జ్ఞానవిప్లవపు ఎర్ర కాగడా

"విప్లవ బీజాలు ఒకరిద్దరు మహా మనీషుల మెదడులలో నాటబడతాయి. అక్కడనుంచి అంకురించి, పుష్పించి, ఫలించి వెలికివస్తాయి. అంటువ్యాధిలా ఇతరుల మెదడులలో ప్రవేశిస్తాయి. ఆ క్రమం కొనసాగుతుంది. విప్లవం వరదలా వస్తుంది. నిప్పురవ్వ అగ్నిజ్వాలగా, అగ్నిజ్వాల దావాలనంగా తయారవుతుంది. మంచివాళ్లూ, చెడ్డవాళ్లూ, అన్నిరకాలవాళ్లూ దాని ప్రభావానికి లోనవుతారు. బురదలో సైతం మంటలు లేస్తాయి."

## శాశ్వత గురువు ఆరాధనకు పర్వం

జ్ఞాన విప్లవపు ఎర్ర కాగడా భవిష్యత్తు కూడ ఇదే. దాని వెలుగును తమ హృదయాలలో అనుభూతి పొందే వ్యక్తులు గురుపూర్ణిమను శాశ్వత గురువు ఆరాధన పర్వంగా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలి. ఈ ఆరాధనయే వారి ప్రశ్నలకు సమాధానాలు ఇస్తుంది; సమస్యలు పరిష్కారాలను కనుగొంటాయి.

H H H

## సాహసంతో వితంతు వివాహం

స్త్రీలను స్వావలంబులుగా చేయుటకు, ఉన్నతులుగా చేయుటకు తమ సంపద, సామర్థ్యాలను సదుపయోగం చేసిన వారిలో పురుషులు కొందరున్నారు. అవసరం వచ్చినప్పుడు దురాచారాల నుండి విముక్తి కలిగించేందుకు వారు సాహసం ప్రదర్శించారు.

సేఠ్ దాన్‌మల్ గుజరాత్ ప్రాంతంలో ప్రముఖ వ్యాపారి. ఆయన 22 సం॥ కుమారుడు హఠాత్తుగా చనిపోయాడు. వివాహమై అప్పటికి ఒక్క సంవత్సరమే. తన కోడలు భవిష్య జీవితం ఎలా గడుస్తుందనేదే ఆయన దుఃఖమల్లా. పుత్రశోకానికి సానుభూతి చూపించటానికి బంధువులు, తోటి వ్యాపారులు వచ్చారు. పునర్‌వివాహం విషయం వారితో చర్చిస్తే, అటువంటి సాంప్రదాయం లేనందున వారెవరూ అంగీకరించలేదు. సేఠ్‌జీ తన రెండవ కొడుకును ఇందుకు తయారుచేసి, కోడలి అనుమతి తీసుకొని తన ఇంటిలోనే వివాహం జరిపించాడు. సమాజంలో దీని గురించి చర్చ మొదలైంది. కొందరు మంచిదన్నారు, కొందరు మంచిది కాదన్నారు. అదే సంవత్సరం అనేక వితంతు వివాహాలు జరిగినపుడు సమాజం దాన్ని స్వీకరించినట్లు అర్థమైంది.

- ప్రజ్ఞాపురాణం నుండి

**తాను సాధించిన సంపదలకు బద్ధుడైతే మనిషి బానిస అవుతాడు.**

## ధారావాహిక : గాయత్రీ మహావిజ్ఞానం-2

# పంచముఖముల సంకేతం పంచ కోశములు

పంచముఖముల ద్వితీయ సంకేతం ఆత్మ యొక్క కోశ వివరణ. శరీరం మీద బనియను, చొక్కా, వెయిస్ట్‌కోటు, ఓవర్ కోటు ఒకదానిపై ఒకటి ఎటుల ధరిస్తామో అదేవిధంగా ఆత్మకు పంచావరణము లున్నవి. అవి (1)అన్నమయ కోశము, (2)ప్రాణమయ కోశము, (3)మనోమయ కోశము, (4)విజ్ఞానమయ కోశము, (5) ఆనందమయ కోశము. ఈ అయిదు ప్రాకారములు గల కోటలో జీవుడు బందీగా ఉన్నాడు. ద్వారాలు తెరుచుకుంటే ఆత్మ బంధ విముక్తి చెందుతుంది. ఈ విధంగా గాయత్రి యొక్క పంచముఖములయందు అనేక పంచకముల అద్భుత రహస్యం నిబిడీకృతమై ఉన్నది. వీటి నన్నింటిని గురించి మనము చర్చించబోవుట లేదు. పంచకోశములను గురించి మాత్రమే కొంచెము వివరణ పొందుదాము.

కోశాన్ని ఖజానా అని కూడా పిలుస్తారు. ఆత్మవద్ద ఐదు ఖజానాలు ఉన్నాయి. అందులో ఒక్కొక్కటి బహుమూల్య సంపదతో నిండిఉన్నది. కుబేరుల వద్ద నోట్లకు ఒకటి, వెండికి ఒకటి, బంగారానికి ఒకటి, ఆభరణాలకు ఒకటి, హుండీలకు ఒకటి విడివిడిగా అరలున్నట్లు - ఆత్మవద్ద కూడా ఐదు ప్రత్యేక ఖజానా లున్నాయి. పంచకోశ సాధన వలన సిద్ధి పొందిన తర్వాత అగణిత సంపద, సుఖ సంతోషములు కలుగుతాయి. వాటిని గ్రహించిన తర్వాత జీవితములో స్వర్గీయ ఆనందం కలుగుతుంది. ఈ ఆనందముకొరకే యోగులు తపస్సు చేస్తుంటే, దేవతలు మానవ దేహాన్ని పొందటానికి తహతహలాడుతుంటారు. కోశములను సక్రమంగా ఉపయోగించుకుంటే అనంతమైన ఆనందం లభిస్తుంది. దురుపయోగము వలన వ్యక్తి పంచ ప్రాకారములతో కూడిన చెరసాలలో బందీగా మ్రగ్గుతాడు.

పంచకోశములను ఉపాహారములను మన ఆనందం కొరకు, సుఖ సంవిధానముల కొరకు ప్రభువు ఇచ్చాడు. ఈ ఐదు వాహనములపై మనం కోరినప్పుడు, కోరిన విధంగా సవారీ చేయవచ్చు. ఇవి పంచ ఆయుధములు, వీనిని ఉపయోగించి అనిష్టరూప శత్రువులను సంహరించి ఆత్మ సంరక్షణ చేసుకోవచ్చు. ఈ పంచ అస్త్రములు మనను అసౌఖ్యముల నుండి రక్షించి మన శోభను పెంచుతాయి. ఈ ఐదు శక్తిశాలురైన సేవకులు ప్రతిక్షణం మన ఆజ్ఞలను పాలించడానికే అప్రమత్తంగా ఉంటారు. ఈ ఐదు ఖజానాలలోనూ తరగని సంపద నిండి ఉన్నది. ఈ పంచామృతము నందెంతటి తీయదనమున్నదంటే ఇందలి ఒక్క బిందువు గ్రోలడానికి ముక్తులైన ఆత్మలుసైతం మానవ జన్మను మరొక్కసారి ధరించాలని కోరి ధరిస్తూ ఉంటారు.

చెడిపోయిన అమృతం కూడ విషమవుతుంది. స్వామి భక్తికి పర్యాయపదమైన కుక్క కూడ పిచ్చి ఎత్తితే తన పాలన పోషణల భారం వహించే యజమానిని కూడ కరుస్తుంది. పాసిపోయిన అన్నం మలంతో సమానం. జీవనాధారమైన రక్తము చెడిపోతే, దుఃఖదాయకము అవుతుంది. చింతా శోకములు, దైన్యదారిద్ర్యములు, పీడ, వేదనలు ఇవన్నీ మానవుని పంచకోశములు దురుపయోగం చేయబడుట వలన వికృతి చెందడంతో సంభవిస్తాయి. సౌందర్యానికి, దృష్టికి, జ్యోతికి, కేంద్రములైన నేత్రములలో వికృతి సంభవిస్తే సౌందర్యం మాట అటుంచి, కళ్ళకు గంతలు కట్టుకోవలసి వస్తుంది. మనోహర దృశ్యములను చూడడానికి బదులుగా ఒడ్డున బడిన చేపల వలె గిల గిల కొట్టుకోవలసి వస్తుంది. ఆనందములకు మూలమైన పంచకోశముల వికృతి, జీవితాన్ని దుఃఖభాజనం చేస్తుంది. సదుపయోగం చేత ఈశ్వరుని వరపుత్రుడైన రాజకుమారుని వలె మనిషి నందనవనంలో ఆనందంతో షికార్లు చేయవచ్చు. దుఃఖ దౌర్భాగ్యములకు కారణం పంచకోశముల వికృతి యేగాని మరియొకటి గాదు.

పంచ తత్వములు, పంచ కోశములు, పంచ జ్ఞానేంద్రియములు, పంచ కర్మేంద్రియములు, పంచ ప్రాణములు, పంచ ఉపప్రాణములు, పంచ తన్మాత్రలు, పంచ

**ఆకాశానికీ మనకు సంధానం ఇంటి ద్వారబంధం. పరబ్రహ్మకూ, మనకూ సంధానం సద్గురువు.**

యజ్ఞములు, పంచ దేవతలు, పంచ యోగములు, పంచాగ్నులు, పంచ వర్ణములు, పంచ స్థితులు గాయత్రి పంచముఖములతో సంబంధాన్ని కలిగినవి. వీని సిద్ధిని పొందిన పురుషార్థియైన వ్యక్తి ఋషి అవుతాడు. ఋషి, రాజర్షి, బ్రహ్మర్షి, మహర్షి లేక దేవర్షిగా పిలువబడుతాడు. ఆత్మోన్నతికి 5 తరగతులు కలవు. పంచభూమికలు కలవు. ఏ కక్ష్య యొక్క భూమిక యందు ఉత్తీర్ణుడగునో ఆ శ్రేణియొక్క ఋషి కాగలుగుతాడు. ఒకప్పుడు భారతావని ఋషుల భూమిగా చెప్పబడినది. ఇప్పటికిని ఋషులకు కొదువ లేదు గానీ, వారి శాసనమును తిరస్కరించినందున ప్రపంచమందు చిక్కుకొని ప్రజలు పంచక్లేశముల చేత పీడితు లవుతున్నారు.

## అనంతానంద సాధన

తైత్తిరీయోపనిషత్తు నందలి తృతీయ వల్లియందు (భృగువల్లి) ఒక మహత్తరమైన ఆఖ్యాయిక ఉన్నది. అందు పంచకోశ సాధన రహస్యమయ సాధనగా చెప్పబడినది.

వరుణపుత్రుడైన భృగువు తన తండ్రిని సమీపించి ఇలా ప్రార్థించాడు - "అధీహి భగవో బ్రహ్మేతి!". అనగా - "హే భగవాన్! నాకు బ్రహ్మజ్ఞానమును గురించి ఉపదేశింపుము."

వరుణుడు జవాబిచ్చాడు - "యతోవా ఇమాని భూతాని జాయన్తే, యేన జాతాని జీవన్తి యత్ప్రయంత్యభి సందిశంతి తద్వి జిజ్ఞాసస్వ, తద్బ్ర హ్మేతి". అనగా - "హే భృగు! దేని నుండి సమస్త ప్రాణాలు ఉత్పన్న మవుతున్నవో, ఉత్పన్నమై జీవించుచున్నవో, చివరకు ఎందు విలీనమగుచున్నవో, అట్టి బ్రహ్మమును తెలిసికొను ప్రయత్నం చెయ్యి."

తండ్రి ఆదేశానుసారం కుమారుడు ఆ బ్రహ్మమును తెలుసుకోవడానికి తపస్సు ప్రారంభించాడు. దీర్ఘకాలం తపస్సు చేసిన అనంతరం భృగువు అన్నమయ జగత్తునందు (స్థూల ప్రపంచము) విస్తరించి ఉన్న బ్రహ్మము యొక్క విభూతిని తెలుసుకొని తండ్రివద్దకు వచ్చాడు.

వరుణుడు మరల భృగువుతో అన్నాడు - 'తపో బ్రహ్మ విజ్ఞాన స్వ, తపో బ్రహ్మేతి". అనగా - "హే కుమారా! నీవు తపస్సు చేసి బ్రహ్మమును తెలిసికొనుటకు ప్రయత్నం చేయి. ఎందువలన అంటే బ్రహ్మము తపస్సు ద్వారానే తెలియబడుతుంది."

మరల భృగువు కఠోర తపస్సు చేసి ప్రాణమయ జగత్తు నందలి, తరువాత మనోమయ జగత్తు నందలి బ్రహ్మవిభూతి జ్ఞానమును పొందాడు. తండ్రి మరల అతనిని తపస్సు చేయమని ఆదేశించాడు. అప్పుడు భృగువుకు విజ్ఞానమయ కోశమునందలి ఈశ్వరీయ విభూతి ప్రాప్తించింది. చివరకు ఐదవసారి తండ్రిచేత తపస్సు నందు నియుక్తుడై భృగువు ఆనందమయ విభూతి పొందగలిగాడు.

ఆనందమయ జగత్తు అంతిమ సోపానం మీద అడుగు పెట్టిన తరువాత పూర్ణ బ్రహ్మజ్ఞాన ప్రాప్తి ఏ విధంగా కలుగుతుందో తైత్తిరీయోపనిషత్తులోని తృతీయ వల్లి అయిదవ మంత్రంలో ఈ విధంగా వర్ణించబడినది.

ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్ - ఆనందా ద్ధ్యేవ ఖల్విమాని భూతాని జాయంతే । ఆనందేన జాతాని జీవన్తి । ఆనందం ప్రయంత్యభిసం విశంతీతి । సైషాం భార్గవీం వారుణీ విద్యా । పరమేవ్యోమన్ ప్రతిష్ఠితా ॥

అనగా - భృగువు ఆనందమే బ్రహ్మమని తెలుసుకున్నాడు. ఆనందము చేతనే ప్రాణులన్నియు ఉత్పన్న మగును. ఉత్పన్నమై ఆనందమందు జీవించును. చివరకు ఆనందమందే లీనమగును.

ఉపనిషత్కారుడు ముందు చెప్పబడిన ఆఖ్యాయిక యందు బ్రహ్మానంద, పరమానంద, ఆత్మానందములు మాత్రమే బ్రహ్మజ్ఞానము యొక్క అంతిమ లక్ష్యమని తెలిపినాడు. ఆనందమయ కోశమునందు ప్రవేశించుటకు తపస్సు యొక్క ఆవశ్యకతను వివరించాడు. కోశముల సోపానాలు ఎక్కినకొలదీ బ్రహ్మము లబ్ధి ఎంతగా దగ్గరవుతుందీ తరువాత చెప్పబడింది.

"నయఏవం విత్ అస్మాం లోకాత్ప్రేత్య । ఏతమన్నమయ మాత్మాన ముప సంక్రామ్య, ఏతం ప్రాణమయ మాత్మాన ముపసంక్రామతి ఏతం మనోమయ మాత్మాన,

**తనను తాను సమర్పించుకున్న వ్యక్తికే గురువు సాన్నిధ్యం లభిస్తుంది.**

ముపసంక్రామతి ఏత, విజ్ఞానమయ మాత్మానా ముప సంక్రామతి, ఏతామానందమయ మాత్మానా ముప సంక్రామతి.''

అనగా - ఈ ప్రకారముగా బ్రహ్మజ్ఞాన ప్రాప్తిని పొందిన మనుష్యుడు అన్నమయ కోశమును దాటును. ప్రాణమయ కోశమును దాటును. మనోమయ కోశమును దాటును. విజ్ఞానమయ కోశమును దాటును.

## ఎండమావిగా మారే వస్తుసేకరణ

బ్రహ్మరూపానందము ప్రాప్తమైన పిమ్మట అతడిని అడుగడుగునా అభాగ్యము, దుఃఖము, దారిద్ర్యము, దౌర్భాగ్యముల అనుభవములు బాధించవు. జనులు సుఖముల కొరకు చేసిన వస్తు సంచయము ఆనందమునకు ఉపకరింపక మృగతృష్ణగా మారుతుంది.

భౌతిక వస్తు సంచయము నందలి సుఖమునకు అనేక వేల రెట్లు ఆత్మిక ఉన్నతి యందున్నది. ఆరోగ్యవంతమైన పంచకోశములతో కూడిన సంపన్న ఆత్మ తన వాస్తవిక స్వరూపమును పొంది, అనిర్వచనీయమైన ఆనందమును పొందగలుగుతుంది. అప్పుడు విషయముల కొరకు ప్రాకులాడక ఎన్నో రెట్లు సుఖము నిచ్చు ఆత్మానందము కొరకు త్యాగము, తపస్సు చేయడానికి సంకోచమేల? విజ్ఞపురుషులు అది చేస్తున్నారు కదా! మీమాంసతో ఏ మనుష్యుడు పూర్తి ఆరోగ్యవంతుడు, ఈ విశ్వమందలి సమస్త ధనసంపత్తికి స్వామి యైనాడో, అతడు పొందు ఆనందము మానుషీ ఆనందముగా చెప్పబడినది. దానికి కోట్లాది రెట్లు ఆనందము బ్రహ్మానందముగా తెలుపబడినది. బ్రహ్మానంద వర్ణన శతపథ బ్రాహ్మణమందలి 15-17-31లోనూ బృహదారణ్యకోపనిషత్తులోని 4-3-32 లోను చేయబడినది.

పంచముఖీ గాయత్రి సాధన పంచకోశ సాధన. ఒక్కొక్క కోశమునకు ఒక్కొక్క బ్రహ్మ విభూతి కలదు. సాధకుడు అట్టి బ్రహ్మ విభూతుల మెట్లను ఒక్కొక్కటిగా ఎక్కిపోతూ సుఖ సాధన చేయుచూ ముమ్ముందుకు పోవుటకు ఉత్సాహాన్ని పొందుతాడు.

## గాయత్రీ సాధనద్వారా సుఖశాంతులు

జీవితమనబడే బహుమూల్య సంపద, క్రిమి కీటకముల వలె వ్యర్థం చేయదగినది కాదు. ఎనుబది నాలుగు లక్షల యందు తిరిగి తిరిగి ఎంతో శ్రమ అనంతరం మానవ జన్మ పొంది, దానిని తుచ్ఛ స్వార్థ ప్రయోజనముల కొరకు వినియోగించుటకంటే నిస్వార్థమునకు, పరమార్థము కొరకు వినియోగించాలని కోరుకోవాలి. గాయత్రీ సాధన అట్టి పరమార్థ సాధన. అది మన వ్యక్తిగత జీవనమును సుఖశాంతులతో నింపుతుంది.

మున్ముందు వేదమాత, జగజ్జనని, ఆదిశక్తి యైన గాయత్రి పంచముఖములు, వాని ఉపాసనా విధానం, ఆత్మ యొక్క పంచకోశముల సాధన విధానము తేటతెల్లం చేయబడుతుంది. భృగువుతో సమానంగా తపశ్చర్య చేసినవారికి బ్రహ్మప్రాప్తి యందు అధికారం కలుగుతుంది.

ఈ సాధన సులభమైనప్పటికి మనుష్యుడు కేవలం పొట్టకూటి కొరకు, నికృష్ట భోగముల కొరకు కాలమును వెచ్చించుటే గాక, ఇంకను నీచస్థితికి దిగజారి మోసం, కపటం, దొంగతనం, హత్య ఇత్యాది ఘోర కృత్యములకు తలపడి శాశ్వత నరకవాసి కావడానికి ఆతురత పడుట నిజంగా విచారింపతగిన విషయం. మనము సత్కర్మచే స్వాధ్యాయం, సాత్విక సాధనతో ఉపాసన చేయుచూ, దైవీమార్గమున పయనించుచూ జీవితమును ఉత్కృష్టముగా మలచుకొనుట లక్ష్యముగా ఈశ్వరుడు మనలకు ఈ కర్మభూమిని ప్రాప్తింపజేసినాడు. దైవీమార్గము నెన్నుకొని జీవితమును శుద్ధ పవిత్ర పరోపకారమయముగా జేసికొననిచో, గాయత్రీ ఉపాసన, సేవామయ జీవనముల ద్వారా నిరంతరం సోపానముల నెక్కుచూ ఉచ్చతమ శిఖరము వరకు పోజాలును. ఇందులకు ముఖ్యమైన ఆవశ్యక విషయములు (1) శ్రద్ధ, (2) దృఢమైన ఆత్మ విశ్వాసం. వీనిని మనుజుడు అభ్యాసము వలన పొందగల్గును.

H H H

**అంతర్యామి ధ్యానం, నిరంతర సత్కర్మాచరణం మానసిక శారీరిక క్రమశిక్షణలు.**

## ధారావాహిక : దివ్యజీవన దర్శనం - 19


# సిద్ధిమార్గంలో పయనించే సంకల్పం - 2

### సాధనా సహచరి ఆగమనం

సెప్టెంబరు 1927కు శ్రీరామ్‌కు 16 సంవత్సరాలు పూర్తయినాయి. ననిహాల్ బంధువర్గం బలసేనీ (అలీగఢ్)లో పండిత రూపరాజ్ శర్మ కుమార్తె సంబంధం తెచ్చింది. ఆమె పేరు సరస్వతీ దేవి. పెళ్లికూతురును చూడడానికి తాఈజీ తన సోదరునితోపాటు వెంటనే బయలుదేరారు. బలసేలీ చేరుకుని సరస్వతీ దేవిని చూడగానే ఆమె ఇలా అడిగారు -

"అమ్మాయీ! గోమాతకు సేవ చేయగలవా?"

పెళ్లికూతురు సమాధానం చెప్పలేదు. సిగ్గు బిడియాలతో ఆమె తల వంచింది. రూపరాజ్‌జీ ఇలా సమాధానం ఇచ్చారు -



"మంచి ప్రశ్న అడిగారు అక్కయ్యగారూ. సరస్వతికి గోసేవతప్ప మరేదీ రుచించదు."

ఇంటిని చక్కదిద్దుకోవడం, స్వభావం మున్నగువాటి గురించి తాఈజీ పెద్దగా మాట్లాడలేదు. ఆడపిల్లలను ఏ వాతావరణంలో అయినా మలచవచ్చుననీ, స్వభావరీత్యా వాళ్లు చెడ్డవాళ్లుగా ఉండరనీ, వారిలో దోషాలూ, దుర్గుణాలూ, వికారాలూ ఉండవనీ, అత్తవారింటిలోని వ్యక్తులే పరాయివాళ్లుగా చూచి వారిని చెడగొడతారనీ ఆమె నమ్మకం.

ఆ తర్వాత పండిత రూపరామ్, ఆయన బంధువులు ఇద్దరు ముగ్గురూ ఆవల్‌ఖేడా వచ్చారు. వారు శ్రీరామ్‌ను చూచారు. పిత్రార్జితం అయిన సంపద పుష్కలంగా ఉంది. సంపాదించవలసిన అవసరం లేదు. పూజా పురస్కారాల పట్ల శ్రీరామ్ అభిరుచి, నిష్ఠ వారికి బాగా నచ్చాయి. శ్రీరామ్ పూజ గదిలోని ఆలయ వాతావరణం రూపరామ్‌జీకి బాగా నచ్చింది. ఆయన ఇలా అన్నారు -

"మా పిల్లకుకూడా పూజా పురస్కారాలంటే మక్కువ ఎక్కువ. ఆమె ప్రతిరోజూ శివ - పార్వతులను ఆరాధన చేస్తుంది. అయిదేళ్ల వయస్సులోనే ఆ ఆరాధన ప్రారంభించింది."

ఈ మాట అని పండిత రూపరాజ్ ఆగారు. శ్రీరామ్, ఆయన బాలసేన సభ్యులూ స్వరాజ్య ఉద్యమ కార్యక్రమాలలో పాల్గొనడం ఆయనకు నచ్చలేదు. అందుకు ఆయన ఇలా అభ్యంతరం చెప్పారు-

"కాంగ్రెసువారితో కలసి ఉండడం, ఉద్యమాన్ని నిర్వహించడం కొంచం ప్రమాదకరమైన పనే. రేపు ఏదయినా జరగవచ్చు. మా పిల్ల ఏమవుతుంది?"

ఈ అభ్యంతరాన్ని త్రోసిపుచ్చుతూ తాఈజీ ఇలా అన్నారు -

"ఎవరికయినా ఎప్పుడయినా ఏదైనా జరగవచ్చు. ఆ పరిస్థితిలో ఏం చేస్తాం? స్వరాజ్య ఉద్యమంలో మాలవ్యాజీ మహారాజ్, గాంధీజీవంటి పెద్దలు పాల్గొంటున్నారు. ఆగ్రా - మథురలలో పెద్ద పెద్ద మోతుబరులుసైతం ఉద్యమంలో చేరారు. నిజానికి ఇది గర్వించదగ్గ విషయం".

తాఈజీ ఇలా చెప్పడంతో, రూపరామ్‌జీ సంతృప్తి చెందారు.

ఆ వెంటనే తాంబూలాలు పుచ్చుకున్నారు. వివాహ ముహూర్తం నిర్ణయించారు. కార్తీక పూర్ణిమ రోజున 12 మంది ఆవల్‌ఖేడానుండి పెళ్లికి తరలివెళ్లారు. అక్కడ నిరాడంబరంగా వివాహ సంస్కారం జరిగింది. బ్రాహ్మ వివాహంగా శాస్త్రాలు వర్ణించిన పద్ధతిలో జరిగింది. కట్నంగా రెండు ఆవులు, వధూవరులకు రెండేసి జతల బట్టలు పెట్టారు. మగపెళ్లివారికి సకల మర్యాదలూ జరిగాయి. అయితే, ఆడంబరాలూ, అట్టహాసాలూ లేవు. పెద్ద విందుకూడ జరగలేదు. ఆ గ్రామంలో

**డబ్బు, వస్తు వాహనాలు, విశ్రాంతి పరికరాలు సాధించే యత్నంలో విశ్రాంతిని కోల్పోయే కాలమే కలియుగం.**

తమ బంధు మిత్రుల కుటుంబాలు 20 - 25 ఉన్నాయి. ఆ కుటుంబాలను మాత్రమే విందు భోజనానికి పిలిచారు. రూపరామ్‌జీ ఆర్థిక పరిస్థితి చాలా బాగుంది. పెక్కు గ్రామాలకు ఒకేసారి భోజనం పెట్టే స్థోమత ఆయనకు ఉంది. ఆడంబరంగా పెళ్లి చేయడానికి ఆయన సిద్ధమే. అయితే - ఆ శుభ సమయంలో దుబారా ఖర్చు ఏమాత్రం జరగకూడదనీ, వివాహం నిరాడంబరంగా జరగాలనీ వివాహం నిర్ణయమైన సమయంలో తాఈజీ స్పష్టంగా చెప్పారు.

## ధర్మపత్నికి హెచ్చరిక

ఆవల్‌ఖేడాకు తిరిగివచ్చిన వెంటనే శ్రీరామ్ దినచర్య యథాప్రకారం సాగింది. వివాహ సంస్కారం, ఇతర వేడుకలు పూర్తి కావడానికి నాలుగు రోజులు పట్టింది. ఈ నాలుగు రోజులలో నిర్ణీతమైన జపం పూర్తికాలేదు. రోజూ 3 - 3 1/2 గంటలపాటు మాత్రమే ఆయన జపం చేయగలిగారు. ఇందువల్ల మిగిలిపోయిన జపాన్ని పూర్తి చేయడానికై - శ్రీరామ్ మూడు రోజులపాటు మరోపని ఏదీ చేయలేదు. కేవలం జపం చేస్తూ కూర్చున్నారు. స్నానాదులకు తప్ప మరే పని కోసమూ పూజగదినుంచి బయటకు రాలేదు. నాల్గవ రోజున జపం పూర్తి కావడంతో, ఆయన నిశ్చింతగా కూర్చున్నారు.

భార్య వచ్చి పాదాలు తాకి ప్రణామం చేసింది. శ్రీరామ్ తన ధర్మపత్నివైపు చూచారు. కోడలుగా ఇంటికి వచ్చిన మొదటి రోజునుండి సరస్వతీ దేవి ఆయనకు ప్రణామం చేస్తూ వచ్చింది. పాదాలను తాకలేకపోయింది. ఎందుకంటే - గత మూడు రోజులుగా శ్రీరామ్ స్నానం, పూజ పూర్తయిన వెంటనే బయటకు వచ్చి భోజనం చేసి వెనువెంటనే పూజ గదిలోకి వెళ్లేవారు. నవ వధువు ఆయనను దూరంనుండే చూచేది. ప్రణామం చేసేది. నాల్గవరోజున ఆమెకు చరణ స్పర్శకు అవకాశం దొరికింది.

తాఈజీ ఇంటిలోపల మరో గదిలో ఉంది. శ్రీరామ్ తన ధర్మపత్నిని కూర్చోమన్నారు. ఆమె క్రింద నేలమీద కూర్చున్నది. "నేలమీద కూర్చోకండి" - అంటూ శ్రీరామ్ లేచి, ప్రక్కనే ఉన్న మరో ఆసనం పరచారు. "ఆసనంమీద కూర్చోండి" - అన్నారు. ఆమె సంకోచిస్తూ ఆసనంమీద కూర్చున్నది. "ఇక్కడ అంతా బాగున్నదా? ఇబ్బంది ఏదీ లేదుకదా" - వంటి ప్రశ్నలు అడిగిన తర్వాత శ్రీరామ్ ఆమెతో ఇలా చెప్పారు -

"నీవు పెళ్లి చేసుకుని ఇక్కడికి వచ్చావు. మనం దంపతులు కావాలని విధి లిఖించింది. అలా జరిగింది. కానీ, నీవు ముందు ముందు చాలా కష్టాలు సహించవలసిరావచ్చు. భగవంతుడు మాకు ఎలాంటి పని బాధ్యత అప్పగించాడంటే - మేము కుటుంబ విషయాలను సరిగా చూడలేకపోవచ్చు. నీపట్ల శ్రద్ధ వహించడంలోకూడ లోపం జరగవచ్చు. ఆ పరిస్థితికి నీ మనస్సును సిద్ధం చేసుకో."

సరస్వతి ఇలా అన్నది -

"ఈ విషయాలన్నీ పెళ్లికి ముందే నిర్ణయించుకోవాలి. ఇప్పుడేమిటి?"

ఈ మాటలలో ఎత్తిపొడుపు ఉన్నట్లు అనిపించింది. కానీ, విషయం అది కాదు. ఆమె ఇలా వివరించింది -

"మా తండ్రిగారు నన్ను మీకు అప్పగించడం భగవానుని ఇచ్ఛయే. మీతోపాటు ధర్మాన్ని పాటించవలసిందని శివుడు ఆదేశించాడు. ముందు ముందు ఏ కష్ట సుఖాలు వస్తాయో మనకు తెలియదు. మనం మన ధర్మాన్ని పాటించడం - ఇదే అన్నింటినీ మించిన ఆనందం.

"మీ ధర్మం ఏమిటి?"

- అని శ్రీరామ్ అడిగారు.

ఆమెనుండి జవాబు ఇలా వచ్చింది -

"భార్యగా మీ చరణ సేవ. మీరు తపస్వులు. భగవానునికి ప్రీతిపాత్రులు. మీ రూపంలో నాకు మా ఆరాధ్యుడే (శివుడు) లభించడం నా అదృష్టం."

భార్య మనసు తెలియడంతో, ఆమె వాగ్దానం పొందడంతో - శ్రీరామ్ మనస్సునుంచి ఒక బరువు తొలగిపోయింది. అక్కడి వాతావరణానికి అలవాటుపడడం, తనవంటి భర్తను నిభాయించడం తన భార్యకు చాలా ఇబ్బంది అవుతుందని శ్రీరామ్ భావించారు. అలాంటిదేమీ కాదు కనుక ఆయన మనసు తేలికపడింది.

**తీరిక లేని క్షణాలే త్రివిక్రముని స్మరణకు ఉత్తమ క్షణాలు.**

తాతాజీ రావడం చూచి నవవధువు తన ఆసనం నుండి లేచి నిలబడింది. లోపలికి వెళ్లి తన పని చూచుకోసాగింది. తాతాజీ ఇలా అన్నారు -

"కోడలిని తీసుకువెళ్లడానికి ఆమె పుట్టింటివారు వస్తున్నారు. పుట్టింటికి వెళ్లి కొంత సమయం గడపడం పద్ధతి."

శ్రీరామ్ అందుకు జవాబు ఇవ్వలేదు. మౌనంగా లేచి, బయటికి బయలుదేరారు.

అలా శ్రీరామ్ తన బాలసేన సభ్యులను వెదకసాగారు. కొద్దిరోజుల సంపర్కం లేకపోవడంవల్ల వారంతా చెదిరిపోయారు. వారు కొత్త కార్యక్రమాన్ని దేనినీ ప్రారంభించలేదు. అంతకుముందు అచ్చయిన పోస్టర్లనే పరిసర గ్రామాలలో అంటిస్తున్నారు. ఒకరు మరొకరిని పిలిచే క్రమంలో నాటి సాయంత్రానికి సభ్యులందరికీ సమాచారం అందింది.

## ప్రతిరోగీ సేవకు అర్హుడే

సమాచారం అందుకుని, మరునాడు సభ్యులందరూ సమావేశమైనారు. ఈ మధ్య ఎక్కడ ఏ సంఘటన జరిగిందో సమాచారం కలబోసుకున్నారు. ఈ ఎనిమిది రోజులలో పెద్ద విశేషమేదీ జరగలేదు. శ్రీరామ్‌కు అకస్మాత్తుగా గుర్తువచ్చింది - హుబ్బా చాచా పరిస్థితి ఎలా ఉందో అని. ఆయన జబ్బుగా ఉన్నారని ఇంతకుముందు తెలిసింది. హుబ్బా చాచా అంటే పట్‌వారీ (కరణం) హుబ్బాలాల్. గ్రామ ప్రజలు ఆయనను పట్‌వారీజీ అని పిలిచేవారు. ఆరోజుల్లో ఆ పదవికి మంచి పలుకుబడి ఉండేది. తండ్రి తన కుమారుణ్ణి పట్‌వారీని చేసి తాను పదవీ విరమణ చేసేవాడు. హుబ్బలాల్ కూడ వంశపారంపర్యంగానే పట్‌వారీ అయ్యారు. కానీ, ఆయన తర్వాత ఆ పదవిని నిర్వహించడానికి వారసుడు లేకపోయాడు.

హుబ్బాలాల్ తన పదవీ కాలంలో గ్రామ ప్రజలను నానా యాతనలకు గురిచేశాడు. ధన దాహం, పీడించే లక్షణం అనే అవగుణాలు అతడి నరనరంలో జీర్ణించిపోయాయి. తనకు వారసుడెవడూ లేడు. అయినా, అతడు ధనాశతో గ్రామంలోని రైతులందరికీ సుఖ శాంతులు లేకుండా చేశాడు. చీటికీ మాటికీ ప్రజలకు నోటీసులు పంపేవాడు. అనవసరంగా భూమికి కొలతలు తీసుకుని వారిని బెదిరించేవాడు. తాను కోరినది ఇవ్వకపోతే పై అధికారికి తప్పుడు రిపోర్టు పంపి, పోలీసులను పిలిపించేవాడు. ఇలాంటివన్నీ అతడికి కొట్టిన పిండి. అతడి దౌర్జన్యాలకు గురి అయి, కొందరు రైతులు తమ ఆస్తులకు నీళ్లు వదులుకున్నారు. అతడి దురాగతాలవల్ల వీధిన పడిన సంపన్నులూ ఉన్నారు.

కనుక - హుబ్బలాల్ జబ్బుపడ్డాడని తెలిసి జనం "భగవంతుడు ఇతడి కర్మలకు తగిన శిక్ష వేశాడు" - అన్నారు. అతడికి పక్షవాతం వచ్చింది. అతడు జబ్బుపడ్డ విషయం కొద్ది రోజులవరకు జనానికి తెలియలేదు. తెలిసిన తర్వాత కర్మ ఫలం అనుభవిస్తున్నాడంటూ జనం దులిపివేసుకున్నారు.

గ్రామంలో ఎవరైనా దుఃఖంలో ఉంటే, ఎవరైనా జబ్బుపడితే, వారిని చూచుకునేవాళ్లు ఎవరూ లేకపోతే - అలాంటి నిస్సహాయుల గురించి శ్రద్ధ తీసుకోవడం గ్రామ ప్రజల బాధ్యత. కుటుంబంలో ఒకడు ఎంతగా చెడిపోయినా, అతడు జబ్బుపడితే కుటుంబం అతడిని ఆదుకుంటుంది.

ఇదీ సేనా నాయకుడు శ్రీరామ్ నిశ్చితాభిప్రాయం. ఈ విషయాన్ని గ్రామ ప్రజలకు నచ్చజెప్పడానికి వెళ్లలేదు ఆయన. తన స్వచ్ఛందసేవకులకే ఆయన ఈ విషయం నచ్చజెప్పారు.

ఆ రోజున స్వచ్ఛంద సేవకుల సమావేశం జరిగింది. శ్రీరామ్ ఇలా అన్నారు - "ముందు అతడిని చూచివద్దాం. మిగతా విషయాలు తర్వాత చూద్దాం."

అందరూ హుబ్బలాల్ ఇంటికి వెళ్లి చూచారు. హుబ్బలాల్ తన మంచం మీద పడి ఉన్నాడు. తన యోగ క్షేమాలు అడగడానికి ఎవరైనా వస్తారేమోనని ఎంతో ఆశగా గుమ్మంవైపు చూస్తున్నాడు. తన గత కర్మలు గుర్తుకు రాగానే, ఎవరినుండయినా ఏదైనా ఆశించాలనే ఆలోచన వెంటనే గాలిలో కలిసిపోతోంది. అయినా ఆశ చావడం లేదు. తలుపు తెరిచే ఉంది కదా; నన్ను చూడడానికి ఎవరో ఒకరు రాకపోతారా - అనే ఆశ ఎందువల్లనోకాని మనస్సును పీకుతోంది. శ్రీరామ్‌కు, ఆయన సహచరులకూ తలుపు తట్టవలసిన అవసరం రాలేదు. ఎవరికోసమో ఎదురుచూస్తున్నట్లు హుబ్బలాల్ మంచంమీద

**నీ హృదయంలోనే ఉండే ఆ స్వామికి నీకేది అవసరమో తెలియదా?**

పడుకుని ఉన్నాడు. వీరిని చూడగానే అతడి కళ్లలోకి మెరుపు వచ్చింది. ఆ మెరుపు కొద్దిసేపే నిలచింది. అతడి కళ్లు కన్నీళ్లతో నిండాయి. అతడిలా చెప్పసాగాడు - " పిల్లలూ! నా పాపాలకు శిక్ష లభిస్తోంది. నేను ఎందరెందరి కొంపలు కూల్చానో.''

శ్రీరామ్ ఇలా అన్నారు - "గాబరాపడకండి లాలాజీ! అంతా చక్కబడుతుంది.'' లాలాజీకి నచ్చజెప్పి, ఆయన వెంటనే అతడికి వైద్యం చేయించే పనిలోకి దిగారు. ఇంటిని చక్కదిద్దేవారు ఎవరూ లేకపోవడంతో, పరిస్థితి దారుణంగా ఉంది. లాలాజీ శరీరం కుళ్లిపోయి ఉంది. ఈగలు ముసురుతున్నాయి. పక్షవాతంవల్ల అతడు చెయ్యి ఎత్తలేకపోతున్నాడు. కనుక, అతడు వాటిని తోలలేకపోతున్నాడు. సహచరులు ముక్కు మూసుకుంటున్నారు. శ్రీరామ్ వారితో ఇలా అన్నారు - "మనస్సును కాస్త గట్టి చేసుకోండి. ఒక చేతితో పని ఎలా జరుగుతుంది.''

పిల్లలు ఒక చేద వెదికారు. ఇంటి బయటికి వెళ్లి బావినుండి నీళ్లు తోడి తెచ్చారు. పట్‌వారీకి స్నానం చేయించారు. అతడి బట్టలూ, పక్కబట్టలూ, గదీ శుభ్రం చేశారు. ఆగ్రా నుండి కొందరు వ్యక్తులు పేదల కోసం, వికలాంగుల కోసం దుప్పట్లూ, బట్టలూ పంపారు. శ్రీరామ్ ఆ సామాను తెచ్చిన బృందంవద్దకు వెళ్లారు. హుబ్బాలాల్ కోసం బట్టలు తెచ్చారు. పట్‌వారీజీకి సేవ కొనసాగింది. అతడు జీవించి ఉన్నంతకాలం ఇలా సేవ సాగింది. అతడి పరిస్థితి క్షీణించిన తర్వాత సేవాదళ్ సభ్యులలో ఎవరో ఒకరు అక్కడ ఉండేవారు.

హుబ్బలాల్ ఎక్కువ రోజులు బ్రతకలేదు. జీవించి ఉన్నన్ని రోజులూ పిల్లల సేవా శుశ్రూషలవల్ల అతడు సంస్కారం పొందుతూ వచ్చాడు. స్వార్థంకోసం తెలిసి ఎవరికీ ఎన్నడూ హాని కలిగించకూడదనీ, సాధ్యమైనంతవరకు ఇతరులకు సేవ చేయాలనీ గుణపాఠం నేర్చుకున్నాడు. చనిపోయేముందు - పశ్చాత్తాపంలో, గ్లానిలో మునిగి ఉన్న హుబ్బలాల్ శ్రీరామ్‌ను తనవద్దకు పిలిచాడు. గద్గద స్వరంతో ఇలా అన్నాడు - "మరో జన్మ లభిస్తే, అది పశుజన్మ అయినా సరే, ఇతరులకు సేవ చేస్తాను. భగవంతుడు నన్ను గాడిదగా పుట్టించినా''

శ్రీరామ్ అతడికి ఇలా చెప్పారు -

"దీవాన్‌జీ! వద్దు. ఆ మాట అనవద్దు. మీరు మనిషిగానే పుడతారు. ఆ జన్మలోని మీ పొరపాట్లు అన్నింటినీ సరిదిద్దుకుంటారు. భగవంతుడి పనే చేస్తారు.''

హుబ్బలాల్ కళ్లు కన్నీళ్లతో నిండాయి. గొంతు జీరబోయింది. ఆగి ఆగి ఇలా అన్నాడు -

"ఆశీస్సు ఇచ్చేటంత పుణ్యం నేను చేయలేదు. తెలియక పొరపాటున ఏదైనా పుణ్య చేసి ఉంటే, అది నీకు చెందాలి. నీ కీర్తిని అజరామరం చేయవలసిందిగా నేను భగవంతుణ్ణి కోరుకుంటున్నాను''.

ఆ తర్వాత అతడి గొంతు పూడిపోయింది.

లోకమాన్య తిలక్ ఇచ్చిన స్వరాజ్య సందేశం గ్రామ గ్రామంలో మారుమ్రోగసాగింది. 10-15 మంది ఉత్సాహవంతులు కలసినప్పుడల్లా స్వరాజ్యం గురించే చర్చ సాగేది. ఆవల్‌ఖేడాలో యువక బృందం ఇంతకుముందే క్రియాశీలంగా ఉంది. జాతీయ ఉద్యమం ఉధృతం అవుతూన్న వార్తలూ, ఆంగ్ల పాలకులు ఆ ఉద్యమాన్ని అణచివేస్తూన్న వార్తలూ ఆ గ్రామానికి చేరాయి. ఉద్యమకారుల ఉత్సాహం ప్రజలను అంతగా కదిలించలేదు. ఆంగ్ల పాలకుల దమన కాండ వార్తలు వారి ఉత్సాహాన్ని నీరుగార్చుతున్నాయి. వారిని భయభ్రాంతులను చేస్తున్నాయి. కొన్ని కుటుంబాల పిల్లలు ఉద్యమంలో అడపాతడపా పాల్గొంటున్నారు. ఆ కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి.

ఒక రోజున గ్రామంలోని పెద్దలు సమావేశమయ్యారు. సమాలోచనలు జరిపారు. తమ పిల్లలు తమకు తాముగా ఏమీ చేయడం లేదనీ, శ్రీరామ్ చెప్పడంవల్ల, ఆయన పర్యవేక్షణలో ఊరేగింపులలో, ధర్నాలలో పాల్గొంటున్నారనీ, కరపత్రాలు పంచుతున్నారనీ, పోస్టర్లు అతికిస్తున్నారనీ వారు నిర్ణయానికి వచ్చారు. శ్రీరామ్ కార్యకలాపాలను అదుపు చేస్తే, మిగిలిన పిల్లలు చెల్లాచెదురు అయిపోతారని వారు అభిప్రాయపడ్డారు. ఇలా ఏకాభిప్రాయానికి వచ్చిన తర్వాత, నలుగురైదుగురు పెద్దలు తాఈజీవద్దకు వెళ్లారు. కుశల ప్రశ్నల తర్వాత వారు విషయాన్ని ఇలా వివరించారు -

"తాఈజీ! ఆంగ్లేయుల గుర్రాలు కదను

**పొగిడేవాళ్లు నీ మంచిని పంచుకుంటారు. దూషించేవాళ్లు నీ పాపాలను పంచుకుంటారు.**

త్రొక్కుతున్నాయి. స్వరాజ్యవాదులను చూడగానే పట్టుకుంటున్నారు. ఖైదులో త్రుక్కుతున్నారు. ఇలా పట్టుబడిన వ్యక్తుల జాడ తెలియడం లేదని పెక్కు గ్రామాలనుండి వార్తలు వస్తున్నాయి.''

భయావహమైన ఈ చిత్రణ తాఈజీని భయపెట్టడానికి చేయబడ్డది కాదు. వారు పూర్తి నిజాయితీతో ఇలా చెప్పుకువచ్చారు-

"మీరు శ్రీరామ్‌ను కాస్త అజమాయిషీలో ఉంచితే, మా పిల్లలు మాకు దక్కుతారు. లేకపోతే - ఆంగ్లేయులు మన గ్రామంమీద ఎప్పుడు విరుచుకుపడతారో చెప్పలేము.''

తాఈజీ కలత చెందారు. శ్రీరామ్ కార్యకలాపాలపై ఓ కన్ను వేసి ఉంచుతానని వారికి మాట ఇచ్చారు. వచ్చిన పెద్దలుకూడ కొంత ఊరట పొంది వెళ్లిపోయారు.

ఆతర్వాత శ్రీరామ్ ఇంటినుంచి ఎప్పుడు బయటకు బయలుదేరినా, ''ఎక్కడికి వెళుతున్నావు? ఎప్పుడు తిరిగివస్తావు?'' - అని తాఈజీ అడిగేవారు. చెప్పిన సమయానికి తిరిగిరాకపోతే ఆమె ప్రశ్నించేవారు. స్పష్టీకరణ అడిగేవారు. ఇకముందు ఇలా ఆలస్యం జరుగకూడదు - అని హెచ్చరించేవారు. తాఈజీ నిఘా పెరిగినందువల్ల శ్రీరామ్‌కు ఎలాంటి ఇబ్బందీ కలుగలేదు. ఎందుకంటే - ఆయన చెప్పే సమాధానం ఆమెను తృప్తిపరచేది. ప్రదర్శనలో పాల్గొనడానికి వెళ్లానని ఆయన చెప్పినా, తాఈజీ గద్దించేవారు కారు. సేవా కార్యంలో పాల్గొనడానికి వెళ్లానని ఆయన చెప్పినా, ఆమె ఏమీ అనేవారు కారు. అతడి సమాధానమే ఆమెకు సంతృప్తి కలిగించేది.

ఆగ్రా కాంగ్రెసు కార్యాలయానికి వెళ్లి కొద్ది రోజులలో తిరిగివస్తానని ఒకసారి శ్రీరామ్ తల్లిగారిని అడిగారు. ఆమె వద్దన్నారు. తల్లిగారిమాట దాటడం ఎలా అని శ్రీరామ్ ఆలోచించారు. చేయాలా వద్దా - అనే ప్రశ్న ఎదురయింది. అంతరాత్మ సమాధానం సూచించింది - తల్లిగారు మమకారంవల్ల వద్దన్నప్పటికీ, దేశసేవనుండి తప్పుకోకూడదని; ఈ ఆంక్షను ఖాతరు చేయకపోవడం క్షమించదగినదేనని. ఆతర్వాత ఆయన తగు సమయం కోసం వేచి ఉన్నారు. ఆయన ఒక రోజున రాత్రి రెండు గంటలకు లేచారు. చెంబులో నీళ్లు నింపుకొన్నారు. బయటికి వెళ్లాలి - అని భవంతి ద్వారంవద్ద ఉన్న కాపలాదారుతో చెప్పారు. భవంతినుండి ఆరుబయటకు వెళ్లాలని ఆయనకు అనిపించి ఉంటుందని అతడు అనుకున్నాడు, ఇలా ఆలోచించి తలుపు తెరిచాడు. బయటకు రాగానే శ్రీరామ్ చెంబును వదలివేశారు. ఆగ్రాకు బయలుదేరారు.

ఆయన ఆ రాత్రి అంతా నడుస్తూనే ఉన్నారు. సరాసరి వెళ్లకుండా అక్కడక్కడ దాగికొని ఆగ్రా చేరారు. వాకబు చేశారు. కాంగ్రెసు కార్యాలయంలో స్వచ్ఛందసేవకులను నమోదు చేసుకుంటున్నారనీ, అక్కడ ఉద్యమ నిర్వహణలో శిక్షణ ఇస్తారనీ, ఆ శిబిరం వెంటనే ప్రారంభం అవుతుందనీ ఆయనకు తెలిసింది.

శ్రీరామ్ ఆ శిబిరంలో చేరారు. ఆయనతోపాటు శిబిరంలో పాల్గొన్నవారిలో జగన్ ప్రసాద్, గంగా సింహ్, దద్దూ, ఊధమ్ సింహ్‌లు ఉన్నారు. వీరంతా ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించారు. పండిత నత్థీలాల్ శర్మ, రామనారాయణ్ శివహరే, వాసుదేవ గుప్తలుకూడ ఈ శిబిరంలో ఉన్నారు.

ఈ శిబిరంలో అనుభవజ్ఞులైన ఉద్యమకారులు యువకులకు జనసంపర్క పద్ధతులు నేర్పారు. కరపత్రాలూ, పోస్టర్లూ తయారు చేయడం, సభలు నిర్వహించడం, ఉద్యమ స్ఫూర్తిని నిలిపి ఉంచడం - ఇవి ఈ శిబిరంలో నేర్పిన విషయాలు. ఈ వారంరోజులూ ఈ శిబిరంలో శ్రీరామ్ ఈ విషయాలన్నింటినీ క్షుణ్ణంగా నేర్చుకున్నారు.

ఈలోగా - తాను క్షేమంగా ఉన్నట్లు, శిక్షణ పొందిన వెంటనే తిరిగివస్తున్నట్లు శ్రీరామ్ ఆవల్‌ఖేడాలోని తన తల్లిగారికి కబురు పంపించారు. శిబిరంలో చేరిన వెంటనే శిబిర వ్యవస్థను పర్యవేక్షిస్తున్న ఒక వరిష్ఠ కార్యకర్తకు చెప్పి ఆయన ఈ కబురు పంపే ఏర్పాటు చేయించారు.

అక్కడ తాఈజీ ఆహార పానీయాలు వదిలి కూర్చున్నారు. ఈ కబురు అందడంతో ఆమెకు నిశ్చింత కలిగింది.

H H H

**ఈ యుగపు మహాశక్తి ఆయుధం కాదు - సదాలోచన.**

# విశ్వవ్యాప్తంగా యోగశిక్షణ శిబిరాలు

### శోధ సంస్థాన్ రజత జయంతి సంవత్సరం

బ్రహ్మవర్చస్ శోధ సంస్థాన్ రజత జయంతి సందర్భంగా మరికొన్ని కార్యక్రమాలు రూపొందుతున్నాయి.

కొన్ని మహానగరాలలో యోగ ప్రధానములు, మేధావుల గోష్ఠి ప్రధానములు అయిన కార్యక్రమాలను చేపట్టే అవకాశం ఉంది. మహానగరాలలో ప్రతిభావంతులు ఎందరో ఉన్నారు. వీరిని సేవా సాధనలో ప్రవేశపెట్టగలిగితే యుగ నిర్మాణం వేగవంతం అవుతుంది.

సమాజంలో శ్రీమంతుల - ధనాఢ్యుల వర్గం ఉన్నది. వీరివద్ద ఇవ్వడానికి ఎంతో ఉంది. కానీ, సరైన సమాచారం అందకపోవడంవల్ల వీరు తమ దానాన్ని సద్వినియోగం చేయలేకపోతున్నారు. వీరికోసం ప్రత్యేక గోష్ఠులు ఏర్పాటుచేసే ఆలోచన ఉంది. తద్వారా వీరు మిషన్ నిర్వహిస్తున్న వివిధ పథకాలను గురించి తెలుసుకుని, ఈ మహాయజ్ఞంలో తమ ఆహుతులను సమర్పించగలుగుతారు.

బ్రహ్మవర్చస్ శోధ సంస్థాన్ పరిశోధనాలయానికి కొత్త ఉపకరణాలను సమకూర్చుతున్నారు. పరిశోధన సౌకర్యాలనూ, గ్రంథాలయం నాణ్యతను కూడ పెంచుతున్నారు.

### శక్తిపీఠాల రజత జయంతి

పూజ్యవరులు 25 సంవత్సరాలక్రితం శక్తిపీఠాలను స్థాపించారు. వీటి శతజయంతి కూడ జరగవలసి ఉంది. పూజ్యవరులు ఒకటిన్నర - రెండు సంవత్సరాల పాటు ఈ శక్తిపీఠాలలో ప్రాణ ప్రతిష్ఠకు వెళుతూ వచ్చారు. జన జాగరణ కేంద్రాలుగా, తీర్థాలకు అభినవ రూపాలుగా వీటిని నిర్మాణం చేశారు. ఈ పీఠాలు దీపస్తంభాలవలె యుగ చేతనను ఇంటింటికీ అందించాలని వారు ఉద్దేశించారు. పెక్కు పీఠాలు ఈ దిశలో పనిచేస్తున్నాయి. కొన్ని పీఠాలు పూజ - అర్చన - హారతులకు పరిమితం అవుతున్నారు.

నేడు కలకత్తా, సిమ్లా, జయపూర్, సిలీగుడీ, భోపాల్, నాగపూర్, అంబాజీలలో జోనల్ కార్యశాలలు జరిగిన తర్వాత చక్కని వాతావరణం ఏర్పడింది. ఈ రజత జయంతి సంవత్సరంలో శక్తిపీఠాలన్నీ సువ్యవస్థితం అవుతున్నాయి. బలీయమూ, ప్రాణవంతమూ, వికేంద్రితమూ అయిన కేంద్రాలుగా రూపొందుతున్నాయి. ఉద్యమాలు నిర్వహించే సామర్థ్యాన్ని పెంచుకుంటున్నాయి.

ఆర్థికంగా, కార్యప్రణాళిక పరంగా, ఆలోచనలను కలబోసుకోవడంలో ప్రతి శక్తిపీఠమూ పారదర్శకంగా పనిచేయడంపై ఇప్పుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోబడుతోంది. జిల్లా సమన్వయ సమితులూ, ఆ జిల్లా శక్తి పీఠాలూ కలసి నిర్ణయాలు తీసుకోవాలి. శక్తిపీఠాలు దేవసంస్కృతి విశ్వవిద్యాలయం శాఖలుగా పనిచేయడం ప్రారంభించాలి. 2006 డిసెంబరు నాటికి ఈ పని పూర్తి కావాలి. అప్పటినుండి దేశంలోని ప్రజ్ఞాసంస్థాన్‌లు, గాయత్రీ చేతనా కేంద్రాలు, విదేశాలలో పనిచేస్తున్న కేంద్రాలు సూత్రబద్ధంగా పని చేయాలి. అన్ని కేంద్రాలలో కంప్యూటర్లు ఉండాలి. అన్నింటినీ ఒకే నెట్‌వర్క్‌గా రూపొందించాలనే ఆలోచన ఉంది. శక్తిపీఠాలన్నీ తమ వార్షికోత్సవాలు జరుపుకుంటున్నాయి. ఈ ఉత్సవాలు ఒకే పద్ధతిలో జరిగేలా కేంద్రం ప్రయత్నిస్తుంది.

### దేశవిదేశాలలో సమగ్రయోగ విస్తరణ

దేవసంస్కృతి విశ్వవిద్యాలయంలో పలువురు యువతీ యువకులు యోగంలో శిక్షణ పొంది ఉన్నారు. వీరి ద్వారా దేశ విదేశాలలోని వివిధ స్థలాలలో పది రోజుల యోగ శిబిరాలను ఈ సంవత్సరం నుండి నిర్వహిస్తారు. ఈ యోగ శిబిరాలు చికిత్స ప్రధానములుగా ఉంటాయి. వీనిలో ప్రజలకూ, రోగులకూ శిక్షణ, చికిత్స అందిస్తారు. ఈ శిబిరాలద్వారా దేశమంతా యోగమయం అవుతుంది. ఈ శిబిరాలు లాభం, నష్టం రాని పద్ధతిలో నిర్వహించబడతాయి. సామాన్య ప్రజలకు వీటి ప్రయోజనం అందాలన్నదే దీని ఉద్దేశ్యం.

ఈ సంవత్సరం నలుగురు విద్యార్థులు రష్యా పంపబడుతున్నారు. వారు సంవత్సరంపాటు ఆ దేశంలో ఉండి, యోగ చికిత్సా శిబిరాలు నిర్వహిస్తారు. **రానున్న రోజులలో యోగం సమగ్ర చికిత్సా విధానం కాబోతున్నది.** ఈ లక్ష్యంతోనే ఈ సంవత్సరం అమెరికా, కెనడా, బ్రిటన్, దక్షిణాఫ్రికాలలో కూడ యోగ శిబిరాలు ఏర్పాటు అవుతాయి. క్రమంగా ఈ దేశాలకుకూడ సంవత్సరంపాటు శిబిరాలు నడవడానికి బృందాలు

**నాగరికత పెరుగుతోంది. కాని, మనిషి సంస్కారం పశు స్థితిలోనే ఉంది.**

తయారవుతాయి.

దేవసంస్కృతి విశ్వవిద్యాలయం విద్యార్థినీ విద్యార్థులద్వారా దేశ విదేశాలలోని యువతరాన్ని క్రియాశీలం చేయబోతున్నాం. ఇద్దరు విద్యార్థులతో కూడిన బృందాలు వివిధ స్థలాలకు పంపబడుతున్నాయి. ఆయా స్థలాలలో వీరికి మహత్తర సాఫల్యాలు లభిస్తున్నాయి. ఇంటర్న్‌షిప్ విధానం ఘన విజయాలు సాధించింది. వచ్చే మూడు సంవత్సరాలలో దేశంలోని యువతరంలో ఒక పెద్ద భాగం దేవసంస్కృతి విశ్వవిద్యాలయం నుండి వచ్చే సంస్కార సంపన్నులైన యువ విద్యార్థులనే పరుసవేదిని త్రాగి బంగారంలా విలువైనది అవుతుందని అనిపిస్తోంది.

మహానగరాలలో 'ఫిట్‌నెస్' పట్ల మెలకువ పెరుగుతోంది. యోగ శిబిరాలద్వారా ఈ మెలకువకు నిర్మాణాత్మకమైన రూపం ఇవ్వగలుగుతాము. **శరీరం, మనస్సు, ఆత్మలకు సంపూర్ణ చికిత్స యోగ చికిత్స.** అందరూ ఈ వాస్తవాన్ని గుర్తించాలి. ధ్యానంచేసే విధానాన్ని కూడ హృదయంగమం చేసుకోవాలి. యమ - నియమాల ప్రాథమిక సూత్రాలను ఆచరణలో పెట్టాలి. అప్పుడే సరైన యోగం అందుతుంది. యువతరం యోగం నేర్చుకుంటే, ఆరోగ్యవంతులుగా, శక్తివంతులుగా రూపొందితే - 2020 నాటికి భారత్ శక్తిశాలి అయిన జాతిగా తయారవుతుంది. **వ్యసనముక్తులు, వీర్యవంతులు, ఓజస్వులు అయిన మన యువతరం రానున్న 15 సంవత్సరాలలో భారత్‌ను జగద్గురువుగా ప్రతిష్ఠించాలన్నది మా స్వప్నం.** స్వామి వివేకానందుని ఉపదేశం అప్పుడే సార్థకం అవుతుంది.

## అనువాద ప్రచురణ ఫౌండేషన్

పరమపూజ్య గురుదేవులు రచించిన 3200 గ్రంథాలలో ఎంపిక చేసిన 1000 గ్రంథాలను దేశంలోని, ప్రపంచంలోని అన్ని భాషలలో ప్రచురించడం మరో బాధ్యత, ఇందుకోసం ఒక ఫౌండేషన్ స్థాపించబడుతోంది. ఇంగ్లీషు, ఫ్రెంచి, రష్యన్, జర్మన్, జపాను, చైనా, స్పానిష్, పోర్చుగీసు, ఇటాలియన్, థాయ్ భాషలలో పూజ్యవరుల చింతన వ్యాప్తి కావాలి. 8 భారతీయ భాషలలో యుగ సాహిత్యం ప్రస్తుతం లభిస్తోంది. మొత్తం 30 భాషలలో ఇకముందు లభించాలి. ఇందుకోసమై విరాట్ అనువాద వ్యవస్థ, ప్రచురణ వ్యవస్థ నిర్మాణం కావాలి.

ఇప్పుడు అస్సామీ భాషలో కూడ 'అఖండ జ్యోతి' ప్రచురణ ప్రారంభమయింది. మలయాళ, కన్నడ భాషలలో ప్రచురణకు యోజన ప్రాథమిక దశలో ఉంది. అలాగే దేవనాగరిలిపిలో ఇతర భాషలలోకూడ ప్రచురించే యోజన ఉంది.

మథురలోని గాయత్రీ తపోభూమి, అఖండ జ్యోతి సంస్థాన్ ఈ ప్రచురణ భారాన్ని స్వీకరించాయి. పైన ప్రస్తావించిన ఫౌండేషన్ క్రియాశీలం అయితే, 2011 నాటికి మనం ప్రపంచంలోని ఒక పెద్ద వర్గానికి శ్రేష్ఠమైన ఆలోచనలను అందించగలుగుతాము. ఈ బృహత్తర పథకానికి శ్రీమంతుల అంశదానం అవసరం అవుతుంది.

## పరిశోధన పత్రాల ప్రచురణ

బ్రహ్మవర్చస్ పరిశోధనలు ఆధారంగా, 50 మందికిపైగా దేవసంస్కృతి విశ్వవిద్యాలయం విద్యార్థులు జరుపుతూన్న నూతన పరిశోధనలు ఆధారంగా భారత్‌లో, ప్రపంచంలో ఉన్న వివిధ పత్రికలలో పరిశోధన వ్యాసాలను ప్రచురించే పని ఇక జరగాలి. ఇందుకు ప్రాతిపదిక తయారయింది. ఈ సంవత్సరం పెక్కు పత్రికలలో ఈ వ్యాసాలు ప్రచురితం కానున్నాయి.

దేవసంస్కృతి విశ్వవిద్యాలయ వైదిక విజ్ఞాన విభాగం తయారుచేసిన వ్యాసం "కాంప్లిమెంటరీ అండ్ ఆల్టర్నేటివ్ మెడిసిన్" అనే పత్రికలో ఇటీవల ప్రచురించబడింది. డా॥ ప్రణవ్ పండ్యా, మీనాక్షీ రఘువంశీ, డా॥ రజనీ జోషీల పేర్లతో ప్రచురితమైన ఆ వ్యాసంలో మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ టిబి (అల్లోపతీ మందులకు లొంగని క్షయవ్యాధి)కి చికిత్స, అనంతర చర్యలు వివరించబడ్డాయి. ఆ పత్రిక ప్రచురణకర్తలు దానిని ఏకగ్రీవంగా ఆమోదించారు. యజ్ఞోపతీ 21 శతాబ్దపు చికిత్సా విధానమని వారు ప్రకటించారు.

## జోన్‌ల పునర్వ్యవస్థ

ఈ సంవత్సరం పది ప్రముఖ జోనల్ కార్యాలయాలు, 40కి పైగా సబ్‌జోనల్ కార్యాలయాల పునర్ వ్యవస్థ జరిగింది. ఇది వికేంద్రీకరణ ప్రక్రియ, ఇందువల్ల సంస్థ సువ్యవస్థితం అవుతుంది. పని అంతా క్రమద్దంగా జరుగుతుంది. 2004 జనవరిలో ప్రారంభమైన ఈ యోజన ఫలితంగా క్రియాశీలత పెల్లుబికింది. జోనల్ కేంద్రాలు బాగా క్రియాశీలం అయినాయి. కార్యశాలలద్వారా అందరికీ విస్తృతంగా సమాచారం అందింది. ఇకముందు జరుగనున్న కార్యశాలల ద్వారా, సమయదానులైన కార్యకర్తలు సబ్‌జోనల్ స్థాయిలో నిర్వహించే శిక్షణ కార్యక్రమాలద్వారా అందరికీ సంస్థ విధానాలూ, కార్యక్రమాలూ స్పష్టంగా అవగాహన అవుతాయి.

H H H

**విద్యరహితమైన శక్తి వ్యక్తిని దుర్మార్గుణ్ణి చేస్తుంది.**

### విశ్వవిద్యాలయ విశేషాలు

# తపోమయ జీవనానికి ఆహ్వానం

విశ్వవిద్యాలయ ప్రాంగణంనుండి మహాకాల భగవానుడు భావనాశీలురైన యువ ప్రతిభావంతులను ఆహ్వానించాడు. తమ ప్రతిభలను భావనల గంగాజలంతో క్షాళన చేసుకున్న వ్యక్తులకే ఈ ఆహ్వానం. ఎందుకంటే - వీరే భవిష్యత్తులో ఈ విరాట్ యుగ - నిర్మాణ మిషన్, దేవసంస్కృతి విశ్వవిద్యాలయ మహోద్యమాన్ని శిఖరాగ్రాలకు కొనిపోతారు.

ఈ విశ్వవిద్యాలయం జాతి నిర్మాణానికీ, మానవ కళ్యాణానికీ సమర్పితమైన సమర్థవంతమైన సంస్థ. దీనిని మరింత సమర్థంగా తీర్చిదిద్దవలసి ఉంది. కనుక - ఇక్కడ శిక్షణ పొందేవారు పాఠ్యక్రమంతోపాటు వ్యక్తిత్వ సంస్కరణ, మానవ కళ్యాణం, జాతి నిర్మాణముల కోసం నిర్వహించబడుతూన్న అనేక యోజనల అమలుకు అంకితం కావాలి. ఇందులో ఎవరికీ ఎలాంటి మినహాయింపూ ఉండదు.

విశ్వవిద్యాలయంలో చేరడంతోనే ప్రారంభం అవుతుంది తీర్థసేవనం, తప - అనుష్ఠానాల ప్రక్రియ. ఇక్కడ తపస్సు అంటే జప, ఉపవాసాలు కాదు - సూత్రబద్ధమూ, కఠోరమూ అయిన దినచర్య. అందరూ దీన్ని పాటించాలి, ప్రతిభతోపాటు సంవేదన కలిగిఉన్నవారే ఈ పని చేయగలుగుతారు. తమ వ్యక్తిత్వాన్ని ఉదాత్త లక్ష్యాలకు అనుగుణంగా మలచుకోవాలనే ప్రగాఢమైన తపన, జాతికోసం ఎంతో కొంత చేసిచూపాలనే ప్రగాఢమైన అంకితభావం కలిగిన వ్యక్తులకు ఈ ప్రాంగణంలోని దివ్య వాతావరణం స్వర్గంకన్న అందంగా, ఉత్సాహజనకంగా భాసిస్తుంది.

ఇక్కడ చదివే విద్యార్థులు ప్రతిభాసంపన్నులుగానేకాక, సమర్పితులూ సంకల్పనిష్ఠులూ అయిన సాధకులుగా కూడ ఉండాలని ఆశించబడుతోంది. వారు ఆ ఆశను తీర్చవలసి ఉంటుంది. ఈ విశ్వవిద్యాలయ విద్యార్థులు సృజన కోసం సదా తత్పరులైన సమర్థ సైనికులుగా ఉండాలి. వీరు ఈ విధంగా మలచబడతారు, చెక్కబడతారు, సానపెట్టబడతారు. ఇక్కడి అధికారులూ, ఉద్యోగులూ, ఆచార్యగణం విద్యార్థు లందరినీ తమ స్వంత పిల్లలుగా, సోదరీ సోదరులుగా అభిమానిస్తారు. శాంతికుంజ్ సంచాలిక శైల దీదీనుండి వీరందరికీ మాతృ వాత్సల్యం పుష్కలంగా అందుతుంది.

అయితే - 'ఒక కంటిలో ప్రేమ, మరో కంటిలో సంస్కరణ' అనే యుగ ఋషియొక్క సూత్ర - సత్యంకూడ సదా స్మరించబడుతుంది. విద్యార్థుల వ్యక్తిత్వాలను మలచడంలో, సానపట్టడంలో ఎలాంటి లోటూ రానివ్వరు.

ఈ ప్రత్యేక లక్ష్యంతోనే జీవించే కళ (ఆర్ట్ ఆఫ్ లివింగ్) పై ప్రత్యేకమైన క్లాసులు నిర్వహిస్తున్నారు. విశ్వవిద్యాలయ కులాధిపతి స్వయంగా ఆ క్లాసులను సంచాలన చేస్తున్నారు. ఈ క్రమంలో వారు వారానికి రెండు మారులు ధ్యానం, భగవద్గీత క్లాసులు తీసుకుంటారు. విద్యార్థులేకాక ఆచార్యులూ, అధికారులూ, ఉద్యోగుల బృందమూ తప్పనిసరిగా ఈ క్లాసులకు హాజరవుతారు.

విశ్వవిద్యాలయ పాఠ్యక్రమ లక్ష్యం ఒకే ఒకటి - జాతి నిర్మాణానికీ, మానవ కళ్యాణానికీ, వ్యక్తిత్వ సంస్కరణకూ ప్రతి విద్యార్థినీ అర్హుణ్ణి చేయడం. అందరూ తపశ్చర్యతో కూడిన దినచర్యలో, అధ్యయనంలో ఈ సమయాన్ని గడపవలసి ఉంటుంది. తపః స్వాధ్యాయ నిరతః - అనే సూత్రాన్ని విద్యార్థులు సదా గుర్తుంచుకోవాలి. ఇక్కడి అధ్యయనానికి ఇది తప్పనిసరి.

తపోమయ జీవనం, సాదా అయిన జీవనసరళి, సాదా భోజనం, అయినా కఠోర పరిశ్రమ, ఉదాత్త లక్ష్యాలకోసం సంకల్పితమూ, సమర్పితమూ అయిన జీవనం - ఇవన్నీ ఇక్కడి విద్యార్థులకు అనివార్యములు.

అలాంటి సాహసికులకు పిలుపు ఇవ్వబడుతోంది. ఈ పిలుపు స్వయంగా మహాకాల భగవానునిది. ఎందుకంటే - ఆయనయే విశ్వవిద్యాలయానికి నిజమైన సూత్ర సంచాలకులు. మిగతావారంతా ఆయన సహచరులు మాత్రమే.

H H H

**సాధించిన సంపదల సద్వినియోగం ఒక కళ.**

# వార్తలు

## విశాఖలో కోటి గాయత్రి జపం, 24 కుండముల యజ్ఞం

విశాఖపట్టణం దసపల్లా హోటల్ మేనేజర్ శ్రీరాధాకృష్ణ సతీమణి శ్రీమతి రాణి, పాండురంగస్వామి ఆలయ ఆవరణలో శ్రీ అంకారావు సహకారంతో మే 1 నుండి 10 వరకు కోటి గాయత్రి జపం చేశారు. పూర్ణాహుతిగా 24 కుండముల గాయత్రీ యజ్ఞం నిర్వహించారు.

10 సాయంత్రం 108 మంది మహిళలతో భవ్యంగా కలశయాత్ర జరిగింది. దేవతల దీవెనలు చిరుజల్లులుగా కురిశాయి.

11 ఉదయం శ్రీ అంకారావు, శ్రీమతి వసంతకుమారి, శ్రీమతి రూపవాణి యజ్ఞాన్ని నిర్వహించారు. శ్రీదేవరాంజీ పటేల్, డాక్టర్ చంద్రశేఖరం దంపతులు ఆశీస్సులు ఇచ్చారు. భీమిలి, తగరపువలసల నుండి వచ్చిన పరిజనులు కూడా యజ్ఞంలో పాల్గొన్నారు. మహారాణిపేట ప్రజ్ఞామండలి సహకరించింది.

ఏప్రిల్ 9న విశాఖ ఉక్కునగరం సెక్టారు - 6 శివాలయం ఆవరణలో నవకుండీయ గాయత్రీ యజ్ఞాన్ని శ్రీరాజేష్ ప్రతాప్ సింహ్, శ్రీమతి ఏ.సావిత్రి నిర్వహించారు. 17న జోనల్ ఆఫీసు మేడమీద వసంత నవరాత్రుల అనుష్ఠానానికి పూర్ణాహుతిగా నవకుండీయ గాయత్రీ యజ్ఞాన్ని శ్రీయుతులు రాజేష్ ప్రతాప్ సింహ్, దేవరాంజీ పటేల్, శ్రీమతి ఏ.సావిత్రి నిర్వహించారు. 18న విశాఖ ఉక్కునగరం సెక్టార్ - 5లో గల కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్ ఆవరణలో హిందూమత సంరక్షణ సమితి సౌజన్యంతో శ్రీ దేవరాంజీ పటేల్, శ్రీమతులు ఏ.సావిత్రి, దుర్గా సావిత్రి నవకుండీయ గాయత్రీ యజ్ఞం నిర్వహించారు.

మే 1న విశాఖలోని న్యూవెంకోజీపాలెంలో శ్రీ అవతారం రాజు, శ్రీమతి లక్ష్మి, శ్రీఝా దంపతుల సహకారంతో 300 దీపాలతో దీపయజ్ఞాన్ని శ్రీమతులు ఏ.సావిత్రి, వసంత కుమారి, జయలక్ష్మి నిర్వహించారు. శ్రీ దేవరాంజీ పటేల్ ప్రవచనాన్ని శ్రీమతి సావిత్రి అనువదించారు.

ప్రజ్ఞామండలి నిర్వహించిన ఇతర కార్యక్రమాలు -

ఏప్రిల్ 20న సీతంపేటలో శ్రీమతులు గంగాభవాని, సునీతల గృహంలో గాయత్రీ యజ్ఞం. ఏప్రిల్ 24న రైల్వేన్యూకాలనీలో శ్రీమతి పరదేశమ్మ సేవా సమాజం రజతోత్సవ సందర్భంగా శ్రీ సీతారామాలయ ఆవరణలో త్రికుండీయ గాయత్రీ యజ్ఞం. ఏప్రిల్ 24 సాయంత్రం కిర్లంపూడి లేఅవుట్‌లో శ్రీ చంద్రశేఖర్ జైన్ గృహంలో సత్సంగ గోష్ఠి, దీపయజ్ఞం. శ్రీ దేవరాంజీ పటేల్ ప్రసంగం. ఏప్రిల్ 25న గోపాలపట్నం చంద్రనగర్‌లో శ్రీ ఏ.వి.ఎస్.నారాయణ గృహంలో యజ్ఞం. 27న అక్కయ్య పాలెంలో శ్రీమతి సాయిలక్ష్మి జన్మదిన సందర్భంగా దీపయజ్ఞం. 28న గోపాల పట్టణం చంద్రనగర్‌లో శ్రీ హరినాథ్ గృహంలో యజ్ఞం. 29న గోపాలపట్టణం చంద్రనగర్‌లో శ్రీరాపేటి రామారావు గృహంలో యజ్ఞం.

మే 12న పెదవాల్తేరు జాలారిపేటలో శ్రీ రాజగోపాలరావు గృహంలో శిరీష జన్మదిన సందర్భంగా దీపయజ్ఞం. 15న శ్రీవి.కె.మహేశ్వరి గృహంలో దీపయజ్ఞం. 27న లాసన్‌బే కాలనీలో శ్రీలక్ష్మణరావు గృహంలో యజ్ఞం. పాండురంగపురంలో శ్రీమతి ప్రవీణ, శ్రీ ధరణీధర్‌ల గృహంలో యజ్ఞం. 29న సన్నీషేడ్ అపార్ట్‌మెంట్‌లో డా॥వెంకటేశ్వర రెడ్డి, డా॥నిర్మలల గృహంలో యజ్ఞం. 30న అక్కయపాలెంలో వేగి సత్యనారాయణ, విమలకుమారి దంపతుల నూతన గృహప్రవేశ సందర్భంగా యజ్ఞం. 200మందికి యుగసాహిత్య వితరణ.

### పామాపురంలో 24కుండీయ గాయత్రీ మహాయజ్ఞం

మహబూబ్‌నగర్ జిల్లా కొత్తకోట మండలం పామాపురంలో ఏప్రిల్ 17న 24కుండీయ గాయత్రీ మహాయజ్ఞం వైభవంగా జరిగింది. 16సాయంత్రం జరిగిన భవ్య కలశయాత్రలో వందల సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. 17 ఉదయం యజ్ఞం, సాయంత్రం 2400 దీపాలతో దీపయజ్ఞం జరిగాయి. శ్రీమతి అనసూయమ్మ, శ్రీయుతులు హనుమంత రెడ్డి, సత్యనారాయణ యజ్ఞాన్ని నిర్వహించారు. శ్రీయుతులు మహేశ్ రెడ్డి (సర్పంచ్), నారాయణ రెడ్డి, నరసింహ యాదవ్, బి.వేమసుదర్శన్ రెడ్డి సహకరించారు.

**గాయత్రీ ఉపాసనలో పొరపాటు జరిగినా ప్రమాదం కలుగదు.**

## చీరాలలో గాయత్రీ పరివార్ ట్రస్టు కార్యాలయ ప్రారంభం

చీరాలలో గత సంవత్సరం ఫిబ్రవరిలో ఏర్పడిన గాయత్రీ పరివార్ ట్రస్టు కార్యాలయానికి ఈ సంవత్సరం జనవరి 30న ప్రారంభోత్సవం జరిగింది. ట్రస్టుబోర్డు సభ్యులు శ్రీకారుమూరి జనార్దన్ దంపతులు బెస్తపాలెం సూర్య బజారులోని తమ గాయత్రీ టవర్స్‌లోని 500 చదరపు అడుగులకుపైగాగల హాలును కార్యాలయంకోసం ఉచితంగా ఇచ్చారు. ప్రతాప్ ఇండస్ట్రీస్ అధినేత శ్రీ ఎమ్.వి.రమణారావు కార్యాలయాన్ని ప్రారంభించారు. శాంతికుంజ్ ప్రతినిధులు శ్రీయుతులు రాజేంద్ర యాదవ్, రోషన్ సాహు ప్రవచనాలు ఇచ్చారు. ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీ డి.వి.ఆర్.మూర్తి వాటిని అనువదించారు.

చీరాల ఐ.ఎల్.టి.డి ఫ్యాక్టరీ మేనేజరు శ్రీరామకృష్ణ మండప ఆవిష్కరణ చేసి కలశ స్థాపన, పూజ నిర్వహించారు. వాడరేవు శ్రీలలితానంద ఆశ్రమ అధిపతి శ్రీశ్రీశ్రీ అరుళానంద స్వామివారు జ్యోతి ప్రజ్వలన, అనుగ్రహ భాషణం చేశారు. శ్రీవూటుకూరి లక్ష్మణస్వామి, కె.జనార్దన్ దంపతులు గురుపూజ, గాయత్రి పూజ నిర్వహించారు. ట్రస్టు బోర్డు సభ్యులు శ్రీసిద్దా సూర్య ప్రకాశరావు సతీసమేతంగా బోర్డు ఆవిష్కరణ చేశారు. నాటి సాయంత్రం దీపయజ్ఞం జరిగింది.

కార్యాలయంలో ప్రతిరోజూ ఉదయం 4-30కు హారతి, జపం, ధ్యానం జరుగుతాయి. సాయంత్రం 5-45కు హారతి, నాదయోగ సాధన, గాయత్రీ చాలీసా పారాయణ జరుగుతాయి. ఫోన్ నం :233196

ట్రస్టు బోర్డు సభ్యులు శ్రీయుతులు ఎస్.ఎన్.ప్రసాద్, డి.బాపయ్య, డి.శ్రీనివాసరావు, ఎన్.శ్రీనివాస్, సిహెచ్.వి.చలపతిరావు, పి.భాస్కర నారాయణ, కె.జనార్దన్, శ్రీమతులు బి.కృష్ణ కుమారి, ఎన్.వి.పద్మజ, ఇంకా శ్రీమతులు పి.సువర్ణ, కె.రమాదేవి, ఎస్.పద్మ, శ్రీ చిన్నబ్బి శెట్టి కార్యక్రమ విజయానికి సహకరించారు.

## విజయవాడ కృష్ణలంకలో పంచకుండీయ గాయత్రీ యజ్ఞం

ఏప్రిల్ 24న విజయవాడ కృష్ణలంకలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి కళ్యాణమండపంలో పంచకుండీయ గాయత్రీ యజ్ఞం జరిగింది. శ్రీయుతులు వెంకటేశ్వర్లు, ఎ.వి.ఎన్.ఎస్.కుమార్ యజ్ఞాన్ని నిర్వహించారు. శ్రీయుతులు బి.ఎస్.పి.లింగం, డి.మురళీ మోహన్, కె.రాంమోహన రావు, బిషన్ సింగ్, బలవంత్ సింగ్, వినోద్ కుమార్, శ్రీమతి డి.వెంకట దుర్గ సహకరించారు.

కృష్ణాజిల్లాలో జరిగిన ఇతర కార్యక్రమాలు -

ఏప్రిల్ 1న హనుమాన్ జంక్షన్‌లో శ్రీ అడుసుమిల్లి పాండురంగా రావు గృహంలో శ్రీవెంకటేశ్వర్లు, శ్రీమతి సరస్వతి ఏకకుండీ గాయత్రీ యజ్ఞం నిర్వహించారు.

ఏప్రిల్ 4న విజయవాడలోని శ్రీ ఏ.పార్థసారథి ఆఫీసులో, 9న శ్రీ డి.సాయిబాబా షాపులో, శ్రీఎ.వి.ఎన్.ఎస్.కుమార్ షాపులో, శ్రీముకర్జీ ఆఫీసులో గాయత్రీ యజ్ఞాలు జరిగాయి.

ఏప్రిల్ 22న వెలగలేరు గ్రామంలో శ్రీయుతులు వెంకటేశ్వర్లు, ఎ.వి.ఎన్.ఎస్.కుమార్ ఏకకుండీ గాయత్రీ యజ్ఞం నిర్వహించారు. 23న గన్నవరం మండలం సావరగూడెం గ్రామంలో శ్రీసూర్యదేవర సుబ్బయ్య చౌదరి గృహంలో ఏకకుండీ గాయత్రీ యజ్ఞం జరిగింది. 27న హనుమాన్ జంక్షన్ మండలంలోని బాపనపాడు గ్రామంలో ఏకకుండీ గాయత్రీ యజ్ఞం జరిగింది.

## గొల్లపెల్లిలో గాయత్రీ యజ్ఞం

చైత్ర పూర్ణిమ హనుమాన్ జయంతి రోజున జగిత్యాల సమీపంలోని గొల్లపెల్లిమండల కేంద్రంలో ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీ ఆదెపు గంగారాం గాయత్రీ యజ్ఞం నిర్వహించారు. శ్రీ పి.లక్ష్మీనారాయణ సహకరించారు.

## జగిత్యాలలో ప్రముఖుల సమావేశం

శాంతికుంజ్ ప్రతినిధి శ్రీ రాజేంద్ర యాదవ్ రాక సందర్భంగా మే 8న శ్రీ ఆదెపు గంగారాం గృహంలో గాయత్రీ యజ్ఞం, పట్టణ ప్రముఖుల సమావేశం జరిగాయి. శ్రీ సత్యానంద మహర్షి గీతాశ్రమ కార్యకర్తలు, చిన్మయ మిషన్ మాతాజీ శాంతానంద స్వామిని, సాందీపని విద్యాలయం వ్యవస్థాపకులు శ్రీమైనేని విద్యాసాగర్ రావు పాల్గొన్నారు.

**సౌశీల్యం, సమత, ఉదారత, సహకారముల నిర్మాణం యుగ నిర్మాణ యోజన లక్ష్యం.**

## రెడ్డిపల్లిలో గాయత్రీ యజ్ఞం

మే 9న విశాఖ జిల్లా పద్మనాభం మండలం రెడ్డిపల్లి గ్రామంలో శ్రీవైదా గురునాథరావు గృహంలో ఏకకుండీ గాయత్రీ యజ్ఞం జరిగింది. శ్రీ పండా యజ్ఞాన్ని నిర్వహించారు.

విశాఖజిల్లాలో జరిగిన ఇతర కార్యక్రమాలు -

మే 1న భీమిలి శ్రీదుర్గా గాయత్రీ శక్తి పీఠంలో విద్యారంభ సంస్కారం జరిగింది. మే 8న భీమిలి - విశాఖ సాగర తీరంలోని గీతం కాలేజిలో శ్రీ పి.శ్రీనివాసు ఆధ్వర్యంలో ఏకకుండీ గాయత్రీ యజ్ఞం జరిగింది.

## మల్లికుదుర్లలో ఆశ్రమం శంకుస్థాపన

వరంగల్ జిల్లా ధర్మసాగర్ మండలంలోని గాయత్రీ శక్తిపీఠంలో మే 30న యజ్ఞశాల, ఆశ్రమాలకు శంకుస్థాపన, పంచకుండీయ యజ్ఞం జరిగాయి. శ్రీమతి అనసూయమ్మ, శ్రీయుతులు మల్లికార్జున గుప్త, పుష్యమిత్ర, రాజు కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీయుతులు గౌరిశెట్టి వెంకటేశ్వర్లు, మార్గం సదానందం, సిహెచ్.కుమార స్వామి, బి.చంద్రయ్య, కోడం రాజేందర్, శేఖరయ్య, కోడం దామోదర్ సహకరించారు. కార్యక్రమంలో 500మంది పాల్గొన్నారు.

## శ్రీకాకుళంలో జ్ఞానపరీక్ష బహుమతి ప్రదానోత్సవం

శ్రీకాకుళంలోని గాయత్రీ మోడల్ స్కూలులో నిర్వహించిన భారతీయ సంస్కృతి జ్ఞాన పరీక్షకు 8 పాఠశాలల నుండి 441 మంది విద్యార్థులు హాజరైనారు.

మార్చి 30న ఆ పాఠశాలలోనే బహుమతి ప్రదానోత్సవం జరిగింది. డా॥కె.అమ్మనాయుడు ముఖ్య అతిథిగా విచ్చేశారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా॥పులఖండం శ్రీనివాసరావు సభా కార్యక్రమాలను నిర్వహించారు. పరీక్ష కోఆర్డినేటర్ శ్రీ హయగ్రీవ రావు పరీక్ష గురించి తెలిపారు. మొదటి మూడు ర్యాంకులు సాధించినవారికి బహుమతులుగా యుగ సాహిత్యం గ్రంథాలు ప్రదానం చేయబడ్డాయి. జిల్లా స్థాయిలో మొదటి మూడు ర్యాంకులు గాయత్రీ మోడల్ హైస్కూల్ వారికే వచ్చాయి.

## శ్రీకాకుళంలో గాయత్రి లఘు అనుష్ఠానం

శ్రీకాకుళంలో శ్రీ హయగ్రీవ రావు ఉగాది నుండి శ్రీరామనవమి వరకు గాయత్రి లఘు అనుష్ఠానం నిర్వహించారు. నవమినాడు గాయత్రీ హవనం జరిపారు. శ్రీప్రాణంగపల్లి గోదావరి రాజు కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ ఎన్.కృష్ణమూర్తి కూడ ఈవిధంగా లఘు అనుష్ఠానం నిర్వహించారు.

## శ్రీకాకుళంలో గాయత్రి అనుష్ఠానం

శ్రీకాకుళం హౌసింగ్ బోర్డు కాలనీలో బాసంగి శ్రీరాములు, లక్ష్మీనరసమ్మ దంపతులు ఫిబ్రవరి 13 వసంత పంచమినాడు 40 రోజుల గాయత్రీ అనుష్ఠానం ప్రారంభించారు. మార్చిలో హోళికా పౌర్ణమినాటికి 80,640 గాయత్రీ మంత్రజపం పూర్తి చేశారు. ఆరోజున పూర్ణాహుతిలో యజ్ఞానికి శ్రీమతి బి.సంధ్యశ్రీ ఆధ్వర్యం వహించారు.

## పార్వతీపురంలో జ్ఞానపరీక్ష బహుమతి ప్రదానోత్సవం

పార్వతీపురంలో ఇటీవల జరిగిన భారతీయ సంస్కృతి జ్ఞాన పరీక్ష బహుమతి ప్రదానోత్సవంలో ఆరుగురు విద్యార్థినీ విద్యార్థులకు నగదు బహుమతులు, జ్ఞాపికలు ప్రదానం చేశారు. పార్వతీపురం మున్సిపల్ కమీషనర్, సూర్యపీఠం నిర్వాహకులు శ్రీవేమకోటి నరహరి శాస్త్రి, గాయత్రీ ఉపాసకులు శ్రీసంతోష్ అగ్నిహోత్రి, శ్రీ పి.వి.రమణ మూర్తి అతిథులుగా విచ్చేసి బహుమతులు ప్రదానం చేశారు.

పార్వతీపురంలో జరిగిన ఇతర కార్యక్రమాలు -

జనవరి 25న పేర్ల మణికుమార్, సరిత దంపతుల దీపయజ్ఞం. ఫిబ్రవరి 13న పేర్ల రమణమూర్తి, వసుంధరా దేవి దంపతుల దీపయజ్ఞం. ఫిబ్రవరి 24న ఏ.మోహన్‌రావు, కన్యాకుమారి దంపతుల దీపయజ్ఞం. మార్చి 8న పి.వి.కె.మణికుమార్, సరిత దంపతుల దీపయజ్ఞం. మార్చి 25న ఎమ్.నారాయణ రావు, సుబ్బలక్ష్మి దంపతుల దీపయజ్ఞం. చైత్ర పూర్ణిమనాడు పి.విజయశంకర్, ప్రభావతి దంపతుల దీపయజ్ఞం; ఆరు జన్మదిన సంస్కారాలు.

వసంత నవరాత్రి సందర్భంగా 14మంది 6,77,900

**శాంతి మన మనస్సుకు సంబంధించింది; పరిసరాలలో స్థాపించుకునేది కాదు.**

గాయత్రీ మంత్ర జపం చేశారు. పి.వి.రమణమూర్తి, వసుంధరా దేవి దంపతులు పూర్ణాహుతి యజ్ఞం నిర్వహించారు.

పై కార్యక్రమాలు శ్రీమతి వసుంధరా దేవి ఆధ్వర్యంలో పార్వతీపురం గాయత్రీ మందిరంలో జరిగాయి.

## రాజమండ్రిలో సహస్రదీపయజ్ఞం

రాజమండ్రిలోని ప్రకాశ్‌నగర్ లేడీస్ క్లబ్ ఆవరణలో ఏప్రిల్ 28న వేయి దీపాలతో దీపయజ్ఞం జరిగింది. శ్రీమతి ద్రాక్షారపు ఉషారాణి ఆధ్వర్యం వహించారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీమతులు జక్కంపూడి విజయలక్ష్మి, లక్ష్మీ శ్రీనివాస్‌లు యజ్ఞం నిర్వహించారు. శ్రీమతి జక్కంపూడి విజయలక్ష్మి గాయత్రీ ప్రార్థనా గీతాలు ఆలపించారు. యజ్ఞంలో పాల్గొన్నవారందరూ గాయత్రీ మంత్రం పఠించారు. రాజమండ్రి శాసనసభ్యులు శ్రీ రౌతు సూర్యప్రకాశ రావు, కార్పొరేటరు శ్రీమతి సూరవరపు రాజ్యలక్ష్మి దీపయజ్ఞంలో పాల్గొన్నారు.

## హైదరాబాదు ఏ.సి.గార్డ్స్‌లో 150 మందికి గురుదీక్ష

హైదరాబాదు ఏ.సిగార్డ్స్‌లోని వెంకటరమణ అపార్ట్‌మెంట్‌లో శ్రీచెన్నకేశవులు కోడలు శ్రీమతి ప్రీతి పుంసవన సంస్కారం సందర్భంగా యజ్ఞం జరిగింది. 150 మంది గురుదీక్ష తీసుకున్నారు. శ్రీమతి సుజాతకు కూడ పుంసవన సంస్కారం జరిగింది.

ఆస్ట్రేలియాలోని శ్రీమతి స్మితకు వీరితోపాటు 2 గంటలసేపు ఫోన్ ద్వారా పుంసవన సంస్కారం జరిగింది. ఆ రెండు గంటలసేపు అక్కడ దంపతులు కూర్చున్నారు. దేవుని సన్నిధిలో దీపం, అగరువత్తులు వెలిగించారు. భావనాపూర్వకంగా పుంసవన సంస్కారం జరిగింది. శ్రీమతి అనసూయమ్మ పుంసవన, గురుదీక్ష కార్యక్రమాలను నిర్వహించారు.

## హైదరాబాదు బోరబండలో నవకుండీయ గాయత్రీ యజ్ఞం

హైదరాబాదు బోరబండలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో శ్రీకన్యకామ్మవారి జయంతి సందర్భంగా నవకుండీయ గాయత్రీ యజ్ఞం జరిగింది. మే 17న కలశయాత్ర, 18 ఉదయం యజ్ఞం, సాయంత్రం సహస్రదీప మహాయజ్ఞం, గాయత్రీ మంత్రదీక్షలు, శ్రీమతి వాణికి పుంసవన సంస్కారం జరిగాయి. శ్రీయుతులు రాజేంద్ర యాదవ్, పుష్యమిత్ర, కేశవరావు, శ్రీమతులు అనసూయమ్మ, నాగమణి కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీమతులు ప్రమీల హనుమంత రెడ్డి, ఇందిరమ్మ, భాగ్యమ్మ, శ్రీ సత్యనారాయణ సహకరించారు.

M M M

## మహారాణి అయిన శారదా సుందరి

బెంగాల్‌లోని వర్ధమాన్ జిల్లాలో ఒక పల్లెటూరిలోని పూరింట్లో శారదా సుందరి జన్మించింది. కన్య గుణ సౌందర్యాలు చూసి ఒక జమీందారు కొడుకు ఆమెను వివాహమాడాడు. జమీందారీ కోర్టు పర్యవేక్షణలో ఉన్నది. ఆ యువకుడు ఇంగ్లీషు వారి ప్రభావంలో అన్ని దుర్గుణాలు అల్ప వయస్సులోనే అలవాటయి ఆత్మ హత్య చేసుకున్నాడు. శారదా సుందరి (అత్తవారింట్లో స్వర్ణమయిగా పిలువబడేది) 18 సం॥ పిన్నవయస్సులోనే వితంతువు అయింది. ఇంగ్లాండు ప్రభుత్వం జమీందారీ జప్తు చేసి సంవత్సరానికి పదిహేను వందలు భరణం నిర్ణయించింది. ఆమె సుప్రీం కోర్టు వరకు వెళ్ళి జమీందారీ తిరిగి పొందింది. తన స్వశక్తితో వ్యవహారాలు నిర్వహించేది. భర్త చేసి వెళ్ళిన లక్షలాది రూపాయల అప్పు తీర్చి, ఆదాయంలో అధిక భాగం ఆ ప్రాంతంలోని నిరుపేద పిల్లల ప్రగతికి వినియోగించింది. షుమారు 60 లక్షల రూపాయలు ఆ విధంగా ఖర్చు చేసింది. చాలా నిరాడంబరంగా ఉండేది. ఆమె నిర్వహణతో ప్రసన్నమైన ఆంగ్ల ప్రభుత్వం "మహారాణి" బిరుదుతో ఆమెను గౌరవించింది. ఆమె సామర్థ్యం ఇప్పటికీ ప్రశంసించబడుతూ ఉన్నది. అవకాశం లభిస్తే స్త్రీలు చెయ్యలేని దేమున్నది?

- ప్రజ్ఞాపురాణం నుండి

**మనిషి భావనా స్థాయిని ఉత్కృష్టం చేయడమే భావ విప్లవం.**

# యుగశక్తి గాయత్రీ కేంద్రంలో

## దేవ మానవుల ఆవిర్భావానికి దోహదంచేసే గ్రంథాలు

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. | ధైర్యం విడవకండి | 2.00 | 27. | మరణం తర్వాత మన స్థితి ఏమిటి | 5.00 |
| 2. | మానసిక సంతులనము | 2.00 | 28. | ప్రజ్ఞా పురాణ కథలు | 8.00 |
| 3. | మన గౌరవ గరిమ | 2.00 | 29. | గో సంరక్షణయే మన సంరక్షణ | 8.00 |
| 4. | సద్గురు వచనామృతం | 2.00 | 30. | గాయత్రీ హవనవిధి | 8.00 |
| 5. | గాయత్రి ఉపాసన | 3.00 | 31. | ప్రార్థన ప్రత్యక్ష చమత్కారాలు | 8.00 |
| 6. | గాయత్రి రామాయణము | 3.00 | 32. | క్రాంతి శిఖరం | 8.00 |
| 7. | గాయత్రి స్మృతి | 2.00 | 33. | యుగ యజ్ఞ పద్ధతి | 10.00 |
| 8. | ఆరోగ్య జీవన రహస్యం | 3.00 | 34. | నేను ఏమిటి | 10.00 |
| 9. | నిత్యజీవితంలో తులసి | 2.00 | 35. | ఏకాంత సహచరులు | 10.00 |
| 10. | సంస్కారాల పుణ్య పరంపర | 4.00 | 36. | కల్ప సాధన | 12.00 |
| 11. | మార్పు యొక్క మహత్తర క్షణాలు | 4.00 | 37. | ఆత్మకథ | 25.00 |
| 12. | సందేహాలు సమాధానాలు | 5.00 | 38. | నారీ మహత్య్మ ప్రకరణము | 15.00 |
| 13. | గృహలక్ష్మి ప్రతిష్ట | 4.00 | 39. | శ్రీమద్భాగవత కథ | 18.00 |
| 14. | ప్రాణాంతక వ్యసనాలు | 4.00 | 40. | కుండలినీ మహా విజ్ఞానము | 18.00 |
| 15. | పవిత్ర జీవనము | 4.00 | 41. | గాయత్రి మహా విజ్ఞానము మొదటి భాగం | 30.00 |
| 16. | ఋగ్వేద భూమిక | 4.00 | 42. | గాయత్రి మహా విజ్ఞానము రెండవ భాగం | 30.00 |
| 17. | గాయత్రి మంత్ర లేఖనం | 5.00 | 43. | గాయత్రి మహా విజ్ఞానము మూడవ భాగం | 25.00 |
| 18. | గహనో కర్మణో గతిః | 5.00 | 44. | అమృతకలశం | 25.00 |
| 19. | చాలీసా చిత్రావళి | 5.00 | 45. | వేదముల దివ్య సందేశము | 40.00 |
| 20. | ప్రతిభావంతులారా లేవండి ముందుకు రండి | 5.00 | 46. | 24 శక్తి ధారలు | 30.00 |
| 21. | మూలికా చికిత్సా శాస్త్రము | 5.00 | 47. | సూర్య విజ్ఞానము | 18.00 |
| 22. | స్వాతంత్ర్య సంగ్రామ సేనాని | 5.00 | 48. | తల్లి దీవెన (మాతాజీ సూక్తులు) | 2.00 |
| 23. | సమయదానమే యుగధర్మం | 5.00 | 49. | ఉపాసన సాధన | 10.00 |
| 24. | జీవన సాధనకు బంగారు సూత్రాలు | 5.00 | 50. | కర్మఖాండ భాస్కర | 80.00 |
| 25. | యజ్ఞం ఒక సమగ్ర శాస్త్రము | 5.00 | 51. | మాతాజీ దివ్యచరిత్ర | 40.00 |
| 26. | గురుదీక్ష | 5.00 | 52. | వంటింటి వైద్యములు | 5.00 |

**పోస్టేజి, ప్యాకింగ్ అదనం.**